విమలానందభారతీ గ్రంథమాల – 28వ పుష్పము

# వ్యాస కదంబము

(సప్తమ భాగము)

—: రచన :—

రామానందభారతీస్వామి

(కారుమంచి కొండలరావు, B. A., B. Ed.)

ప్రచురణ – అంగీరస – జ్యేష్ఠము

ప్రథమ ముద్రణము – 250 ప్రతులు

విమలానంద భారతినుండి ఉద్ధృతము

1992 జూన్ వెల రు 5-00

విజయవాడ

సమర్పణము

మా మాతామహీమాతామహులు శ్రీ॥ శ్రీ॥ శ్రీమతి
భద్రిరాజు చెంచమాంబ శ్రీ భద్రిరాజు సుబ్బయ్యగార్లకు



[illegible]దంబము సప్తమ భాగము



—: విషయసూచిక :—

# ఆ ము ఖ ము

మా మాతామహస్థానము గుంటూరుజిల్లా చీమకుర్తిదగ్గర గోనుగుంట. ప్రస్తు
తము ప్రకాశంజిల్లా. ఆయనపేరు భద్రిరాజు మల్లయ్యగారు. ఆయన ప్రథమ భార్య
లింగధారులు శ్రీ కొంపెల్లవారి ఆడబడుచు. ఆమె విస్సంతుగా మరణించుటవలన
ద్వితీయ వివాహం చేసుకొన్నారు. ద్వితీయ భార్యపేరు చెంచమ్మగారు. మా అమ్మ
మ్మగారి యింటిపేరు తెలియదు. ఆర్వేల నియోగులు. మా అమ్మమ్మలు నల్గురు అక్క
చెల్లెండ్రు. ఆమె అందరికన్నా పెద్దది కావచ్చును. వారిలో మొదటి ముగ్గురు పుణ్య
స్త్రీలుగా మరణించారు. మేమెవ్వరము మా అమ్మమ్మ చె...
హెంవికూడ నేను మాత్రమే కొంచెమెరుగుదును. నేను 8 సంవత్సరముల వయ
స్సులో మొదటిసారి అపూరికి వెళ్లాను. తరువాత వారు పోయినారు. నేను దాదాపు 10
సంవత్సరముల వయస్సులో రెండవసారి అక్కడకు వెళ్ళడం జరిగింది. మా అ...
లక్ష్మీనరసమ్మగారికన్నా ముందు ఇద్దరు మొగపిల్లలు పుట్టి పోయినారట. ఆమెకు
ముగురు చెల్లెండ్రు ఒక తమ్ముడు. వారిపేరు వరుసగా కామమ్మ, ఆదిలక్ష్మమ్మ, రామ
మ్మ, నరసింహయ్యగారలు. కామమ్మగారు దర్శితాలూకా దోనకాయలపాడు వాస్తవ్యు
లు చాచిరాజు అప్పయ్యగారి భార్య మూడవ పిన్ని బాపట్లతాలూకా పెదనందిపాడు
దగ్గర కొమ్మూరు వాస్తవ్యులు గంగరాజు చలపతిరావుగారిభార్య. రెండవ పిన్ని లింగ
ధారులు ముదిగొండవారి కోడలు. పేరక్కగారు ఆమెను మా స్వగ్రామము దర్శిలో
మాఅమ్మ పురిటికి తీసుకురాగా మగశిశువును ప్రసవించి ఆమె మరణించినది. నాకప్పు
డు 3 ఏండ్లు. మాఅమ్మ పెంచెదనన్నను వినక తండ్రి కొడుకును తీసుకొనిపోగా శిశువు
త్వరగానే పోయినాడు

మాతాత కుమార్తెల పెండ్లిండ్లు అన్నిచేసీ కుమారుడు నరసింహయ్యకు ఉప
నయనము చిన్నప్పుడేచేసి మరణించారు. మా అమ్మ అందరికన్నాపెద్దది గనుక అంద
రిని కొంచెము కనిపెట్టి చూచింది. మా మేనమామను పెంచింది. ఆయనకు చదువంట
దు. ఆయన ఆస్తిని వరుసగా మొదటి రెండవ, నాల్గవ బావగార్లు చూచారు. నాల్గవ
బావ ఆ ఆస్తినంతా అమ్మివేసి ఆయనకు పెండ్లిచేశాడు. భార్య లింగధారి కొంపెల్ల
ములింగయ్యగారి కూతురు వరలక్ష్మమ్మగారు ఆపెండ్లికి నేనుకూడా వెళ్ళాను. ఆమె
తరువాత కొద్దికాలానికే స్వర్గస్తురాలైంది. కొన్నాళ్లు ఆబావగారికి పేద్యం పనులలో
సహాయముచేసి మా మేనమామ విజయవాడ వచ్చాడు వంట వచ్చుటవలన కొన్నాళ్లు
అయ్య హోటలులోను, తరువాత వేరువేర్ల వేరు ఊళ్ళలో ఉన్నాడు. చివరకు
...గి విజయవాడ వచ్చి చివరరోజులలో నాదగ్గర వుండి శ్రావణ బహుళ ఏకాదశి
రాత్రిలో మరణించాడు. కర్మ నేనే జరిపించాను. పుత్రసంతతి లేక ఆవంశ మల్లం

## తప్పొప్పుల పట్టిక

| పుట | పంక్తి | తప్పు | ఒప్పు | పుట | పంక్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|---|---|---|---|
| 2 | 7 | పెకి | పైకి | 24 | 12 | రమ్యదం | రమణదం |
| | 10 | [illegible] | [illegible] | 9(27) | 20 | కుంటవా | కుంటుందా? |
| | 31 | ఉన్నదో | ఉన్నదో | 10(28) | 18 | అడుకుంటూ | ఆడుకుంటూ |
| 4 | 20 | రయా | రష్యా | 31(33) | 18 | ఉందవి | ఉన్నవవి |
| | 23 | 70 80 | 76,80 | 36 | 17 | తిమకోవి | తినుకోవి |
| 8 | 2 | పెరిటిన | పెంటనేఅయినా | | 18 | అలి | అవి |
| 9 | 8 | వినాయి | వినారు | | 28 | రెండోవ | రెండవ |
| | 4 | కార్యకార్య | కార్యాకార్య | 63 | 26 | కనబడవు | కనబడదు |
| 10 | 7 | [illegible] | [illegible] | 66 | 17 | అవిశ్రుతులు | అవిశ్రుతులు |
| | 8 | మున్నా | మున్నా, | | | 2-4-11 | 3-10 |
| | 18 | మిధునం | మిథునం | 60 | 1 | దేవదేవులు | దేవదేవులు |
| 11 | 7 | ధారుల | ధారిణులు | 62 | 1 | సాధారుణులు | సాధారణులు |
| 12 | 15 | తరువాతపే | తమమతప్వే | 65 | 25 | ఆంధ్ర | ఆంధ్రకవి |
| | 16 | వద్ద | వలె | | 26 | కవిసార్వభౌమ | సార్వభౌమ |
| | 17 | అవిధంగా | ఆవిధంగా | 67 | 20 | వాడేంనే | వాదాలైన |
| | 20 | వియన్నరి | వియన్నాలో | 69 | 16 | అర్థము | ఆర్థము |
| | 23 | అంధు | అంధుగర్వమైన | | 21 | లౌకికౌడు | లౌకికుడు |
| 13 | 14 | మొదం | మొదటి | | 26 | ఆఫ్రి | ఆఫ్రికా |
| 17 | 7 | ధర్మశేమి | ధర్మశేమిటో | 74 | 17 | ఉన్నతైన | ఉత్తరమైన |
| 18 | 25 | ఇట్లాటివు | ఇట్లాంటితప్పుడు | | | | |
| 19 | 11 | మైన | మైన | | | | |

# సమష్టి కుటుంబం

బ్రహ్మాండము (macrocosm) లో ఉన్నదే పిండాండము (microcosm)లో ఉన్నదని మనసిద్ధాంతము మనదేకాదు, పాశ్చాత్యసైంటిస్టులు కూడ అణువులో సూర్యకుటుంబంలాంటి విశ్వాన్ని చూస్తున్నారు. అట్లై విశాల విశ్వానికి ఉమ్మడి కుటుంబం మచ్చుతునక. వసుధైక కుటుంబానికి.

విశాలవిశ్వంలో ఎట్లా జయప్రదంగా నడచుకోవలెనో శిక్షణ యిచ్చే మొదటి విద్యాలయం ఇది. ఇంటగెల్చినవాడు రచ్చలో అద్భుతవిజయాలు సాధిస్తాడు. ముందు పాఠశాలలో, తరువాత తనపల్లెలో, నగరంలో, విశాల ప్రపంచంలో ఎట్లా నడవాలో నేర్పేది మన ఉమ్మడి కుటుంబం. పాశ్చాత్యకుటుంబ వ్యవస్థకాదు. అందులో రెక్కలు రావడం తోటే పక్షుల్లాగా ఎగిరిపోతారు. భార్యాభర్తలు చెట్టాపట్టాలు పట్టుకొంటూ, విచ్చలవిడిగా విహరిస్తూ, కాముణ్ణారాధిస్తూ, తక్కినవారి సంగతి, బాధ్యతలు విస్మరించి తైతక్కలాడతారు. కుదరదని విడాకులుకూడా పుచ్చుకుంటారు.

మన సమష్టికుటుంబం ప్రేమానురాగాలతో పెరిగేది. అందరికి ఆనందము సుఖముస్వేచ్ఛ యిచ్చేది. కుటుంబంలో యజమాని ప్రేమించి గౌరవించవలసిన తల్లిదండ్రులు ఇతరవృద్ధులు ఉంటారు. శైశవంనుంచికూడ పెద్దలను గౌరవించవలెనని, వారికి సహాయపడవలెనని నేర్చుకుంటారు. శిశువుల దగ్గఱనుంచి యువకులవఱకు తగిన విద్యాబుద్ధులు చెప్పిస్తూ తల్లిదండ్రులు వారిని పైకి తెస్తారు. ఇందులో వికలాంగులు, తెలివితేటలు తక్కువైనవారు ఉండవచ్చు. వారు కూడ సుఖంగా జీవించడానికి యజమాని వీలు కల్పిస్తాడు. ఇందులో గృహస్థుకు తోడు నీడగా, అండగా ఉండి, తగిన సలహాలిస్తూ ఆతని భార్య సహకరిస్తుంది. భార్యాభర్తలు అన్యోన్యానురాగంతో ఇంటిని తమకేకాక అందరికి సుఖస్థానంగా స్వర్గంగా తీర్చి దిద్దుతారు వీరందరిని సరిగా నడిపించడానికి మనకు ధర్మం బోధిస్తవి శాస్త్రాలు, రామాయణ భారతాది గ్రంథాలు. వాటి పఠనం అతిముఖ్యం పాశ్చాత్యులలోవలె పొట్టకూటి విద్యకు అగ్రస్థానంకాదు. అది యిక్కడ కులవిద్య. శక్తిసామర్థ్యాలు వంశపారంపర్యంగా వచ్చిన, జన్మతః వచ్చిన వాటిని కుటుంబంతీర్చి దిద్దుతుంది. అందువలన నిరుద్యోగసమస్యలేదు. ఇందులో ఎవరినీ అణగద్రొక్కడం, మేధావులైనవారిని పైకి పోకుండ ఆపడాలు, ఇతర విద్యలలో తమకు శక్తి ఉంటే అవి వద్దనడాలు లేవు. వాటికిగూడకుటుంబం సహాయంచేస్తుంది. ప్రోత్సహిస్తుంది.

ఇందులో అంతా సమానంకాదు యజమాని తన తలిదండ్రులను గురువులను దేవతలుగా భావించి పూజించాలి తన అస్థితికి కారకులైన తల్లిదండ్రుల యెడల కృతజ్ఞత చూపాలి. పాశ్చాత్యులవలె విడిచిపెట్టి పోవడంకాదు. అన్నలు

అంత మేధావులు కాకపోవచ్చు తనకు సహాయంచేసి ఉండకపోవచ్చు. అయినా వారిని గౌరవించడం, సహాయపడడం తనవిధి, డ్యూటీ. ఇక్కడ పనిచేసేది ధర్మబుద్ధి. వర్తకబుద్ధికాదు. పాశ్చాత్య సంస్కృతి మనధర్మబుద్ధిని నాశనంచేసి వర్తకబుద్ధిని పుట్టించింది." "మనలను సరిగాచూడని తల్లిదండ్రులను, అన్నలను మన మెందుకు సరిగా చూడాలి. మన సౌకర్యాలు వదలుకొని, సుఖాలు మాను కొని వారినెందుకు పోషించాలి" అని యీ పాశ్చాత్య సంస్కృతి దాసులు అడుగుతున్నారు. ఇందులో ఇంకా కొందరు "కాను వారు మనలను కన్నవారు, మనలను పైకి తీసుకరావడం వారి విధిడ్యూటీ - వారివిధి చేశారు. అందులో గొప్ప యేముంది? మనం వారి కెందుకు కృతజ్ఞులుగా ఉండాలి?" అని అంటున్నారు. విధిని సక్రమంగా నెరవేర్చడాన్ని మెచ్చుకోవడాలులేదు పైగా చులకనగా చూడడం, తనకు అటువిధిలేదనుకోవడం. ఇది ప్రస్తుతం మన విద్యాదీక్యత. ఇహము లేదు పరము లేదు. తార్కికంగా (Logical) ఆలోచించడం కూడ లేదు

ఈ ఉమ్మడి కుటుంబం విలువ మనవాండ్లు విస్మరించారు ఇది పిల్లలను ప్రేమతో పైకి తీసుకవస్తుంది. త్యాగం, పరోపకారం నేర్పుతుంది. దయాదాక్షిణ్యాలు పెంచుతుంది. ఇందులో ఎవరు ఎవరికి బానిసలుకారు. వారుసుఖంగాజీవించడానికి వేలు జీవితాలు జీవిస్తూ సమిష్టిగా కుటుంబగౌరవాన్ని ప్రతిష్ఠను పెంచుతారు. సమిష్టి కుటుంబం అనాథ లకు దిక్కులేనివారికి సుఖంగా జీవించడానికి తోడ్పడుతుంది. ప్రతివ్యక్తి తన శక్తి సామర్థ్యాలనుబట్టి మొత్తం కుటుంబం క్షేమం ఆలోచిస్తాడు తానెక్కువ సంపాదించేవాడైనా తన సౌకర్యం, సుఖం కంటే తక్కినవారి సుఖంకోసం యత్నిస్తాడు తక్కినవారు కూడ అతని త్యాగాన్ని గుర్తించి, మెచ్చుకొని, హర్షించి, అతనికి ఎక్కువ సుఖాన్ని కల్గిస్తారు. అసూయాద్వేషాలు కొందరు ఇందులో పెంచుకుంటారు అధికారులుండవచ్చు గృహ విధులలో అందరు చిన్నపిల్లలనుండి వృద్ధులవరకు వారు చేయగల్గిన సహాయం చేస్తారు. సమస్యలు వచ్చినప్పుడు యజమాని అందరితో సంప్రదించి ఏది మంచిదో నిర్ణయించి పనిచేస్తాడు వృద్ధులు తమ అనుభవంతో, విజ్ఞానంతో మంచిసలహాలిస్తారు. ఒకప్పుడు చిన్నవారు స్త్రీలు కూడ మంచి సలహా చెప్పవచ్చు. వాటిని తృణీకరించరు. బాలాదపి సుభాషితమ్ మంచిమాట బాలుడు చెప్పినా వినాలి. వింటారు.

ఇక్కడ ఒక ముఖ్యపాఠం యజమాని నేర్చుకొని అందరికి నేర్పాలి. అన్ని తాననుకొన్నట్లుగా జరగవు తనకెంతస్వేచ్ఛ ఉన్నదో తక్కినవారికి అంతస్వేచ్ఛ ఉన్నది. కాబట్టి తనమాటే అందరు వినాలని తనసుఖమే అందరు చూడాలని కోరకూడదు. పట్టుపట్టకూడదు. సర్దుకొని అందరికి వీలైనట్లుగా సుఖము కల్గేటట్లుగా ప్రవర్తించాలి ఇది మొదటి పాఠం ఇంకొకటి చేసిన ప్రతి తప్పుకు శిక్ష ఉండాలి. అదిచేసిన వ్యక్తివయస్సు, విజ్ఞానము, తెలిసిఆశిక్ష ఉండాలి.

శిక్షసమానంగా ఉండదు. చిన్నపిల్లవాడిని కొడ్తే కళేబాధ, పెద్దవారిని మందలిస్తే కలుగుతుంది. కాబట్టి శిక్షలు సమానంగా కనబడకపోవచ్చు. శిక్షద్వేషంతో వేయడంకాదు వారిని బాగుచేయాలని ప్రేమతోనే శిక్ష. యజమాని పనులతొందర వలన శిక్షవేసి వెళ్తాడు. దాని న్యాయాన్యాయాలు, వాడి కర్తమయ్యేటట్లు పెద్దలు వాడికి వివరిస్తారు సామరస్యం నెలకొల్పుతారు. లేని ద్వేషాలు పుట్టించరు. వీరపాటున కల్గేద్వేషాలను చంపుతారు చంపడానికి యత్నిస్తారు. అందులో అనురాగాన్ని చూడడం నేర్పుతారు. వృద్ధులు తమ అనుభవాలు కథలుచెప్పి పురాణాలు చదివి దిద్దడానికి యత్నిస్తారు.

ముఖ్యంగా గమనించవలసిన విషయం ఇంకోటున్నది. అందరు పాటు పడవలసింది కుటుంబంకోసం. దాని ప్రతిష్ఠ, గౌరవం కోసం. అది ధర్మంవల్ల పుణ్యంవల్ల పెరుగుతుంది కాని అధర్మం, పాపం చేయడంవల్లకాదు. శ్రీరామచంద్రుడు అడవులలోకి వెళ్ళింది సీతను త్యాగంచేసింది దానికోసమే మన పురాణగాథలు ఈ ధర్మాన్నే చెప్తవి "నా వివాహం నాసుఖంకోసం ఇతరులకందులో ప్రమేయంలేదు" అనే పాశ్చాత్య సంస్కృతి ఉత్తమమయిందికాదు. తన తెలివితక్కువవని కుటుంబగౌరవాన్ని మంటగల్పవచ్చు. తానీరోజుండి, రేపు పోతాడు. వంశం, దాని పేరుప్రతిష్ఠలు సాగుతవి. అందువలన దానిని పైకి తెచ్చేపనులు చెయ్యాలి. కించపరచేవికావు. ధర్మం, విధి అనేది అందరికి ఉన్నది అది స్త్రీలు, పురుషులు, పిన్నలు పెద్దలు అందరు పాటించాలి. పెద్దవారు అధర్మం చేసినప్పుడు, వారిని దూషించకుండ అది అధర్మమని చెప్పడం, తానట్లు చేయననడం తప్పుకాదు అయితే ధర్మమేదో నిర్ణయించడం కష్టమని అది శాస్త్రంవల్లనే తెలియువలెనని గ్రహించాలి.

కుటుంబంలో అందరు సమానులుకాదు. తాను గౌరవించవలసిన పెద్దలు, కనికరించవలసిన పిన్నలు, మైత్రి చూపవలసిన సమానులు ఉంటారు. గృహసంబంధమైన పనులు పంచుకొని యెవరిపనివారు చక్కగా చేస్తారు. పనులు సమానంకాదు కాయికశ్రమకన్న బుద్ధిశ్రమ యెక్కువ. బుద్ధి జీవుల కెక్కువ గౌరవము తప్పదు. కాయిక శ్రమ చాలవరకు ప్రతివ్యక్తి చేయగలుగాడు. మేధకుసంబంధించింది అట్లుచేయలేరు మనవారు స్త్రీలకు, ఇల్లుదిద్దడం, వంట వార్పులు అప్పజెప్పినా మేధకు సంబంధించినవి నిషేధించలేదు అవసరమైతే పురుషులు కూడ వంట వార్పు చేయగల్గాలి. కుటుంబ నిర్వహణే ప్రధానం కాని వ్యక్తి స్వార్థం కాదు.

ఈ విధంగా ఇంటిని తీర్చిదిద్దినవారు, తమగ్రామాన్ని, నగరాన్ని, రాష్ట్రాన్ని, ప్రపంచాన్నే ఉద్ధరించగలరు. మన కుటుంబపద్ధతి ఇంతగొప్పది. అది యిప్పుడు పోతున్నది. మన మొదటి, శ్రేష్ఠమైన విద్యాలయం.

## పత్రికలు - ప్రదర్శనలు

మన ప్రచారసాధనాలు పత్రికలు, టి. వి. లు, సినిమాలు వగైరాలలో రచయితలు, కళాకారులు తమ ప్రతిభను స్వేచ్ఛగా చూపలేక పోతున్నారు. ప్రభుత్వాలకు వంతపాట పాడుతూ, కామన్ సెన్సుమీద తర్కంమీద ఆధారపడిన మన నిరుపమాన సంస్కృతిని తప్పుడుగా చిత్రిస్తున్నారు. అది అధీరతను బానిసబుద్ధినే ఋజువుచేస్తుంది.

జంతువులుకూడ తమజాతిని నిల్పేతవి అన్యజాతి సంపర్కం సహజంగా కోరవు. (ఇక్కడకూడ మన పిచ్చి సైంటిస్టులు తమ పిచ్చి ప్రయోగాలు చేస్తూనే ఉన్నారు) మల్లె గింజకు మల్లెచెట్టే వస్తుంది. కుంకుడు చెట్టురాదు. దేని గుణం దానిదే. అన్నింటిలోను గుణదోషాలున్నవి అవి సంకరం కాకుండ నిల్పడమే వివేకం. సాంకర్యం అవివేకం దుష్టఫలితా లిచ్చేదివిన్నీ. ఇది జీవ ప్రపంచ ధర్మం.

ఇప్పుడు మన ప్రభుత్వాలు జాతి మత కుల భేదాలు పోవాలంటారు. ప్రతిచోట, అనవసరంగా, కళాభంజకంగా, మన కళాకారులు, రచయితలు ఈ అసహజత్వాన్ని ప్రచారం చేస్తున్నారు వీరు ధీయలైన కళాకారులా? బీజశుద్ధి క్షేత్రశుద్ధి, రెండు ప్రధానమని మనశాస్త్రాలు 'అంతస్థులు' లో పెద్దద్నాయి 'రాణి' ని మెచ్చుకుంటూ బీజప్రాధాన్యాన్ని వర్ణిస్తాడు. ఇట్లాటివి చాలా ఉన్నవి. ఇవి పరస్పర విరుద్ధాలుగా లేవా?

ఈ భేదాలు సర్వానర్థాలకు మూల మనడం అజ్ఞానం అనర్థాలకు మూలము మనుష్యుని స్వార్థం, రాగద్వేషాలు. ఈ భేదాలు లేని జర్మనీ రష్యాలలో హిట్లరు, స్టాలిను ప్రభృతులు లక్షల కొలది జనుల ప్రాణాలు తీశారు. అధికార వాంఛ మహాదారుణ కృత్యాలకు దారితీస్తుంది. బుద్ధుడు, అగ్బరు, నానక్, గాంధీజీ వగైరాలు ఈ భేదాలు తీసివేయ యత్నించి విఫలులైనారు. 70, 80 సంవత్సరాల క్రిందట మనగ్రామా లీ భేదాలతోనే కలిసికట్టుగా ఉండి ఎట్లు శాంతిసుఖా లనుభవించినవో చూచినవారు, చెప్పే గ్రంథాలు ఉన్నవి. ఈ ద్వేషాలు బ్రిటిషువారి, అచదువు చదివిన మనవారి బోధవలన వచ్చినవి. ఈ సహజభేదాల నంగీకరించి ప్రణాళిక వేయుట మేలు చేస్తుంది కాని లేని సమానత్వం మీద వేసిందికాదు. మేధావులు సత్యం చెప్పాలి. పాలకులను మార్చాలి. అధికారానికి వంతపాట పాడకూడదు.

—

## దేవాలయం చిత్రసమీక్ష

ప్రతిభగల కవి తన నేర్పువలన తిమ్మిని బమ్మి బమ్మిని తిమ్మి చేయగలడు. ధర్మాన్ని అధర్మంగా, అధర్మాన్ని ధర్మంగా చిత్రింపగలడు. అందువలన కవి చెప్పిన దంతా ధర్మం కాదు. ధర్మం చెప్పినవాడే నిజమైన కవి. అట్లే, వచ్చిన చిత్రమల్లా ధార్మికమయింది, ఉత్తమమయింది కాదు. ధార్మికమైన చిత్రాన్ని ప్రదర్శించినవాడే నిజమైన ఉత్తమకళాకారుడు. విశ్వశ్రేయస్సును గూర్చిందే నిజమైన కావ్యము. తక్కిన వన్నీ పిచ్చికవితలు, చిత్రాలు. కడివెడు పాలలో ఒక్క విషబిందువువడ్డా మొత్తం పాలు విషమే, విషపరిణామము కలదే అవుతుంది. టి.వి. లో 17-6-89న వచ్చిన దేవాలయము అనే చిత్రంకూడ అట్టి విషమిశ్రితమైనదే.

దౌర్భాగ్యవశమున మనదేశపాలన మ్లేచ్ఛుల, నాస్తికుల శూద్రులచేతులలో పడ్డది. విద్యాలయాలు, దేవాలయాలు సర్వానికి ఇప్పుడు వారిదే అధిపత్యము. చంద్రగుప్తుడు భారతాన్ని పరిపాలించిన ప్రథమ శూద్రుడు. అయినా అతనికి బ్రాహ్మణుడైన చాణక్యుడు గురువు. తెనుగునేల నేలిన రెడ్డిరాజులు బ్రాహ్మణభక్తులై, అంటే ధర్మభక్తులై ధర్మాన్నే పెంపొందించారు. బ్రిటిషువారి కూటనీతి శాస్త్రద్వేషాన్ని, బ్రహ్మద్వేషాన్ని పుట్టించిపెంచింది. అందులో తయారైన గాంధీ నెహ్రూ టాగూరు ప్రభృతులు శాస్త్రాలకు తప్పుడర్థాలు వ్రాసి, ధర్మధ్వంసకులైనారు. అపౌరుషేయ ధర్మశాస్త్రాన్ని పెడత్రోవ పట్టించారు. శూద్రుడైన వివేకానందస్వామి, మహాశంకర భక్తుడు, శాంకరసిద్ధాంతాన్ని సర్వప్రపంచానికి అందిచ్చిన స్వామి, తనగురువైన శంకరులవారికి విరుద్ధంగా జాబాలిని వేశ్యాపుత్రుణ్ణి చేశారు. 'నాయనా నేను జబాల కొడుకును, సత్యకాముణ్ణి, నాకు గోత్రం తెలియదని గురువుతో చెప్పరా' అన్న వైదికకథను ఆస్వామి —తెలియదనడానికి, లేదని అర్థం చెప్పారు. శూద్రుడు నాగోత్రమేమిటని అడుగుతాడా? వేశ్యకెప్పుడైనా, ఎక్కడైనా గోత్రముంటుందా ? గౌరవముంటుందా ? ప్రస్తుతం కూడా, పాశ్చాత్యదేశంలోకూడ వేశ్యలను, ఎంతధనవంతులైనా, నీచంగా అగౌరవంగా చూస్తారు. "నేను వేశ్యాపుత్రుడనని చెప్పుకో నీకు గౌరవంకల్గుతుంద"ని తల్లి అనగలదా? సత్యం భయపడక, దాచకచెప్పారని గురువు(అపల్ల వాడికిసత్యకాముడని ఆపేరిదివరకే అతనికున్నదని తల్లి మాటవల్లనేతెలుస్తుంది. గురువిచ్చిందికాదు.) పేరుపెట్టాడని వివేకానందులువ్రాశారు. దానిని వావిలికొలను సుబ్బారావుగారు, రాధాకృష్ణపండితులుస్వీకరించి

ప్రచారం చేశారు. ఇక అజ్ఞానులైన నేటి కళాకార కవినామధారులు మనపురాణగాథలను ధర్మాన్ని వక్రంగా చిత్రించడంలో ఆశ్చర్యమేమున్నది.

అచ్చయిన ప్రతిదీ వేదవాక్కనుకుంటారు అమాయికులు, సినిమాలో వచ్చిన ప్రతికథా సత్యమనుకుంటారు అజ్ఞానులు. మనపురాణ గాథ తెలుగని ఒకచరిత్రకారుడెవడో ఋషభుని కొడుకైన భరతునివలన మనదేశానికి భరతవర్షము భరతఖండము అనుపేరు వచ్చిందని తెలుసుకోలేక, దుష్యంతుని కొడుకైన భరతునివలన దీనికి పేరువచ్చిందని వ్రాశాడు. అది తప్పని పండితులు చెప్పారు. అదెవరువింటారు? మొన్న (18-6-88 ఇండియన్ ఎక్స్‌ప్రెస్సు) 'విశ్వామిత్ర'లో మనముఖ్యమంత్రికూడ అదేపాటపాడాడు. ఇప్పుడాయన తెలివితేటలు, పుట్టుకవల్లనే బ్రాహ్మణత్వం రాదనడం, కులాలు లేవనడం. తాను బ్రాహ్మణుడుగా చలామణి కావాలనుకోవడం. విశ్వామిత్రజన్మకు కారణం, అతని మేనమామ ఋచీకుడుకల్పించిన బ్రాహ్మణ చరువు, తరువాత ఆయన చేసిన ఘోరతపస్సు తరువాత ఆయన వంశమే పుట్టుకవల్లనే బ్రాహ్మణవంశమయింది. ఈసత్యం తెలిసికోలేక అందరికి బ్రాహ్మణత్వమిచ్చే, కులాలు నిర్మూలించే క్రొత్త విశ్వామిత్రుణ్ణి సృష్టిస్తున్నాడు. సత్యం చెప్పినా వినదు లోకం.

దేవాలయచిత్రంలో హీరో అయిన శంకరుడు దేవుడులేడని, రాళ్లను దేవుళ్ళనడం దానికి లక్షలుపెట్టి దేవాలయాలను కట్టించడం డబ్బు తగులబెట్టడం అని వాదిస్తాడు. ఇది యిప్పటి యువకులకు గొప్ప సిద్ధాంతం, లాజిక్, డిస్కవరీ. అత్యంత సమర్థులైన మానవుల యత్నాలను వెక్కిరించే ఒక ప్రధాన అతీతమైన శక్తి (దైవం) ఉన్నదా లేదా అనేది ప్రస్తుతానికి వివాదించడం మానుదాం. (లేదని విజృంభించిన హిరణ్యాక్షహిరణ్యకశ్యపులు, నెపోలియన్ హిట్లరు వగైరాలు గద్దె కరచారు) అసలు దేవాలయసంస్థవల్ల మేలేలేదా? మసీదులు, చర్చిలు ఇతర మతాల కున్నవి. వాటిని అమతాలవారు ద్వేషించరు. అవి ఎందరిని పోషిస్తున్నవి? దేవాలయమంటే విగ్రహాలు, వాహనాలు—మన శిల్పకళ ఎంత అభివృద్ధి పొందింది! మనశిల్పకళకు పాశ్చాత్యులుకూడ విభ్రాంతిచెంది, మోహించెంది, విపరీతమైన ధనాలకు ఆకళాఖండాలను ఇప్పుడుకూడ కొంటున్నారు. తిరుపతి క్షేత్రం పోషించగల కళలను ఏధనవంతుడు, ఏచక్రవర్తి పోషించగలడు? దేవాలయాలను నిర్మించడానికి శాస్త్రాలు, శాసించినవారు, శిల్పులు, ఎందరు వృద్ధిపొందారు? 1978లో వచ్చిన తుపానులో తెనుగుదేశంలో చర్చిలు కూలిపోయినవి. దేవాలయాలు నిల్చి అనేకులకు ప్రాణభిక్షపెట్టినవి. ఆ నిర్మాణాలు అంత బలం కలవి. ఇక పూజకు పూలవనాలు, నైవేద్యాలకు పండ్లతో

టలు వాతావరణం శుభ్రపరచే వృక్షసంపద–మేళతాళాలకు సంగీతకళ, యెంతవృద్ధి! దేవాలయాలను, విగ్రహాలను విధ్వంసంచేశారు ముస్లిములు వెనుక. బందరులో ఒకదేవాలయం ముస్లిం శిల్పులు కట్టడం నేనెఱుగుదును. శ్రీరంగం ప్రసిద్ధ వైష్ణవదేవాలయానికి మేళం వాయించడానికి ఒకముస్లిం అస్థాన విద్వాంసుడైనాడు. షేక్‌పీరా బృందం మన ప్రాంతంలో కూడ మేళానికి ప్రసిద్ధవిద్వాంసులై మనఉత్సవాలలో పాల్గొంటూ పోషించుకొన్నారు. విభూతులు, తిరుచూర్ణాలు, పంచపాత్రలు, ఉద్ధరిణెలు, మనదేవాలయసంస్థ అనేకకళలను పెంచింది. వందలవేల కుటుంబాలను పోషించింది. తిండిలేని వారికి వంశపారంపర్యంగా ఇప్పటికిన్నీ తిండిపెడుతున్నది. బ్రిటిషువారి నాస్తిక తొత్తులే పాలకులై, ధర్మకర్తలై, విద్యాగురువులై, శాస్త్రాలను బ్రాహ్మణులను ద్వేషిస్తూ, స్వార్థపరులై మన సంస్కృతిని, ఆలయాలను అపవిత్రం చేస్తే ఆలోపం పాలకులదా? దేవాలయ సంస్థదా? తండ్రి దేవాలయ ప్రాశస్త్యాన్ని చెప్తే వినని శంకరం తన ప్రేయసి చెప్పిన యీ సత్యాన్ని గ్రహించి దేవుడే లేడన్నవాడు, ఊళ్ల దేవుళ్లా అన్నవాడు అద్భుతుడై అహంబ్రహ్మ, అహం విష్ణుః, అహం శివః అన్నాడు. ఇవి పరస్పర విరుద్ధాలు కావా?

ఇప్పటి మహానుభావులకు తమచేతలలో వాక్యాలలో వైరుధ్యాలు కనబడవు. చెప్పినా వినబడవు. బ్రాహ్మణత్వాన్ని తిడ్తూ తాను బ్రాహ్మణుడుకావాలంటాడు.

జాతి అంటే పుట్టుకమీద వచ్చింది. మధ్య వచ్చింది కాదు. కులాలుకూడ పుట్టుకమీదనే. మఱ్ఱి విత్తనం వల్ల మఱ్ఱి చెట్టే వస్తుంది. వేపచెట్టు రాదు. ఈ భేదాలను తీసివేయడానికి ప్రయత్నించిన పెద్దలు బుద్ధుడు, అశోకుడు, అగ్బరు, నానక్, పల్నాటి బ్రహ్మయ్య గాంధీ వగైరాలు జయం పొందలేదు. అది ఆశ్చర్యం ప్రకటించిన జయప్రకాశ్ కూడ అదేపాట పాడి గతించాడు. మనకులాలు వృత్తులను వంశపారంపర్యం చేసి వాటిని కళలుగా మార్చినవి. ప్రధానసూత్రానికి చెదురుమదురు అపవాదాలుండవచ్చు. అవి సామాన్య సూత్రాలు కాలేవు.

వసిష్ఠుడు తాళికట్టిన అరుంధతి బ్రహ్మర్షిశ్రేష్ఠుడైన కర్దమప్రజాపతి కూతురు. వెనుక జన్మలో ఆమె పంచమయువతి కావచ్చు. ధర్మాచరణవలన మరుజన్మలో మేలు పొందవచ్చుననే నీతి చెప్పే ఆమె కథను యీ మన పండితులు కులాలు లేవనడానికి చూపుతున్నారు. అన్నీయిటువంటి తప్పుడు ప్రచారాలే! వ్యాసునికన్న సత్యవతి ఉపరిచరవసువనే రాజర్షి కూతురు. బెస్తపిల్లకాదు. కొందఱు మహర్షులు తమశక్తివల్ల మట్టిని మాణిక్యం చేయగలరు. అందఱు అట్లు చేయగలరనడం, మట్టి

మాణిక్యం సమానమనడం తెలివితక్కువ. వ్యాసుని తల్లి క్షత్రియకన్య అయినా, తండ్రి తపశ్శక్తివలన బ్రాహ్మణుడై పుట్టినవెంటనే తపస్సుకు వెళ్లాడు. ఇవి అపవాదాలు-(exceptions) సామాన్య సూత్రాలు కావు. బుద్ధిమంతు లివిగ్రహిస్తారు.

ఇప్పటి యువకలోకం కులాలు లేవంటే ఉబ్బి తబ్బిబ్బైపోతుంది. కామమే ప్రేమ అనుకుంటుంది. తాత్కాలిక సుఖమే పెండ్లికి ఫలం. పరలోకం లేదు. నిత్యసుఖం లేదు. ఉన్నదని తెలియదు. అచేతనమైన ద్రవ్యం (matter) నిత్యమంటుంది. చేతన వస్తువుచేతనే అచేతనం కదలడం చూస్తుంది. నిత్యమైన చేతనం లేదంటుంది. మాకు తర్కం (logic), సైన్సు కావాలంటుంది. సైన్సు దృష్టిలో మానవులలో రెండే భేదాలు. స్త్రీలు, పురుషులు. స్త్రీలలో తల్లి, చెల్లెలు, అక్క, కూతురు, భార్య భేదాలు సైన్సు చూడదు. జంతువులకు గూడ ఈ భేదాలు లేవు, తెలియవు. ఈ భేదాలు చెప్పేది మన శాస్త్రం—నిత్యమైన శాస్త్రం—అంటే వేదం. అచేతనం నిత్యమంటే దానిని పాలించే నడిపించే చేతనం నిత్యం కావద్దా? ఈ నిత్యజ్ఞానం చెప్పే శాస్త్రం మాత్రం నిత్యం కావద్దా?

తర్కం కావాలనేది ఒక్క మన సంస్కృతే. నిత్యమైన శ్రుతి చెప్పాలి. అది తర్కానికి నిలవాలి. అనుభవంలోకూడ ఉండాలి అనేది. నోరు విప్పితే వచ్చేది పదం—మాట—అర్థంకల మాట. పదమూ, అర్థము కలిసే ఉంటవి. పదాలు చేరితే వాక్యం, అర్థంకల వాక్యం. దున్నపో తీనిం దనేది వాక్యం కాదు. పదశాస్త్రం వ్యాకరణం. వాక్య శాస్త్రం మీమాంస. ఏది వాక్యమో కాదో చెప్పడం, ఏది ప్రమాణమో ఏది కాదో చెప్పేది తర్కశాస్త్రం. పద, వాక్య, ప్రమాణ శాస్త్రాలు చదివితేకాని వేదం మనశాస్త్రం అర్థం కాదు. ఇంత తర్కముందని, మనం తర్కానికి అగ్రస్థానం ఇచ్చామని నేటి యువకలోకానికి తెలియదు. ఇది మన ప్రస్తుత మేధావులను కానే ఎద్యుకేషనిస్టులకే తెలియదు. మన ప్రస్తుత విద్యాప్రణాళిక పిచ్చిప్రణాళిక. నిత్యం ఎఱుగనిది.

మహాతార్కికంగా మాట్లాడుతున్నాడని మన యువకలోకం భావించే శంకరుడు ఒక ప్రక్కన దేవుడు లేడంటూ, దేవుడిదే కులం అంటాడు. ఏమి తర్కం! మరి శ్రీరాముడు, శ్రీకృష్ణుడు దేవుళ్ల క్షత్రియులు, వాండ్లు బ్రాహ్మణ కన్యలను పెండ్లాడలేదు. క్షత్రియకన్యలనే వివాహమాడారు. మరి మన మానవజంతువులు, కుక్కలను, పులులను పెండ్లి చేసుకో వెందుకో? జంతువులన్నీ సమానమే కదా! జంతువులే కదా! అన్నీ జంతువులే అయినా ఒక పెద్దజాతిలో చిన్నజాతులు కుక్కలు నక్కలు, పులులు వగైరా భేదాలుంటవి. కుక్కలలో మళ్ళీ భేదాలు, పుట్టుకవలననే

భేదాలు. ఒక్కవరిలో ఎన్ని భేదాలున్నవి? మామిడిలో ఎన్ని భేదాలున్నవి? రూపాలు సమానంగా ఉన్నా రుచిలో భేదాలున్నవి. చేదు దొండ మంచి దొండ. చేదు దోస మంచి దోస. అజ్ఞానుల కన్నీ సమానంగా కనబడతవి. తెలియని బాలుని కన్నీ అక్షరాలన్నీ సమానం. భేదాలు చూడడమే తెలివి. కాబట్టి కులాలు లేవనడం, పుట్టుకతో భేదాలు రావనడం అజ్ఞానం. వర్ణాంతరవివాహం ఒకఘనకార్యం (great achievement) అని నేటి యువకుడు అనుకొని తల్లిదండ్రులకు విచారాన్ని కల్గిస్తున్నాడు. అనిత్య జంతు సుఖం కోసం జంతు వౌతున్నాడు.

ఇట్టి విషంతో నిండి ఉంటున్నవి ప్రస్తుత చిత్రాలు. అవి చూచి జంతువు లౌతున్నారు. మన యువకులు. ఈ సమీక్ష ఇంతటితో అపుతాను. ఇంకా చాలా లోపాలు పీ చిత్రంలో.

మన సనాతన ధర్మము అందరి మేలు, జంతువుల, సర్వజీవుల మేలు కోరింది. అది ధనవంతులను ధర్మాత్ములను చేసింది. అది కాపిటలిజం కాదు ఇది మనకు పాశ్చాత్యసంస్కృతి. ముస్లిము సంస్కృతుల మూలంగా వచ్చింది, మనుష్యులను రాక్షసులను చేసింది. మన పురాణగాధలు, చరిత్ర చదివితే మనరాజులు, ధనవంతులు ఎంత ధర్మాత్ములో తెలుస్తుంది. ఈ మన సనాతన ధర్మాన్ని గాంధీ ప్రభృతులు తప్పుడుగా చిత్రించారు. అది నేటి యువకలోకం అనుసరిస్తున్నది. ఇది ప్రపంచ శాంతి నివ్వదు. అందరి జీవుల మేలుకోరే మనసనాతనధర్మ సంస్కృతే ప్రపంచ శాంతి యిచ్చేది. అందులో ముఖ్యసూత్రం అందరు సమానం కారు. వ్యక్తులకు భిన్న భిన్న ధర్మములున్నవి. స్వధర్మం చేయడం వలననే అందరు నిత్యసుఖం సాధిస్తారు కళాకారు లిది ప్రదర్శించాలి.

## వ ర ద లు

తిరిగి అతివృష్టి-వరదలు-ప్రాణినష్టం, పశువులు, జనం చావడం-ఆస్తి నష్టం-నడుములోతు, గొంతులోతు నీరు, ఇండ్లనుగూడ ముంచితే చూరుపట్టుకొని వ్రేలాడడం, కప్పుపై కెక్కి బ్రతకడం వగైరా విషాదగాథలు—ఎవరీ బాధపడేవారు? ఎందుకు బాధపడుతున్నారు?

ప్రభుత్వాధినేతలు, ఆఫీసర్లు విమానాలలో ఇవన్నీ దర్శించి, పీరై తేదిగి పరామర్శించి, చచ్చినవారికి పదివేలు, 6 వేలు (చివర కెవరికెంత ముట్టుతుందో) ప్రకటనలు చేస్తూ తమసానుభూతిని ప్రకటిస్తున్నారు. కోట్లు ఖర్చుపెడ్తామంటున్నారు. పెడ్తున్నారుకూడ-అనేక శాశ్వత వరద ప్రణాళికలు వేస్తున్నారు. సైంటిస్టులు ప్రకృతిని

గెలిచామంటుంటారు. "సృష్టిని ఒక నిర్వచింపలేని శక్తి ఉన్నదిరా" అని చూపడానికి తలచుగానే యిట్లాటివి వస్తుంటవి. చావుపుట్టుకలేని నిత్యద్రవ్యమే (matter is neither created nor destroyed) ఉన్నదికాని నడిపించే నిత్యచేతనుడు లేడంటాడు మూర్ఖ సైంటిస్టు. (అచేతనమైన ద్రవ్యం (matter) చేతనం వల్లనే పనిచేయడం చూస్తూనే) విజ్ఞానంకూడ మొదలు లేనిదని గ్రహించలేదు. అంతా శూన్యంనుంచి వస్తుందట.

విజయవాడలో రెండురోజులుగా బాధపడుతున్నా సహాయానికి ఎవరున్నూ, ఏ ఆఫీసరున్నూ, రాలేదని, వర్షం తగ్గినతరువాత సోమవారం సాయంత్రం కొందరు బయలుదేరారని ఫిర్యాదు. వర్షంలో తనప్రాణాలొడ్డి ఎవడుసహాయానికివస్తాడు? కార్లు, బస్సులు, లారీలు కూడ నడవనిచోటికి, నీళ్ళలో నడుములోతు, కుతికిలోతు నీళ్ళలో ఈదుకొంటూ ఎవరు వస్తారు? వాండ్లకు భార్యాబిడ్డలు లేరా ? మా దళితజాతులకే ఉద్యోగాలు రావాలి, ప్రొమోషన్లు రావాలి మెరిట్ చూడకూడదు అని దళితజాతులు కోరడం, వారివోట్లకోసం అధికారపార్టీలు అవన్నీ శాంక్షన్‌చేయడం జరుగుతున్నది కదా ! సమర్థవంతమైన పరిపాలన మనకవసరంలేదు. మెరిట్‌ను మెచ్చుకోవడం, ప్రొమోటు చేయడంలేదు. రాకపోతే శిక్షలేదు. ఇకవచ్చినవాడు జీతంకోసం వస్తాడు—ఇప్పుడు ధర్మం అందులో స్వధర్మంలేదుకదా! ఇప్పుడు మన నాయకులు రాజీవ్, NTR, VP సింగు వగైరాల ప్రకారం 30%, 50% అడవాండ్లు వస్తున్నారు. వారీ నీళ్లలో ఈదుకొంటూ ఈ దళితజనాన్ని రక్షించడానికి వస్తారు.

పనులు, డ్యూటీలు పంచుకొని ఇది నా ధర్మమని భావించే సంస్కృతి, చేసిన మంచికి మెప్పు, తప్పుకు శిక్ష లేనిది ఎన్నికోట్లు ఖర్చైనా దేశం బాగుపడదు. అది దళితజాతులు, స్త్రీలు గుర్తించాలి. ముఖ్యమైన వాటిలోనైనా రిజర్వేషనులు మానాలి.

మన ప్రభుత్వాలు కట్టించే వంతెనలు, ఇండ్లు కూలాలి, రోడ్లు చెడాలి. లేకపోతే డబ్బు ఖర్చుపెట్టడాలు, పంచుకోవడాలు ఎట్లా ? వోట్లెట్లా వస్తవి? మనరాజులు రాముడు, విక్రమార్కుడు వగైరాలు మారు వేషాలతో ప్రజలలో తిరిగి వారి కష్టనష్టాలను చూచారు. తీర్చారు. వీరు విమానాలలో పోలీసు అండతో వస్తారు.

బుద్ధిమంతులు పార్టీలులేని—అంటే నిష్పక్షపాతమైన ధర్మప్రభుత్వాన్ని కోరాలి, తెచ్చుకోవాలి. పార్టీపద్ధతి ప్రేడు యూనియనిజము రెండు పోవాలి. ధర్మం, న్యాయం సామర్థ్యం కల వారు పాలకులుకావాలి. పాలన చంకాలంగా ఉన్నా చాలామంది పచ్చి తోడ్పడుతున్నారు. కారణం మనలో ఇంకా మిల్చిన ధర్మబుద్ధి.

ఇది నకిలీ హిందువులను గురించి కాదు. క్రైస్తవులు బైబులును, ముస్లిములు కొరాన్‌ను గౌరవిస్తారు అట్లే తమకు శాస్త్రాలున్నవనుకొనే నిజమైన హిందువులకు- వెనుక జరిగిన విషయము- ఒక కోర్టులో ఒక శూద్ర జడ్జి సాక్షిగా బోనులో ఉన్న ఒక బ్రాహ్మణుని, నిష్ఠాగరిష్ఠుని, వేదాధ్యయనపరుని, ఏమవసరం వచ్చిందో గాయత్రి అంటే యేమిటో చెప్పండి అని అడిగాడు.

ఆయన దానికి నేనది చెప్పను, చెప్పకూడదు అది మంత్రము అన్నాడు.

దాని మీద ఆ శూద్ర జడ్జి "మీ బ్రాహ్మలు మాకు చెప్పకుండ అది దాచారు. ఇప్పు డన్నీ పుస్తకాలలో అచ్చై వచ్చినవి. అందఱు చెప్పవచ్చు ఇదిగో నేను చెప్తున్నాను." అంటూ అది గడ గడ చదివేశాడు.

దాని కాయన "అది గాయత్రి మంత్రము కాదు ఉత్త మాటలు" అని అన్నారట.

ఆ జడ్జి దిగ్భ్రాంతి జెంది "ఎందువల్ల" అని అడిగాడు. దాని కా బ్రాహ్మణుడు

"ఇదిగో చూడండి మీరు మీ సేవకునితో" I DISMISS YOU -నేను నిన్ను పనినుండి తొలగిస్తున్నాను. అని అన్నారు. మీ సేవకుడు అవే మాట లన్నారనుకొండి. మీది అర్డర్ (ORDER) అవుతుంది కాని, అతనన్నది ORDER అవుతుందా? అట్లే గాయత్రీ మంత్రము కూడ చెప్పవలసిన అధికారం కలవాడు చెప్పవలసినట్లుగా చెప్పితేనే మంత్రమయ్యేది. దాని కధికారం లేనివాడు ఇష్టం వచ్చినట్లుగా అష్టంలో చెప్పినది మంత్రము కాదు. ఉత్త మాటలు అన్నారట.

అందరు ఆశ్చర్య పడ్డారు. జడ్జిగారు మాట్లాడ లేకపోయినారు. ఆయన ఆ ధర్మాసనంమీద హోదాలో చెప్పినది తీర్పు అవుతుంది కాని, ఎక్కడనో చదివింది తీర్పు అవుతుందా?

భగవగ్గీతలో శ్రీకృష్ణుడు "తస్మాచ్ఛాస్త్రం ప్రమాణం తే కార్య కార్య వ్యవస్థితౌ" ఏది కార్యము ఏది కాదు అనే విషయములో శాస్త్రము ప్రమాణము, శాస్త్రము చెప్పింది సరియైనది. దానికి విరుద్ధమైనది కాదు.

ఇప్పుడు నవీనులు, (గాంధీ గారు వగైరా కూడ) దేవుడు, పరమేశ్వరుడు విష్ణువు, శివుడు, god, అల్లా, ఎహోవా, రాముడు, కృష్ణుడు, అనేవన్నీ ఒకటే. ఒకేవస్తు

పుకు వేఱు వేఱు పేర్లు అంటున్నారు. అది తప్పు అభిప్రాయము. వీరి నిర్వచనాలు వేఱు వేఱుగా ఉన్నవి. శివుని రూపము వేఱు,పరమేశ్వరునకు రూపం లేదంటారు అద్వైతులు. ఆయన జీవులను సృష్టించలేదు. జీవులు కూడ పరమేశ్వరుని వలె నిత్యులు god (గాడ్) సోల్స్ (souls) (దీనికి జీవులని తప్పుగా వ్రాస్తారు) ను సృజింవారు ఇట్లా నిర్వచనాలల్లోభేదాలున్నవి. కొన్ని సమాన ధర్మాలున్నా విరుద్ధాంశములు కూడ ఉన్నవి. 713, 413, 631, 814, 12413 మొదలైనవానిలో కొన్ని సమానమైన అంకెలు ఉండవచ్చు. అవన్నీ ఒకే సంఖ్యకాని, సమాన సంఖ్య కానే కావు. అట్లే ఈశ్వరుడు, god, అల్లా వగైరా ఒకటే కాదు అట్లే marriage పెండ్లి,వివాహమున్ను, మన శాస్త్రము వివాహమెందుకు చెప్పిందో ఎట్లా చెప్పిందో అట్లాజరిగితేనే వివాహము, లేకపోతే అది marriage (మేరేజ్–పెండ్లి) కావచ్చు గాని శాస్త్రము చెప్పిన వివాహం కానే కాదు.

శాస్త్రము చెప్పిన వివాహము ధర్మము కొఱకు, సత్సంతానము కొఱకు, ఇతర మైథునం కోసమే కాదు, మైథునం కోసము మాత్రమే శాస్త్రవిరుద్ధంగా చేసుకొన్నది కామం కోసమే–ఉంచు కోవడం అవుతుంది, ప్రస్తుత చట్టం ప్రకారము marriage కావచ్చు. కాని శాస్త్రం చెప్పిన వివాహము కాదు. ఇది సత్ఫలితాలు ఇవ్వదు, ఇది హీన జన్మలు, కుక్క, నక్క, పిల్లి వగైరాలు తెచ్చే పాపకర్మ అవుతుంది.

వివాహము శాస్త్రీయంగా ఒకే వర్ణం వారి మధ్య జరిగితేనే అది మన శాస్త్ర ప్రకారం వివాహమౌతుంది. శాస్త్రము అనులోమ వివాహాలు (ఎక్కువ వర్ణం వారు తక్కువ వర్ణం స్త్రీని చేసుకోవడం–ఇది అతను ముందు తన వర్ణం స్త్రీని చేసుకుంటేనే వివాహమయ్యేది. లేకపోతే అది ఉంచుకోవడమే) కూడశాస్త్రం చెప్పింది. ఇవి కలియుగంలో నిషిద్ధమన్నా కొందఱు చేసుకున్నారు. అవిఅంగీకరించవచ్చు. కాబట్టి అవి అట్లా జరిగితే పాప కార్యాలుకావు. కాని ప్రతిలోమ వివాహాలు తక్కువ కులంవారు ఎక్కువ కులం స్త్రీని చేసుకొన్నవి పాప కర్మలు, దుష్టఫలితాన్నిచ్చేవి ఔతవి.

పైగా మన శాస్త్రంలో స్త్రీకి ఒకేసారి వివాహము చెప్పబడ్డది. విడాకులు చెప్పబడలేదు. కాబట్టి విధవావివాహాలు, విడాకుల తరువాతజరిగిన పెండ్లిండ్లు ఉంచుకోవడాలు, పాపకార్యాలే ఔతవి. కాని నిజమైన వివాహాలు కావు. పాశ్చాత్యుల దృష్టితో ఆ చట్టాలతో చేసుకొన్నవి మన మంత్రాలు, శ్లోకాలుచదివి చేసినా, శాస్త్రము చెప్పిన వివాహాలు కావు.

కాబట్టి బ్రాహ్మణుడు శూద్రస్త్రీని చేసుకొన్న పెండ్లి వివాహ ముకాదు. అనులోమ వివాహము కూడ కాదు పాప కార్యమే, ఉంచుకోవడమే ఔతుంది. ఉభయుల

కు నరకము, హీన జన్మలు ఇచ్చేదే. (నరకము, జన్మలు ఉన్నవా, లేవా అన్నేది వేరే ప్రశ్న)

ఆ బ్రాహ్మణుడు మరొక బ్రాహ్మణస్త్రీని చేసుకుంటేనే అది అనులోమ వివాహమయ్యేది. శాస్త్రమది ముందు చేసుకొనవలెనన్నా వ్యభిచారంకూడ ఉన్నది కాబట్టి, అది వ్యభిచారం క్రిందికి వచ్చి, దానికి ప్రాయశ్చిత్తం చేసుకొని బ్రాహ్మణ స్త్రీని వివాహం చేసుకొంటేనే శూద్ర స్త్రీ వివాహము కూడ తరువాత వివాహమనిపించుకొంటుంది. కాబట్టి ల శూద్ర భార్య తన మేలు కొరకే భర్తను సవర్ణ వివాహానికి ప్రోత్సహించాలి. అయితే అబ్రాహ్మణుడు భోజనాలు సవర్ణ భార్య దగ్గరనే చెయ్యాలి. మైథునం, నండ్లు వగైరా వ్యసనాలు, కొన్ని కూడ శూద్ర భార్యతో చేయవచ్చును. అతడు బ్రాహ్మణుడే అవుతాడు అది పాప కర్మ కాదు.

అయితే మన ప్రస్తుత చట్టము ప్రకారము - పాశ్చాత్య ముద్దు బిడ్డలు చేసింది-రెండు పెండ్లిండ్లు నేరముకదా' రెండుపెండ్లిండ్లు హిందువులకు శాస్త్రీయము నిషేధించలేదు కాబట్టి అది హిందువులకు నేరము కాదని, న్యాయాధిపతులు తీర్పు చెప్పాలి. అందరికి ఉన్న మత స్వేచ్ఛను హిందూమతద్వేషి, బౌద్ధుడు అయిన అంబేద్కరు మహాశయుడు తీసివేయలేదు. బి. జె. పి ఆర్. యస్. యస్. విశ్వ హిందూ పరిషత్తు వగైరాలు- కులాలు పోవాలి అనే పిచ్చి మాటలు మాని, హిందువుల కున్న మత స్వేచ్ఛను పునరుద్ధరించాలి. దీనిని వ్యతిరేకించే మహిళా మణులు, హిందూ నామధారులు హిందూపదాన్ని స్వంతం చేసుకుంటే, అసలు శాస్త్రంప్రకారం వెళ్లే వాండ్లు 'మేము హిందువులముకాము' సనాతనులమనవలె. అప్పుడు బౌద్ధ అంబేద్కరుమహాశయుని చట్టాలు మనకు చెల్లవు. ముస్లిము లెందరినైన చేసుకోవచ్చు గదా?

ఆ చట్టాన్ని ఇంకో విధంగా పరిహసించవచ్చు

ఇప్పుడు చట్టం ప్రకారంవ్యభిచారం నేరం కాదు. పెండ్లి చేసుకొన్న వాండ్లు వ్యభిచరిస్తూనే ఉన్నారు. అయితే భార్య అకారణంతో అతనినుండి సులభంగా విడాకులు పొందవచ్చు. అది పురుషునికి బాధకం కాదు. రెండవ పెండ్లి స్త్రీకి ఎట్టి గౌరవం తెస్తుందో, ఎంత ఉపయోగపడుతుందో మన దేశపు స్త్రీలు గ్రహిస్తారు.

కాబట్టి అబ్రాహ్మణుడు చేసుకొన్న సవర్ణవివాహము (శూద్ర భార్య ఉండగా) నేటి చట్టం ప్రకారం ఉందుకోవడం, వ్యభిచారం అవుతుంది. కాని శాస్త్రంప్రకారం ఆమె వివాహితయే నిజమైన ధర్మపత్ని. ఆమె కున్న గౌరవం పోదు. ఇతరులు, చట్టం ఏమనుకొన్నాగూడ. ప్రస్తుతచట్టం అది మేరేజ్ అని అననందున నేరం కాదు. శూద్ర భార్యయే (విడాకులు పుచ్చుకోకుండ ఉంటే) married wife. శాస్త్రం ప్రకారంకూడ

భార్య బోతుంది. శ్రాద్ధాది కర్మలలో బ్రాహ్మణీ భార్య సంతానం వీరి కధికారముంటుంది. సవర్ణ వివాహం లేకపోతే శ్రాద్ధాదులు శూద్రులకు వలెనే జరుగుతవి.

పోతే మన చట్టం ప్రకారం --ఆస్తి సంక్రమించడంలో ఇబ్బందులు రావచ్చు. అవన్నీ భర్త స్వార్జితం అతని యిష్టం ప్రకారం వీలునామా వ్రాయవచ్చు. న్యాయవాదులు, న్యాయాధిపతులు సరిగా విచారించి తీర్పిస్తే పితార్జితంలో భాగం కూడ మన శాస్త్రాల ప్రకారం రావచ్చు. ఒకవేళ రాకపోయినా అభార్య, సంతానం, సంపాదించుకోవచ్చు. దీని వల్ల తన బ్రాహ్మణత్వం నిలుస్తుంది.

ఇప్పుడు మన బాల్య వివాహ చట్టం ధర్మం వల్ల పెండ్లి కాని 30, 40 ఏండ్ల కన్య లున్నారు. వాండ్ల నీచెడిపోయిన బ్రాహ్మణులు ప్రాయశ్చిత్తం చేసుకొని పెండ్లాడి బ్రాహ్మణ్యం నిల్పుకోవచ్చు నిజమైనహిందువులు మత స్వేచ్ఛను ఉద్ధరించుకోవాలి.

హిందూ శాస్త్రాలను నిరసించుకొనే నాస్తిక హిందువులు, పురుషపుంగవులు మహిళా మణులు, ప్రచ్ఛన్న క్రైస్తవులు, క్రైస్తవమతం, లేక అంబేద్కరు గారి బౌద్ధ మతం స్వీకరింపవచ్చు. లేక వెనుక వచ్చిన బ్రహ్మసమాజం, లేక నాస్తికసమాజము లేక మరొక క్రొత్త సంఘము స్థాపించుకోవచ్చు.

శాస్త్ర ప్రమాణ బుద్ధి కలవారు తరువాత స్వేచ్ఛను పురస్కరించుకొని శాస్త్రీయాలైన బాల్య వివాహాలు, దక్షిణ నాయకత్వాలు పునరుద్ధరించుకోవచ్చు. ఒక న్యాయాధికారి, నిష్పక్షపాతంగా ఆ విధంగా తీర్పిస్తే నిజమైన హిందువులు మత స్వేచ్ఛను పొందుతారు.

మన వివాహము మైథునము కొఱకే కాదు. ధర్మానుష్ఠానమునకు, సత్సంతానము కొఱకు ఉద్దేశింపబడింది. నేటి కుటుంబనియంత్రణ లో బిడ్డల సంఖ్య తగ్గించవలెననే కాని మంచి సంతానము కల్గవలెననే కోరిక, దానికి పథకము లేదు సత్సంతానము కలుగుటకు శాస్త్రాలు విశేష గర్భాధాన ముహూర్తాలు కూడ చెప్పినవి. వాకిట ఉన్న 16 16 వ రాత్రులందు ఉత్తమ స్త్రీ పురుష సంతానము కల్గునని శాస్త్రములు చెప్పినవి. ఇప్పుడు సరియైన వివాహాలెన్ని ఉన్నవి ?

.... ........

## గణితశాస్త్రి పండితులు

21.8.1989 టి.వి.లో ఇద్దరు గణితాచార్యుల పరిచయం వచ్చింది. ఇట్టివి గణితశాస్త్రాభిమానులకు కుతూహలం రేకెత్తించేవిగా లేకపోతే ఉత్త కాలహరణమే అవుతుంది. దుమ్ములోనుంచి మేధావియైన రామానుజం లేవడవడం, ఆయన చాలా క్లిష్ట సమస్యలు (ఒక్కటైనా ఉదహరించలేదు) పరిష్కరించాడనడం, వివేకానంద స్వామి మనశాస్త్రాధ్యయనానికి ప్రోత్సాహమిచ్చారనడం తప్ప (ఇంకొకరిని గూడ పేర్కొన్నారనుకో) క్రొత్తగా చెప్పింది సున్న. పైగా డార్విన్‌గారి ఎవల్యూషను సిద్ధాంతము (ఇది ప్రస్తుతం విద్యావంతులు మనుకొనేవారికి పట్టిన మహాజాడ్యం. ఈ మూఢ విశ్వాసాన్ని వారు దాటలేరు) తలకెక్కి సున్నా డిస్కవర్ చేశారన్నారు. అంటే సున్నా తెలియని కాలమంటు ఉన్నదని.

ఈ డార్వినిస్టులు అన్నిటికీ ఆది వెదకుతారు. మొట్టమొదం ఏమిన్నీ లేదని, అంటే సర్వం సున్న శూన్యమని, శూన్యమునుంచి విజ్ఞానం, సృష్టిరావడం ప్రారంభమయిందని చెప్తారు. అంతకుముందు కాలం లేదా ? అప్పు డేమిన్నీ లేదా ?

కాలానికి మొదలంటూ ఉంటుందా ? 'ఇది మొదలు' అంటే దానికి ముందంటూ లేదా ? అది కాలం కాదా ? దాని పరిమితి యెంత ? అప్పుడేమిన్నీ లేక. కోట్లకోట్ల సంవత్సరాలు ఏమీ మార్పు సృష్టి వగైరా లేక, ఆక్షణంలోనె మొదలయిందనడం ఎంత (absurd) అవ్యక్తమో వీండ్లకు తట్టదు.

ఐన్‌స్టీన్ దేశము కాలము సాపేక్షకములు (relative) అంటే స్వతంత్రములు కావు అని ఋజువు చేశారు అవి (absolute) వాస్తవముగా లేవని.

అవి అనాదులని, అనంతములని మనతార్కికులు సాధించారు. అవి కల్పితములని చెప్పిన వారద్వైతులొక్కరే. ఉన్నదొక్క పరబ్రహ్మమే పారమార్థిక సత్యము. తక్కినవన్నీ మిథ్య, కల్పితాలు. విచిత్ర మేమిటంటే ఈ కల్పితాలు ఆద్యంత రహితాలు నిత్యాలు, విభువులు.

అనంతము, ఒకటి, సున్న ఈమూడున్ను విచిత్రమైన సంఖ్యలు. వీని విజ్ఞానమే సాంఖ్యశాస్త్రము. వీనిని గురించి ఆలోచించిన గణితమేధావులు (philosophers) తత్త్వశాస్త్రజ్ఞులైనారు.

సైంటిస్టులు, (evolutionists) ప్రతిదానికి ఆది ఉండా లంటారు. ఆది లేకుండ ఏదైనా యెట్లావస్తుందని ప్రశ్నిస్తారు. దానికి మన యెదురు ప్రశ్న ప్రతిదానికి ఆది ఉండని నీవు చెప్పడానికి కారణమేమిటి ? అది ఋజువుచేయమంటాము.

ప్రతిదానికి ఆది ఉండగనుక.

దీనిని గురించి మా Evolution సిద్ధాంతఖండనంలో (Hinduism and its Cardinal Principle-ప్రపంచమున కెదురుగా ఇండియా అనే మా ప్రచురణలు) చూచేది.

అక్కడ దేనికిన్నీ ఆది లేదని ఋజువుచేశాము. అది (relative) సాపేక్షికమని.

ఇంకొక విధంగా నిరూపణ-సైంటిస్టులు matter is neither created nor destroyed-అంటే ద్రవ్యము పుట్టదు, చావదు-అంటే నిత్యము, ఎప్పుడూ ఉండేది అని చెప్తున్నారు. ద్రవ్యము అచేతనము అనేది ప్రత్యక్షం. అది చేతనుడు లేకుండ కదలదు. కదలిక, మార్పు మనకు ప్రత్యక్షమే. కాబట్టి అచేతనమైన ద్రవ్యము నిత్యమైతే చైతన్యము (దానిని నడిపించేవాడు) నిత్యము కావద్దా? ఈ నడిపించే విధానం, చెప్పే విజ్ఞానం మాత్రం నిత్యం కావద్దా? కాబట్టి కొంత మూలవిజ్ఞానం నిత్యమై తీరాలి. అందుకనే వేదం (విజ్ఞానం) నిత్యమని మనవారు చెప్పింది సత్యం, సతార్కికం (logical) మూఢ విశ్వాసంకాదు. అన్నిటికీ మొదలుందనడం, మూఢవిశ్వాసం. కాబట్టి నున్న క్రొత్తగా ఎప్పుడో కనిపెట్టారనడం మూఢవిశ్వాసం-అజ్ఞానం. ఆది మానవుడనడం, దానిమీద రచనలు, సినిమాలు పిచ్చి ఊహ, మహామూఢవిశ్వాసం.

అయితే క్రొత్తగా కనిపెట్టడాలు లేవా? బీజగణితం (algebra), రేఖాగణితం (geometry), ట్రిగనామెట్రీ, గ్రాఫ్ (graph), కోఆర్డినేట్ జామెట్రీ, కాల్కులస్ (calculus), సాలిడ్ జామెట్రీ, యూక్లీడియన్, నాన్‌యూక్లీడియన్ జామెట్రీ, ఇందులో అనేక సిద్ధాంతాలు ఇవన్నీ క్రొత్తగా కనిపెట్టలేదా? ఇవి వెనుకఉన్నవా?

విజ్ఞానం అసలు మూలంగా ఉంటుంది. అది సంకోచ వికాసాలు పొందుతుంది. క్రొత్తవి వస్తుంటవి, విస్మృతమౌతుంటవి, తిరిగి క్రొత్తగా వచ్చినట్లు వస్తుంటవి. ప్రవాహనిత్యత్వం: సృష్టి స్థితిలయాలు అనాదిగా అనంతంగా చక్రభ్రమణంలో (cycles) వస్తూ పోతూ ఉంటవి. ఋతువులు, సంవత్సరాలు, యుగాలు అనాదిగా అనంతంగా వస్తూ పోతున్నట్లు. ప్రాతవి క్రొత్తదనం సంతరించుకొని వస్తూ పోతూ ఉంటవి. ఒకే కృష్ణానది మాణిభాగం (ప్రవాహం) మారిని భాగం గట్లు వగైరా సాగినట్లు, విజ్ఞానం కూడ సాగుతుంది. అవిగ్రహించాలి. న్యూటన్ వెనుక ఉండి మఱవబడ్డ గురుత్వాకరణ సిద్ధాంతం తిరిగి కనిపెట్టవచ్చు.

కాబట్టి క్రొత్తవి కనిపెట్టవచ్చు. పూర్వ విజ్ఞానాన్ని ఆధారంగా చేసుకొనే. శూన్యం నున్నా నుంచికాదు.

'Men of Mathematics' గణితాచార్యులను గురించి వ్రాసిన గ్రంథం, న్యూటన్, యూలర్, డెకార్టిస్, ఏబెల్ వగైరా అనేకులను గూర్చి చెప్పినది (వారు

అతిస్వల్ప వయస్సులోనే క్రొత్త గణితసిద్ధాంతాలు కనిపెట్టారు. 20 కి ముందే ఏబెల్ (Abel) క్రొత్తవి కనిపెట్టాడు. నీకీ శక్తి ఎట్లా వచ్చింది.? అని అడిగితే జవాబు చెప్పాడు-"నేను first rate ఉత్తమ తరగతి గణితపండితుల రచనలు చదివాను third rate, fourth rate మూడవనాల్గవ తరగతివారి రచనలు కావన్నాడు." మన texts వ్రాసినవారెవరు ? వీండ్లు గొప్పవారి రచనలను తమకు తెలియకుండ, ఇతరుల కందుచేత అర్థం కాకుండ తప్పులతో (తప్పొప్పుల పట్టికలు కూడ ఉండవు) వ్రాసిన మహానుభావులు: Master minds రచనలు మన కాలేజీ లైబ్రరీలలో యూనివర్శిటీ లలోనైనా ఉన్నవా ? మన ప్రొఫెసర్లవి చదివారా ? అవి చదవాలి.

Physics, Chemistry మొదలైనవాటిలో క్రొత్తవి కనిపెట్ట వలెనంటే వాటికి మిక్కిలి విలువగల లెబరేటరీలు కావాలి. అవి మనకు లేవు. గణితాని కవి వని లేదు. ఇందులో కూడ మన వారొక్క క్రొత్త సిద్ధాంతమైనా కనుక్కో లేదే. సైన్సులో రామన్‌గారైనా కనిపెట్టారు కాని గణితంలో ఎవరున్నారు ? నోబెల్‌బహు మాన మా మధ్య మనవారెవరో ఒకరు గణితంలో పందుకొన్నారని విన్నాను. ఇందులో మనవారు కృషిచేయవచ్చు, చేయాలి.

సున్న లేకుండ దశాంకగణనం-పదిమూలం (base) గా లెక్కించడం లేదు, ఈ గణనం మన వేదాలలో ఉన్నది. ప్రతిచోట సంఖ్యలు చెప్తారు. 1, 0 విచి త్రమైన సంఖ్యలు (సున్నాను సంఖ్య అనవచ్చునా ?) సున్నాకు స్వతహాగా విలువ లేదు. 1 ప్రక్కన చేరుస్తూపోతే దాని విలువ అనంతంగా పెరుగుతుంది. 10, 100, 1000, ఈవిధంగా. సున్నా ఒకటి విలువ పెంచేదౌతుంది. బ్రహ్మముయొక్క శక్తివి సున్న, ప్రకృతి, మాయ అనంతం చేసినట్లు. 1 కి ముందు పూర్వం సున్నాలు పెడ్తే యేమౌతుంది ? 01, 001, 0001 మొదలైనవి. కాని వానిముందు డెసిమల్ పాయింట్ పెడితే 1 విలువ అనంతంగా తగ్గుతూ పోతుంది. .01, ,001, .0001, etc. మరి 1, 10, 100etc. ప్రక్కన ఈ దశాంశ బిందువు లేవా ? కనబడకుండా ఊహలో ఉన్నది. ఇట్లు మన సంఖ్యామాన ప్రారంభము కొలత చెప్పరాని అమేయమైన అతిస్వల్పాంశ ము. చివర కూడ అనంతమైన మహత్తమభాగము. ఇట్లే ద్రవ్యవిభాగములో కణాదుని పరమాణువు మన ప్రస్తుత ఎలక్ట్రాన్లు; ప్రోటాను వగైరాల కన్న అతిసూక్ష్మమైన ఊహలోమాత్రమే ఉన్న అమేయమైన సూక్ష్మభాగము. మహత్తు కూడ కొలతచెప్ప లేని అధికభాగమే. రేఖాగణితములోని బిందువు, ద్రవ్యవిభాగములోని పరమాణువు (atom కాదు) వేదాంతశాస్త్రములోని జీవుడు, మహత్వము, అనంతము, పరమేశ్వర డును సమానంగా కల్పితాయి.

ఒక అంగుళప్రదేశములో ఎన్ని బిందువులున్నవి? అనంతము-పరిమితము లో (limited space లో) అపరిమిత, అనంతసంఖ్యగల బిందువులు. మేయంలో అమేయాలు. గణితంలో సున్న, అనంతములు-ఒకటిలో ఎన్ని సున్నాలు, రెండు మొదలైన సంఖ్యలలో, అనంతములో ఎన్ని సున్నాలు? మేయాలలో అమేయాలు చిత్రం కదా? గణనకు మూలము ఒకటి.

ఒకటిని పూర్ణము అంటారు, సున్నానుకూడ పూర్ణమంటారు. పూర్ణానుస్వారము. అధర్వణుల శాంతి మంత్రము—

పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్పూర్ణ ముదచ్యతే
పూర్ణస్య పూర్ణ మాదాయ పూర్ణ మేవావశిష్యతే.

అది పూర్ణము, ఒకటి, ఇది పూర్ణము సున్న, పూర్ణము (సున్న) వలన పూర్ణము (1) విలువ పెరుగుతుంది. పూర్ణము (1) లో పూర్ణము (o) తీసివేస్తే పూర్ణము (ఒకటే) మిగులుతుంది, అది పైదాని కర్థమా?

మితంలో అమితాలు, మేయంలో అమేయాలు-ఈ వైరుధ్యాలు క్రొత్త, అసంభవాలు కావు.

మనకు కలవచ్చేది మనస్సులో. మనస్సు పరిమాణం అణువంటారు. పాశ్చాత్యుల లెక్కప్రకారం (brain) మెదడు తలలో ఉందన్నప్పటికీ దాని పరిమాణం చాలాకొద్ది అనేఅనాలి. మనస్సులో వచ్చే కలలోమనం ఒకవిశ్వాన్ని చూస్తున్నాము. దేశాన్ని, కాలాన్ని-ఇవి అందులో ఆప్రపంచంలోని వారిదృష్టిలో దేశం విభువు, కాలం కూడ-ఆద్యంతాలు లేనివి. ఇవి ఆవిశ్వం వరకే పరిమితాలు. ఆకలకరిగిపోతే ఇవిఅసలు లేవు. కల్పితాలు-మెలకువ వచ్చినతరువాత. మరి ఆకలలో ఉన్నంతవరకుఅవి ఆద్యంత రహితాలు. త్రిపురారహస్యంలో తంగణముని కుమారుని అమేయ అనంతవిశ్వం ఒక పరిమితమైన గండశిలలో ఉన్నది. అందులోకి వెళ్లి చూచివచ్చిన రాజుకు ఈలోకంలో అనేకయుగాలు గడిచినవి. ఇప్పుడు వాస్తవమైన కాల మెక్కడ? దేశకాలాలు వాస్తవాలా? మన యీవిశ్వం, మన సైంటిస్టులు వాస్తవాలనిచెప్పే యీప్రపంచం నిజంగా వాస్తవమా? దీని గురించి ఆలోచించడం తెలిసితక్కువ దౌతుందా?

కాబట్టి నవీన సైన్సులతోపాటు మన శాస్త్రాలుకూడ చదవాలి. అసలు విద్య యేమిటో తెలిసికోవాలి. అదితెలుసుకొని ప్రస్తుత సైన్సువిజ్ఞానాన్నికూడ సంపాదించవచ్చు.

Men of Mathematics గ్రంథంలో పాశ్చాత్య దేశాలలో మేధావులు ఆచార్యులయ్యేవారు. మేధావులకు అప్రధుత్వాలు విశ్వవిద్యాలయాలలో స్థానాలిచ్చేవి. మనదేశంలో మేధకుగుర్తింపు, ఉత్తమస్థానం లేదు. పైగా మనమేధావులు ఆచార్యులు కావడానికంటె ఇంజనీర్లు, డాక్టర్లు కావలెనని చూస్తున్నారు. సుఖండబ్బులోనే (అన్యాయంగా ఆర్జించే) ఉందనేభ్రమతో. ఇంక దేశం ఎట్లాబాగుపడుతుంది?

—o—

## ఏది విద్య? ఎవరు విద్యావంతులు

ఇప్పుడు BA లు, MA లు పరీక్ష అయినవారిలో ఎందఱు సొంతంగా, ఇంగ్లీషులో కాదు, తమ మాతృభాషలోనైనా ఒక పేరా చక్కగా వ్రాయగలరు? అందరూ ప్రశ్నోత్తరాలు కంఠపాఠంచేసి ఉత్తీర్ణులైనవారేకదా? వీరుకాదు, వీరి గురువులలో ఎందఱు ఆవిధంగా వ్రాయగలరు? వారున్నూ గైడ్సుచదివి, అవే డిక్టేటు చేసేవారు కదా?

ఇప్పు డెందఱికి ధర్మమేమిటో అధర్మమేమిటో తెలుసు? ధర్మమేమి స్వధర్మమేమిటో, స్వ అంటే యేమిటో చెప్పనిది విద్యే అవుతుందా?

కష్టపడకుండా వందలువేలు వచ్చే దాస్యపు ఉద్యోగాలు (దాస్యం కుక్కవృత్తి అని మన శాస్త్రాలు) కావలెనని ఆలమటించేవారు, కష్టపడి సంపాదించడానికి పూనుకోనివారు విద్యావంతులా? ఉద్యోగాలు దొరకలేదని, BA లు, MA లు పరీక్షఅయి నక్సలైట్లు మొదలైన సంఘాలలో చేరి దారిదోపిళ్లు, బ్యాంకులు, రైళ్లు, బస్సులను దోపిళ్ళు చేస్తూ, అమాయకులను చంపేవారిని విద్యావంతు లనవచ్చునా? అనుకొన్నది రాకపోతే తప్పత్రాగి ప్రపంచాన్ని మఱచిపోవాలనే వాండ్లు, తోడివాండ్లను మోసగించి డబ్బు సంపాదించాలనే వర్తకులు, కట్నాలు కావాలనేవాండ్లు, అవి ఎక్కువ తేలేదని ప్రేమించవలసిన భార్యలను హింసిచే వాండ్లు, చంపేవాండ్లు, అన్యాయంగా లంచాలు, తమపనులకు అధికమూల్యం, కోరేవాండ్లు విద్యావంతు లనవచ్చునా? న్యాయాన్యాయాలు ధర్మాధర్మాలు గుర్తించలేనివాండ్లు, తమ, తమ నాయకుల తప్పులు తెలిసికోలేని వాండ్లు, అది తప్పని ధైర్యంగా చెప్పలేనివాండ్లు, ఆచరణలో చూపలేనివాండ్లు విద్యావంతులేనా? తనకర్హత లేకపోయినా అధికారం కావలె ననేవారు, అన్యాయాలను సమర్థిస్తూ అబద్ధాలు చెప్తూ ఫోర్జరీలు చేస్తూ అధికారాలను వదలుకోలేక ప్రాకులాడేవాండ్లు విద్యావంతులేనా? Ph. D. లు పెద్దచదువులు చదివి, ఉన్నచోట చెల్లక, తాను పుట్టిన చోట తాను చేయవలసిన పనిగుర్తించలేక కన్నవారిని, దగ్గఱవారిని వారిమానాన వదలివేసి, విదేశాలలో అధికధనంసంపాదించాలని పరుగెత్తే వారువిద్యావంతులనే అనవచ్చునా?

ధర్మం పుట్టిన భారతదేశంలో నిరక్షరాస్యులై కూడ ధర్మాన్ని ఆచరించి చూపిన భారతదేశంలో ఇప్పుడెంత అవిద్య విజృంభించింది? బ్రాహ్మణులు తమధర్మాన్ని గుర్తెఱిగి, ధైర్యంగా ధర్మం మిత్రులవలె బోధించాలి. పాలకులను దిద్దాలి. అందఱిని స్వధర్మోన్ముఖులను చేయాలి. విద్య తనఆధిక్యతను నిరూపించుకోవాలి. ఆలోచనలేకుండా ప్రతిదానికి దౌర్జన్యానికి దిగడం అధర్మమని చాటాలి. సమస్యలు సంప్రదింపులద్వారా పరిష్కరించాలి.

ధర్మమంటే అహింస, పరోపకారం ఇది చెప్పేదే విద్య. ఇది కలవారే విద్యావంతులు.

## ఉత్తమ కళ

ఇప్పుడు కొన్ని మంచి సినిమాలు రచనలు వస్తూనే ఉన్నవి. నన్నయ విశ్వశ్రేయస్సును గూర్చేదే కావ్య మన్నాడు. నిత్యమైన ధర్మం చెప్పేది చూపేది ఉత్తమ కళ. మన రామాయణ భారతాలకు ఇప్పటికి గూడ ప్రజలలో ఎంత ఉత్సాహ మున్నదో గ్రుడ్డి ప్రభుత్వం, గ్రుడ్డికళాకారులు గుర్తించడం లేదు. ధర్మం నిత్యం. అది మారదు. ఇది అంధప్రభుత్వాలకు, అంధ కళాకారులకు తెలియదు. అంధప్రభుత్వానికి వంతపాట పాడేవారు ఉత్తమ కళాకారులు కాదు. అనేకవేల లక్షల సంవత్సరాలు ధర్మం చెప్తూ నిల్చిన మన రామాయణ భారతాలలో శాస్త్రవిరుద్ధమైన వాటిని చొప్పించి, సొగర్లు, చోప్రాలు ఉత్తమ కళను న్యూనపఱచి, అనిత్యతను కొని తెచ్చు కొంటున్నారు. మా గురువుగారు (శ్రీకె. టి. రామారావు పంతులుగారు) అనేవారు "కులాలుపోవాలని వేదాలు తప్పని బౌద్ధులు వగైరా బోధించారు. ఆవిధంగా రచనలు మాత్రం చేయలేదా? ఏమైనవి? శిష్టులు వాటిపేరైనా ఎత్త లేదు. కాలగర్భంలో ఇట్టివెన్నో పోయినవి. ఉపేక్షే వాటికి మందు" అని. ధర్మవిరుద్ధంగా చెప్పేవి నిలవవు.

ఉత్తమ కళాకారులు గ్రుడ్డిప్రభుత్వాల తొత్తులు కాగూడదు. 26.8.89న టి.వి.లో వచ్చిన 'సంసారం' చిత్రం బహు భార్యాత్వాన్ని ఒప్పుకుంటే చక్కని చిత్ర మయ్యేది.

మన పిల్లల పాఠ్యగ్రంథాలలో కూడ ఇట్లాటి వున్నవి. శిష్టులైన ధర్మాభిమానులు సొంత బళ్లు పెట్టుకోవాలి.

—o—

# డబ్బు డబ్బు డబ్బు

ఇప్పుడందరు డబ్బు–ధనం కావాలని పరిగెత్తుతున్నారు కాని ధర్మం కావాలనేవారు లేరు. సనాతన మతంలో పుట్టినవారు కూడ ఇట్లే ఉన్నారు. తమపిల్లలు ఇంజినీర్లు కావాలి, డాక్టర్లు కావాలి, ఈ దేశాలలో విదేశాలలో వేలు, లక్షలు సంపాదించవలెననే చూస్తున్నారు కాని ధర్మం సంపాదించాలని కోరడంలేదు. డబ్బు గొప్ప అనుకుంటున్నారు కాని ధర్మంగొప్ప అని తెలుసుకోవడంలేదు. ప్రపంచమంతా అదే పిచ్చిలో ఉన్నది. బుద్ధిమంతుడు ధర్మం గొప్పతనం తెలుసుకుంటాడు.

తిన్నతరువాత కదా ధర్మం–ముందు శరీరం నిల్పుకో. అది ప్రధానమైన ధర్మసాధనం అని శాస్త్రమే చెప్పింది. కాబట్టి భుక్తి ఉంటేనే ధర్మం. డబ్బు సంపాదించాలి–ఎట్లాగైనాసరే–ధరలు ఆకాశాన్నంటుతున్నవి. వెనుక ఒక అణాకు (6 పై.) వీసెడు వంకాయలు వచ్చేవి. ఇప్పుడు కిలో (2/3 వీశె) 6రులు, 8రులు ఇట్లా పెరిగినవి. ఎంత డబ్బు సంపాదిస్తే బ్రతుకగలరు? కాబట్టి ధనం ముందు తరువాత ధర్మం అంటున్నారు కొందరు.

శరీరం నిల్పుకోమన్నది దేనికోసం? అది ధర్మానికి సాధనం కావాలని. పొట్టనిల్పుకోవడం పొట్టకోసం కాదు. ధర్మాన్ని ధ్వంసం చేసుకోవడానికి కాదు. ధర్మాన్ని చంపినవాడు చస్తాడు. ఘోరక చావడం కాదు. చచ్చి క్రిమికీటకాలుగా, పశువులు పక్షులుగా పుడతాడు. అది ఈ భవబంధము. సనాతనసంప్రదాయంలో పుట్టినవారే చూడడం లేదు. కాబట్టి ధర్మాన్ని చంపేడబ్బు సంపాదించేవిధానం తప్పు. ధర్మాన్ని విస్మరించి డబ్బుకోరడం తప్పు.

పోనీ శరీరంనిల్పడంకోసం డబ్బుకావాలన్నా దానికెంత డబ్బు కావాలి? ఎంత సరిపోతుంది? నెలకు, వేలు లక్షలు కావలెనా? నెలకు

వందరూపాయలు కూడ దొరకని వారెందఱు లేరు? 200, 300 రు.లలో జీవించే పాటకజన మున్నారు. వారు తిండిలేక చస్తున్నారా? మనకు భోగాలు కావాలి, టి.వి. లు కావాలి. విలువైన వస్తువులు కావాలి. ఇదంతా శరీరంపోకుండ నిల్పుకోవడానికేనా? వీండ్లు ధర్మం అనేమాట యెత్తుతున్నారా? ఆచరిస్తున్నారా? ధర్మం చెయ్యకపోతే ఎంతనష్టమో గ్రహిస్తున్నారా? వెనుక అన్ని సుఖాలు వదులుకొని ధర్మంచేసిన వారున్నారు.

ఇప్పుడుకూడ తమ ఆశయాలకోసం త్యాగంచేసేవారు లేకపోలేదు. అడవులలోకిపోయి తమలక్ష్యసాధనకై చావడానికి సిద్ధపడే నక్సలైట్లున్నారు. కూలీలరాజ్యం స్థాపించాలనే కమ్యూనిస్టులున్నారు. సింహళంలో తమిళరాజ్యం స్థాపించాలని కృషిచేసే LTTE వర్గాలు, సింహళీయులరాజ్యం సంపాదించాలనే JVP, ఇస్లాంరాజ్యంస్థాపించాలనే ముస్లిములు, క్రైస్తవరాజ్యం స్థాపించాలనే క్రైస్తవులు, సిక్కురాజ్యంకోసం సిక్కులు హిందూరాజ్యం స్థాపించాలనే RSS, శివసేన, BJP, VHPలు ఉన్నారు. యువకులు పెండ్లిండ్లుకూడ మానుకొని తమ ఆశయసాధనకు బద్ధకంకణులైనవారు లేకపోలేదు. తాముచెప్పేదే ధర్మమంటూ, దానికోసం తక్కినవారిని నిర్మూలించాలంటూ కాంగ్రెసు. టి.డి.పి. వర్గాలలోకూడ చావడానికి సిద్ధమైన వారున్నారు.

ఇది యింకో మహా మూఢత్వం–శరీరం ముఖ్యమంటూ తన శరీరాన్ని ఇతరుల శరీరాలను చంపుకోవడం ఆశయంగా పనిచేయడం–ఆలోచనలేకుండ చంపడానికి చావడానికి సిద్ధపడడం. ధర్మమేమిటో కొంచెం నిలిచి ఆలోచించాలనుకోకపోవడం. కమ్యూనిజంను స్థాపించిన రష్యాలో ఆ కమ్యూనిజం అంతరించింది. వాండ్లు స్వేచ్ఛ కావాలంటున్నారు. హంగరీ, పోలండు, తూర్పుజర్మనీ కమ్యూనిస్టురాజ్యాలలో కమ్యూనిజం పట్టునని వందసంవత్సరాలైనా నిలవకముందే బీటలు తీస్తున్నది. మనవాండ్లింకా దానినిపట్టుకొని ఊరేగుతున్నారు.

కాబట్టి ఇన్ని ఆశయాలలో, ఏ ఆశయం మంచిదో, ఏది ధర్మమో కొంచెం నిలిచి విచారించుకోవాలి. వారు ముందు చేయవలసినపని ముఖ్యధర్మసాధనమైన తన శరీరాన్ని, ఇతరుల శరీరాలను చంపడం మానాలి. అహింసను పూని తర్కంతో విచారణకు దిగాలి. దౌర్జన్యం ముందు మానాలి. నెమ్మదిగా విచారించుకోవచ్చు. ఆ ధర్మం కూడ తనకు ఇతరులకు మేలుచేసేది కావాలి. ఆ విచారణే ఈ నేలమీద జరిగింది. ఎవడి మతంలో వాడు ఇతరులను హింసించకుండా ఉండవచ్చు. పైగా ధర్మం నిత్యమయింది కావాలి. నిత్యమంటే యేమిటో, ధర్మం నిత్యమయిందని ఎవరు చెప్తున్నారో ఏ శాస్త్రాలు చెప్తున్నవో చూడాలి.

ఏ దేవుడు నిన్ను నీ సోదరజీవుని చంపమనడు. (వాడు నిన్ను చంపడానికి వస్తే తప్ప) హింసవు-అందులో అద్వైతి ; ధర్మమేమిటో విచారిస్తాం రా అంటాడు. తెలుసుకుంటే నీకివ్వాడే మోక్షం వస్తుందంటాడు.

దేవుడున్నాడనే వాళ్లు, ఆయన అందరికీ దేవుడు, తండ్రి అనే వాళ్లు ముందు సోదరజీవులను చంపడం మానాలి. దేవుడే వాళ్లను చూస్తున్నాడు. ఆయన సర్వశక్తిమంతుడు కదా! కరుణాసాగరుడు కదా! ఆ దేవుని దండం మన చేతుల్లోకి తీసుకొని సోదరులను చంపడం అధర్మం. ఇంతకు నాదిరైటో తనదో తేలనప్పుడు - కాబట్టి ముందు హింస మానాలి.

దేవుడు లేనవాడికి శరీరమే దేవుడనేవాడికి, ఎవరి శరీరం వాడికి దేవుడు. వాడి శరీరాన్ని నేను చంపుతానంటే వాడూరుకొంటాడా? కాబట్టి నాస్తికుడు కూడ అహింస పూనాలి. విచారణకు రావాలి.

మాటేదైనను, మాకు విచారణ అవసరం అంటే హింసమాని ధర్మంలో ఉండు. ఇది ఒక్క హిందూదేశమే చెప్పింది _**live and let live** అని

ఈ నేలలో పుట్టినవాళ్లు, వచ్చినవాళ్లు తర్కం వల్లనే, విచారణ వల్లనే ధర్మం తేల్చాలన్నారు. అంటారు. అదినిత్యమంటారు.

ప్రతివాడు నిత్యంగా అంటే ఎల్లప్పుడూ సుఖంగా ఉండాలని కోరుతున్నాడు. నిత్య మోక్షం చెప్పే శాస్త్రం నిత్యమయింది కావాలి. అది పుట్టి చచ్చే పురుషుడు చేసేది పౌరుషేయం కాగూడదు. అది అపౌరుషేయము కావాలి.

అవే మన శ్రుతులు— వానిని వివరించే స్మృతులు చెప్పింది. భగవద్గీతలో పరమేశ్వరావతారమైన శ్రీకృష్ణుడు చెప్పింది— 'తస్మాత్ శాస్త్రం ప్రమాణంతే'. కాబట్టి 'నీవు శాస్త్రం చెప్పినట్లుచెయ్యి' అన్నారు. నిత్యమైన ధర్మం చెప్పే శాస్త్రం.

ఇప్పుడు టి. వి. రామాయణం, భారతం, విశ్వామిత్ర వగైరా కొంత మంచి చెప్తూ, మన నిత్య శాస్త్రాలను తప్పుడుగా చిత్రిస్తున్నవి. ఇప్పటి మన నాయకులు రావణాసురుడు, దుర్యోధనుడు, కర్ణుడు వగైరాలను మెచ్చుకుంటు వారిని వీరులను చేసి మనము ధర్మాత్ములన్న వారిని హీనులుగా చిత్రిస్తున్నారు. వారు రాక్షసులై రాక్షసులను సృష్టిస్తున్నారు. కర్ణుడు, దుర్యోధనుడు ధర్మాన్ని గుర్తించకుండా చచ్చారు. భీష్ముడు, ద్రోణుడు అధర్మ పక్షంలో ఉన్నారు. అది అధర్మమని చెప్పి చచ్చారు. మనవాండ్లు రాక్షసులలోకూడ మంచిని గ్రహించారు. దేవతలలోని చెడునుకూడ గుర్తించారు. మంచికి మంచి ఫలం చెడుకు చెడు ఫలం చెప్పారు.

శాస్త్రం ధర్మాన్ని సామాన్యమని స్వధర్మమని, పరధర్మమని వేరు వేరు చేసి చెప్పింది. అందరు సమానమైన ధర్మం చెయ్యాలి. స్వధర్మమూ చెయ్యాలి. ప్రతి సంస్థలో—ఇంట్లో, బయట—తాను చేయవలసిన స్వధర్మం, సొంతడ్యూటీ చేయకూడని పరధర్మం, ఇతరులడ్యూటీ, అందరు చేయవలసిన ధర్మం, డ్యూటీ ఉన్నదని గ్రహించి ప్రవర్తించాలి. కాబట్టి డబ్బుమీది వ్యామోహం తగ్గించి, శరీరపోషణకు ఎంత అవసరమో గుర్తించి, ధర్మానుష్ఠానికి ధర్మ ప్రచారానికి దిగాలి.

—o—

## వృద్ధుల ఇక్కట్లు

వెనుక మన సమిష్టికుటుంబాలలో తల్లిదండ్రు లున్నంతవరకు కొడుకులు కోడండ్రు, వాండ్ల పిల్లలు అంతా కలసి ఉండేవారు. పరస్పరం సహాయం చేసుకొనేవారు. గ్రామాల్లో, పట్టణాలలో కూడ ఒక్కొక్క కుటుంబాలలో ఎక్కువమంది ఉండడంవల్ల వైద్యం అవసరమైనా, వైద్యులను పిలవడానికి, మందులు తీసుకరావడానికి, ఉపచారాలు చేయడానికి అందరు చిన్న పెద్ద సహాయపడేవాండ్లు. మనుమలతో మనుమరాండ్రతో, ఆడుకుంటూ, పాడుకుంటూ, సమవయస్కులతో సల్లాపాలు చేస్తూ చిన్నవారికి సలహాలు ఇస్తూ వృద్ధులజీవితం హాయిగా నడచేది.

క్రొత్త చదువులు, పెద్ద చదువులు వచ్చిన తరువాత ఒకరికి 4, 5 గురు కొడుకులున్నా వారికొకేచోట ఉద్యోగం దొరకక, వేఱు వేఱు పట్టణాలకు, ఇతర రాష్ట్రాలకు, ఇతర దేశాలకు గూడ వెళ్ళవలసిన పరిస్థితి రావడంతో ముసలి తలిదండ్రులపని ఇరకాటంలో పడ్డది. పట్టణాలలో అద్దెయిండ్లలో ఉండడం. అద్దె లెక్కువగా ఉండడం ఆర్థిక స్తోమతును బట్టి అవి ఇరుకుగా ఉండడం, ముసలివారికి సౌకర్యాలు లేక వారు ఉన్నచోటనే ఉండవలసివస్తున్నది. వారు మరణావస్థలో ఉన్నా కొడుకులు రాలేని పరిస్థితి వచ్చింది. పోనీ వారు దూరదేశాలల్లో తాము సుఖంగా ఉన్నారా అంటే అదికూడ చాలామందికి లభించడం లేదు. క్వార్టర్సులేనివారు ఆఫీసులకు దూరంగా అద్దెయిండ్లలో ఉండడం, భర్త ఉదయం హడావిడిగా భోజనంచేసి, చేయక ఉదయం వెళ్తే తిరిగి ప్రొద్దు గ్రుంకిన తరువాత రావడంవల్ల ఇంటివద్ద భార్యాపిల్లలకు సహాయం అవసరమైతే అది ప్రస్తుత జీవన విధానంలో లభించడంలేదు,

యువదంపతులు ఒంటరిగా స్వేచ్ఛగా మొదట ఉంటూ జీవితమాధుర్యం చవిజూచా మనుకున్నా, సంతానం కల్గినతరువాత వారుకూడ సహాయం. కోరవలసి వస్తున్నది. పాశ్చాత్యదేశాలలో పిల్లలు పెద్దవారు కావడం తోటే తల్లిదండ్రుల నుండి చీలి, వేఱుకాపరాలు పెడ్తారు. అయితే అక్కడ కుటుంబవైద్యులు, ప్లీడర్లు వగైరా అవసరము వచ్చినప్పుడు పిలిస్తే వచ్చి బాధ్యతవహించి సహాయం చేస్తారు. తమకు మించినప్పుడు సలహాలిచ్చి సహాయం కూడ చేస్తారు. పిల్లల ఉపాధ్యాయులు కూడ బాధ్యతవహించి తమవిధులు నెరవేరుస్తారు. ఇక్కడ ఆ విధంగా కాక డబ్బు దోచుకోవడమే ప్రధానంగా చూడడం వల్ల యజమానికి డబ్బు వదలుతుందిగాని, తృప్తి, శాంతి కల్గదు. పైగా వైద్యులు ఇప్పుడు ఇండ్లకు రోగులను చూడడానికి రాకుండా వాండ్లను తమవద్దకే తీసుక రమ్మనడం, ఒకవేళ యెవరైనా వచ్చినా ఎక్కువ డబ్బు కోరడం, దయాదాక్షిణ్యాలు, సానుభూతి లేకపోవడం జీవితమిక్కడ సామాన్యులకు చాల కష్టము కల్గించేదయింది.

వార్ధక్యం షేక్స్పియర్ మహాకవి రెండవ శైశవం అన్నాడు. శిశువు సర్వానికి తల్లిదండ్రులమీద, ఇతరులమీద ఆధారపడ్తాడు. అది బలము, జ్ఞానము పెరిగే రోజులు. తమ ముద్దు మురిపాలతో ఆకర్షించే రోజులు. ఇది బలము జ్ఞానము తగ్గే రోజులు. శక్తి తగ్గి, ప్రతిపనికి ఇతరులమీద ఆధారపడవలసిన పరిస్థితులు వస్తవి. శిశువు మలమూత్ర విసర్జనచేస్తూ అందులో పొర్లాడితే, అధికానురాగంతో, అసహ్యించుకోకుండ తల్లి శిశువును పెంచుతుంది. అటువంటి మాతృప్రేమ ఇక్కడ ఉండదు. కొడుకులు తమ శైశవంలో తల్లిదండ్రుల ఆదరణను జ్ఞాపకముంచుకొని ఎందఱు తమ తలిదండ్రులకు తోడ్పడుతారు? ఇక్కడ ధర్మబుద్ధి, పుణ్యము అనే భావం ఉంటేనే వృద్ధులకు తగిన సేవ లభిస్తుంది. వెనుక మన సమిష్టి కుటుంబాలలో ఈ ధర్మబుద్ధి, ఉపకారబుద్ధి ఉండేవి. అందువలన వృద్ధుల జీవితాలు సుఖంగా ముగిసేవి. వృ

ద్ధుల బాధలు యువకులకు అర్థంకావు. అవి అనుభవంలో లేవుగనుక. వయస్సు పెరిగే కొద్ది, ముసలివారికి మృత్యువు ఎదురుగా ప్రతిక్షణం కనబడుతుంది. వ్యాధిగ్రస్తులైతే తమ జీవితాలెట్లా ముగుస్తవో, ఎంత బాధపడవలసి వస్తుందో అని తఱచుగా విచారిస్తుంటారు. ఇది సానుభూతితో చూచి, వారిని పరామర్శిస్తూ, ధైర్యం చెప్పడం, సేవ చేయడం సామాన్యంగా జరగదు. అసలు కొడుకులకు, కోడండ్రకు వారి పనులవలన తీరికగూడ ఉండదు. మనపాలకుల ధర్మంవలన, కుటుంబ నియంత్రణపేరుతో వృద్ధులకు సహాయపడ గల సంతానాన్ని నియమించి వారి జీవితం దుర్భరం చేశారు. వారు వృద్ధులై ఆ కష్టాలు అనుభవానికి వచ్చినప్పుడు ఆ బాధ తెలుస్తుంది.

పాశ్చాత్యనాగరికతను మన పాలకులు దిగుమతిచేసి మన ధర్మాన్ని చంపుతున్నారు. వీరికి దేవుడు, మతము లేదు. అన్నీ తామే చేయగలమని, చేయవలెనని ఆర్భాటము. పిల్లలెక్కువైతే మేము పోషించలేమని, వారికి వృత్తులు చూపలేమని ప్రభుత్వం అదంతా తానే చేస్తున్నట్లుగా భ్రమపడి పిచ్చిచట్టాలు తెస్తున్నది. లేనివి నెత్తిన వేసుకొని, అవి పరిష్కరించలేక, కష్టాలను ఎక్కువ చేస్తున్నది. మనుష్యులను నడిపించేది వారి కర్మే అని, పరమేశ్వరుడే అన్ని సమస్యలను పరిష్కరిస్తాడని వారికి తెలియదు. వర్షాకాలంలో వృద్ధిపొందిన జీవ సంతతి, వేసవి వచ్చేటప్పటికి మిగలదు. మన ప్రచారసాధనాలు, పత్రికలు, టి. వి., రేడియో వగైరాలు నాస్తికమతాన్ని బోధిస్తూ, అశాంతిని, అసౌఖ్యాన్ని పెంచుతున్నవి. అందువలన ప్రజకూడ దురాశతో ధనం సంపాదించడమే పరమార్థంగా పెట్టుకొని ధర్మదూరులౌతున్నారు. వృద్ధులపని దుస్సహమౌతున్నది. ఇంకా వెనుకటి సంప్రదాయం సాగినచోటనే వృద్ధులు నిలువగలుగుతున్నారు.

• పాశ్చాత్యదేశాలలో వారికి శరణాలయాలు, పెన్షనులు మొద

లైన సౌకర్యాలు కల్గిస్తున్నారు. ఇంటిదగ్గఱ మనుమలు మనుమరాండ్రతో, కొడుకు కోడండ్ల ఆదరంలో ఉండేసుఖం వారికి శరణాలయాలల్లో ఏమి దొరకుతుంది! తాతలు, అవ్వలు పిల్లలకు కథలుచెప్తూ, కొడుకులకు కోడండ్రకు తగిన సలహాలిస్తూ, చేతనైన పనులు చేసి సహాయపడ్తూ ఉండే మన సుఖమయజీవితాలిప్పుడీ అధర్మపాలనవలన తారు మారౌతున్నవి.

వృద్ధులలో ఒక్కొక్కప్పుడు కొందఱు విసుగుకొనడం, కోపపడడం, గొణుగుకొనడం మొదలైనవి చేస్తూ చిన్నవారలతో సహకరించరని, సర్దుకొనిపోరని అంటారు. ముఖ్యంగా ఆడవాండ్లు ఈవిధంగా ఉంటారు. చాలామంది వివేకం గలిగి, వీలైనంతవఱకు సర్దుకొనిపోతూనే ఉంటారు. కొందఱు వెనుకటి అభ్యాసంవలన, బాధలను ఓర్చుకోలేక కొంచెం విసుగు ప్రదర్శిస్తారు. అది రెండవ శైశవమని, వారికి బలము, శక్తి, మనస్సు స్వాధీనం తప్పవచ్చునని, దానిని సానుభూతితో చూచి లక్ష్యపెట్టక, తమసేవ మానరాదని ఎందఱు గ్రహించగలరు? అజ్ఞానులైన శిశువులుచేసే అల్లరి ఎంతైనా సహించగలరుగాని ఈ పెద్దశిశువులు చేసే పొరపాట్లను ఎందఱు సహిస్తున్నారు? వార్ధక్యంలో శక్తులు, ఆరోగ్యం తగ్గేరోజులు. కండ్లు కనబడవు, చెవులు వినబడవు. సరిగా మాట్లాడలేరు. శిశువుకంటె దయనీయమైన ఈ స్థితిని గమనించి తోడ్పడిన వారు నిజంగా గొప్ప పుణ్యాత్ములనాలి. ఇప్పుడు చూపించిన శాంతమే ప్రశంసనీయ మౌతుంది. అందఱికి సౌఖ్యమిచ్చే మన సమిష్టికుటుంబ జీవితం మనం వదలకూడదు. మనమంతా ఒకే కుటుంబ మనుకొన్నప్పుడు ఇతరుల తప్పులు గొప్ప తప్పులుగా కనబడవు.

—౦—

# ఏది మంచి వ్యవస్థ

1. రెండు కుటుంబా లున్నాయి. ఒకకుటుంబములోని సభ్యు లందరు ఎవరిపని వారేచేసుకుంటారు. మంగలిపని, చాకలిపని, వంట, వార్పు, ఇంట్లుతోముకోవడం, బజారునుంచి వస్తువులు తెచ్చుకోవడం, డబ్బుసంపాదించడం వగైరా. అంతా స్వార్థమే చూస్తారు.

2. రెండవకుటుంబం అట్లాకాక అందులోని వ్యక్తులు వారిశక్తులనుబట్టి పనులు పంచుకొని చేస్తారు. ప్రతివ్యక్తి తనపనివలని ఫలం అందరికి అందిస్తాడు. స్త్రీలు ఇంటిపని, వంటవార్పులు వడ్డనలు వగైరాచూస్తారు. పురుషులలో ఒకడు పొలందున్ని పండించి తెస్తాడు. ఒకడు వైద్యం చేస్తాడు. ఒకడు పుస్తకాలు చదివి అందులోని విశేషాలు అందరికిచెప్తాడు. ఎవరిపనివారు చేస్తూ అందరికి సహాయపడ్తారు. అంగహీనులు తాము చేయగల పనులు చేస్తారు. యజమాని అందరి మేలు చూస్తాడు. ప్రతివ్యక్తి స్వార్థంకోసం కాకుండ అందరి మేలు చూస్తాడు. యజమానికి ఎక్కువ గౌరవంవద్దన్నా కొన్ని యెక్కువసౌకర్యాలు తక్కినవారు స్వయంగా కలిగిస్తారు, ఎవరును ఎవరికిన్నీ బానిసలుకారు. వారివారి పరిధులలో వారికి స్వేచ్ఛ ఉన్నది.

3. ఇందులో ఏ కుటుంబంవారు ఎక్కువ సుఖపడ్తారు ? ఏది నాగరకత గల కుటుంబం ? బుద్ధి ఉన్నవారు రెండవ కుటుంబ మనాలి. ఇందులో శిశువుల, వృద్ధుల, రోగుల, అంగలోపంగల అందరికి సహాయం లభిస్తుంది. మొదటి కుటుంబంలో ఇవేమిన్నీ జరగవు. ముసలివారిని శిశువులను అనాథశరణాలయాలకు పంపుతారు. అందరు వర్తకబుద్ధితో స్వలాభముద్దేశించే పనిచేయడం తల్లిదండ్రుల కున్నప్రేమ శరణాలయాల వాండ్లకుంటదా ? ముసలివారు కొడుకుకోడండ్రు మనుమలు మనుమరాండ్రతో సుఖిస్తారా ? శరణాలయంలోని ఇతరవృద్ధులతోనా ?

4. ఇదే గ్రామాలకు వర్తింపజేస్తాం—ఒకగ్రామంలోఉండే కుటుంబాలు అన్నీ ప్రతి కుటుంబం అన్నిపనులు చేయగల్గి ఉండాలని, అట్లా ఉండడం చేస్తారు. రెండవ గ్రామంలోనివారు వివిధవృత్తులను వారితెలివితేటలనుబట్టి చేస్తారు. ఆగ్రామంలో అందరు కలిసి అందరి మేలుకు పనిచేస్తారు. ఉపాధ్యాయుడు అందరిపిల్లలకు చదువు చెప్తాడు. వైద్యుడు అందరికి వైద్యంచేస్తాడు. రైతు పంట పండించి అందరికి తగినన్ని ధాన్యం కొలుస్తాడు సహాయానికి విలువకట్టి వెంటనే ఇవ్వడం లేదు. వైద్యుడు రైతుకుటుంబానికంతా వైద్యంచేస్తే పంటపండినప్పుడు మామూలు ప్రకారం రైతు అతనికి ధాన్యం కొలుస్తాడు. ఒక సంవత్సరం వైద్యం చేయించుకోకపోయినా, ధాన్యం

కొలవడం మానడు. ఒక సంవత్సరం పంటలు పండకపోయినా వైద్యుడు వైద్యం మానడు. అందువలన ప్రతి ఒక్కడు తన కితరులు ఉచితంగానే సహాయం చేస్తున్నారన్న భావన కృతజ్ఞతను ప్రేమను పెంపొందిస్తుంది. సేవలే ఇక్కడి మార్పిడి ద్రవ్యం. రైతు తన కొడుకును ఉపాధ్యాయుని కప్పగిస్తే అతడతనిని తనకొడుకువలెనే పైకితీసుక రావలసిన భారం వహించి చేయవలసినదంతా చేస్తాడు. జబ్బుచేసినప్పుడు వైద్యుడే బాధ్యత వహించి, తన శక్తి కొలది యత్నించి తనశక్తిని మించినప్పుడు చేయవలసిన పనిని చెప్పి తనకంటె అనుభవంకల వైద్యులను తెచ్చి చూపిస్తాడు. దీనివలన గ్రామమంతా ఒకేకుటుంబమనే భావన కలుగుతుంది. ఇట్లే చాకలి, మంగలి, వడ్రంగం, కమ్మరిపని, కుమ్మరిపని అన్నివృత్తులు పంచుకొని చేస్తారు. ప్రతివాడికి ఆవృత్తిలో గరిష్ఠమైన తెలివితేటలు గలవారి సహాయం లభిస్తుంది. అందువలన ప్రతివ్యక్తి సంతృప్తికల్గి సుఖాన్ననుభవిస్తాడు. మనపూర్వ గ్రామాలన్నీ ఈవిధంగా అష్టాదశవృత్తులతో స్వయంపోషకాలుగా ఉండి గరిష్ఠసహాయాన్ని పొందుతూ, స్వేచ్ఛగా బానిసలుకాకుండ జీవితాలు గడిపారు. అయితే ఇందులో వృత్తి నిబట్టి గౌరవాగౌరవాలు లేకుండపోలేదు. కొన్నివృత్తులు, కొన్నివృత్తులకన్న ఎక్కువగౌరవాన్ని పొందుతూ ఉండేవి. వృత్తి నిబట్టి గౌరవము, ఆ వృత్తిని తాను న్యాయంగా చేయడంవల్ల కూడ, తన గుణగణాలవల్ల కూడ గౌరవాన్ని పొందుతూ ఉండేవారు. ఊరంతా ఒకకుటుంబంవలెనే ఉంటూ కష్టనష్టాలు వచ్చినప్పుడు ఆదుకుంటూ, ఉత్సవాలలో భాగాలు పంచుకొంటూ జీవించారు.

6. ఈ వృత్తులలో కూడ ఒకవడ్రంగి తెలివితేటలు కలవాడు అందరిపనులు చక్కగా చేశాడనుకుందాము. ఆపనిని అతని కుమారుడు చిన్నప్పటినుంచి చూస్తూ ఉండడం, ఆ పనిముట్ల ఉపయోగం అతనికి తెలిసినట్లుగా ఆ వృత్తిని క్రొత్తగా నేర్చుకొనేవాడికి తెలియదు. పైగా తండ్రి తన వృత్తి రహస్యాలను తనకొడుకుకు చెప్పినట్లుగా ఇతరులకు సాధారణంగా చెప్పడు. ప్రతివ్యక్తి తానందరిని మించవలెనని కోరుతూ తనకొడుకు తన్ను మించవలెననికోరుతాడు. అందువలన వృత్తులు వంశపారంపర్యంగా వచ్చినప్పుడు అవి ఉన్నతస్థాయిని పొంది మనదేశంలో కళలై ప్రపంచమంతట పేరుగాంచినవి. దీనివలన ప్రతివ్యక్తికి చిన్నప్పటినుండే వృత్తి తేలడంవలన దానిని వెదకి కొనుట, నిరుద్యోగసమస్య మనదేశంలో లేదు. కొన్నితరాలుగా వృత్తులిట్లా సంక్రమిస్తే కొన్నిశక్తులు పుట్టుకతోనే వచ్చే అవకాశం కూడ ఉంటుంది. మన దేశం సుభిక్షంగా ఉండడానికి, వెనుక ప్రపంచంలో ప్రసిద్ధికెక్కి ఇతరదేశాలవారందరూ

మనదేశానికిరావలెనని, మనతో వర్తక వ్యాపారాలు చేయాలని మార్గాలన్వేషించారని చరిత్ర చెప్తుంది. దీనికి కారణం వంశపారంపర్యంగా వచ్చిన మన కులవృత్తు లే.

౬. వీరందరు బానిసలు కారని, సొంతఆస్తులతో స్వేచ్ఛావాయువులు పీల్చారని గ్రహించాలి. బ్రిటిషువారు వచ్చి, మనలోమనకు ద్వేషాలుకల్పించి తాను రాజ్యం చేయాలని అగ్రజాతులు హీనజాతులను అణగద్రొక్కారని వ్రాశారు. బోధించారు. కాని నిజంగాచూస్తే అన్నిజాతులలోను ధనవంతులు, శీలవంతులు, భక్తులు, జ్ఞానులు ఉన్నారని, పరస్పరం సహాయం చేసుకొని ఒకకుటుంబంగా వర్తించారని కొంచెము జాగ్రత్తగా చూస్తే తెలుస్తుంది. ఒక కుటుంబములోకూడ పెద్ద, పిన్న, గౌరవించ తగినవారు దయగా చూడవలసినవారు ఉన్నట్లే గ్రామంలో కూడ ఉంటారని గ్రహించాలి. ఇది ప్రపంచంలో అన్నిచోట్ల ఉన్నది. అందరు సమానులని, సోదరులని, స్వేచ్ఛకలవారని వాదించే పాశ్చాత్యరాజ్యాలలో హిట్లరు, స్టాలిన్ వగైరా తోడివారిని కాంసెంట్రేషను క్యాంపులలో హింసించి చంపారు. నిర్దాక్షిణ్యంగా లక్షలను ఊచకోత కోశారు. ఈ ఘోరాలు మనదేశంలో మనరాజ్యం ఉన్నప్పుడు ఎప్పుడు జరుగలేదు. ముస్లింరాజ్యాలు, ఆంగ్ల పరిపాలన వచ్చినప్పుడే ఇట్టి ఘోరాలు జరిగినవి.

౭. ఈ కులాలలో కూడ మిక్కిలి తెలివిగలవారు ఇతరవృత్తులు పూని రాణించినవా రున్నారు. హరిజనులు కూడ సొంత ఆస్తులతో శీలవంతులై, భక్తులై, జ్ఞానులై గౌరవాన్ని పొందకుండ ఉండలేదు. ఈ పాకీపనికూడ ముస్లిం ఇంగ్లీషు పరిపాలనలో వచ్చిందేకాని మనపాలనలో ఎక్కడ లేదు. మన గ్రంథాలలో ఎక్కడ ఇది కనబడదు.

౮. వృత్తి విభజన, అది వంశపారంపర్యంగా రావడం గొప్పనాగరికతను సూచిస్తుంది. అందరికి సుఖశాంతులిస్తుంది. నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తుంది. ప్రపంచ సమస్యలకు మనదేశము చెప్పే పరిష్కార మీ వర్ణాశ్రమ విభాగము. ప్రపంచమంతా ఒకకుటుంబమను దీనిని పాశ్చాత్యులు గూడ ప్రశంసించిన వారున్నారు.

౯. సమిష్టికుటుంబం మొదటి యూనిట్. తరువాత గ్రామవ్యవస్థ. ఇదే పంథాలో మండలాలు, తరువాత దేశం. దేశాలు, ఖండాలు. అన్నీ ఏక కుటుంబంగా భావించి, పనులు ఆయాదేశాల వనరులనుబట్టి విభజించుకొని, కృత్రిమములైన ప్రాంతీయత జాతీయత, మతవర్గ సంకుచిత భావాలు దిగమ్రింగి ప్రపంచమంతా ఒకేకుటుంబం, అందరు ప్రపంచ పౌరులు అని గ్రహిస్తేనే ప్రపంచంలో శాంతివచ్చేది దీనికి మన మతం కూడ సర్వేజనాస్సుఖినో భవంతు, లోకాస్సమస్తా స్సుఖినోభవన్తు అనేదే అం

దలు నేర్చుకొనవలసినది. అప్పుడే విశ్వశాంతి చేకూరేది.

అందరు సమాన మనడం గ్రుడ్డితనం, ఆలోచించే మెదడు లేకపోవడం. పురుషులు స్త్రీలు సమానమని బుద్ధిలేని పురుషులు, స్త్రీలు తెగవాగుతున్నారు. స్త్రీలు ప్రతినెల యౌవనంలో 3 రోజులు రజోదర్శనాన్ని పొందుతారు అప్పుడు వాండ్లకు విశ్రాంతికావలెనని మన శాస్త్రాలేకాక, ఆధునిక సైన్సుకూడ చెప్పింది. అది దుష్టరక్తమనిన్నీ వారు దూరంగా అస్పృశ్యులుగా ఉండవలెననిన్నీ. శూద్రులు దీనిని పాటించక పోయినను, ద్విజులు దీనిని పాటిస్తూనే ఉన్నారు ఇప్పుడు పాశ్చాత్యనాగరికత ముదిరి బ్రాహ్మణులు కూడ ముట్లు ఇంట్లో కలుపుకుంటున్నారు. స్త్రీ మాత్రమే గర్భం ధరిస్తుంది. పురుషులకిది లేదు. అప్పుడు గర్భం పెరిగే కొద్దీ స్త్రీకి విశ్రాంతి కావాలి. గర్భంలోని బిడ్డసరిగా పెరగడానికి వీలుగా ఆమె పాటించవలసిన ఆహారవిహార నియమాలున్నవి. మనస్సుకూడ సంతోషంగా ఉండాలి. భర్త ఆమె కోర్కెలు తీర్చవలెనని మన శాస్త్రాలు చెప్పినవి. ఈ కోరిక మూలంగానే సీతాదేవికి రెండవమారు అరణ్యవాసం వాల్మీకి తపోవనవాసం ప్రాప్తించింది. స్త్రీ ఈ విధంగా ఉండనిచో సంతానం సరిగా ఎదుగడం పుట్టడం జరగక, జాతికే నష్టంవస్తుంది. అందువలన మన శాస్త్రాలు స్త్రీకి ఎక్కువ గౌరవమిచ్చి, పురుషులామెను రత్నంవలె రక్షింపవలెనని, గౌరవింపవలెనని, పూజింపవలెనని చెప్పినవి. పెండ్లి కోసం కట్నాలుకోరే దుర్మార్గులు, కట్నాలు తెచ్చినా ఇంకా తెమ్మని హింసించే రాక్షసులు సనాతన ధర్మపరులు కారు. కొందరు మూఢులు స్త్రీశిశువు కల్గునని కనుగొని, పుట్టకముందో, పుట్టిన తరువాతనో ఆశిశువును చంపుతున్నారనే మాటలు వినవస్తున్నవి. ఇంతకన్న పైశాచిక కృత్య ముండదు. స్త్రీ లేనిచో జాతే ఉండదు. సంతానానికి కారణమైన స్త్రీపురుషుల కలయికయే సర్వాపదములకు మూలమని తైత్తిరీయ బృహదారణ్యకశ్రుతులు చెప్పినవి. (బృ. 2–4–11 తై. 3–10) శిశువును కన్నతరువాతకూడ స్త్రీ చేయవలసినపని ఆగదు. బిడ్డకు పాలిచ్చి పెంచాలి. జంతువులలోకూడ ఇది ఉన్నది. కొందరు నాగరక స్త్రీలు పిల్లలకు స్తన్యమిచ్చుట యౌవన భంగమని పిల్లలు పెరగడమే కష్టం చేస్తున్నారు. తనపాల వలన వారు ఆరోగ్యంగా పెరిగినట్లుగా, పాలపొడర్లవల్ల ఇతరమైన ఆవు, గేదె పాలవల్ల శిశువులు బాగా పెరుగరు. దైవమే, ప్రకృతియే ఇది స్త్రీల అధీనం చేసింది. శిశువుల అభివృద్ధికొఱకు వారు రోగగ్రస్తులు కాకుండుటకు తల్లులు పథ్యపానములు చెయ్యాలి. తమ ఇష్టం వచ్చినట్లు తినడానికి వీలులేదు. తరువాత 2, 3 సంవత్సరములు దాటిన తరువాత కూడ మొదట విద్యాబుద్ధులు తల్లే చెప్పవలసి ఉంటుంది. నవమాసములు

మోయుట, తరువాత పిల్లలను కని పెంచుటవలన, తల్లికి శిశువుమీద ఉన్న ప్రేమ తండ్రి ప్రేమ కన్న ఎక్కువ. శిశువుకు కూడ తండ్రిదగ్గరకన్న తల్లి దగ్గరనే చనవెక్కువ. అందుకనే మనశాస్త్రము తండ్రికన్న కొడుకుకు తల్లియే ఎక్కువ పూజ్యురాలని చెప్పింది. శ్రుతి ముందు మాతృదేవోభవ అని తరువాతనే పితృదేవోభవ, ఆచార్యదేవోభవ అని చెప్పింది. ఈవిధంగా సత్సంతానాన్ని, కనిపెంచవలసిన స్థితి సహజంగా స్త్రీకున్నందున ఆమె రత్నంవలె రక్షింపతగిందని, అబలఅని మనశాస్త్రాలుచెప్పి ఆమెను గృహానికి పరిమితంచేసి గృహానికిరాణిఅని ఆమెనుచెప్పినవి. స్త్రీపురుషులపనులు ఇంట, బయట అని ప్రకృతియే, దైవమే విభజించిందని గ్రహించలేని పురుషులు, స్త్రీలు, గ్రుడ్డివారవడానికి సందేహమేమైన ఉన్నదా ? అంధులు కానిచో వంచకులు దుష్టులు. లత వృక్షముపైవలె స్త్రీ పురుషునిపై ఆధారపడి ఉండాలి. వారొకరినొకరు పూజించువారు. ఇవన్నీ మన శాస్త్రాలు చెప్పినట్లుగా మరెవరును చెప్పలేదు.

10. అయితే వెనుక అగ్రజాతులు హీనజాతులను అణగద్రొక్కలేదా ? అస్పృశ్యతను గురించి వివరంగా వ్రాయవలసి ఉంటుంది. ఒకటిమాత్రము హరిజనులు గుర్తించాలి. మనరాజ్యంలో వారిని తాకకపోయినా తక్కినవారు వారిని హింసింపలేదు. మన గ్రంథాలు చదివినా, అప్పటిగ్రామాలస్థితి జాగ్రత్తగా పరిశీలించినా ఇదే తెలుస్తుంది. హరిజనులు ఇతరవృత్తులు-గుడ్డలునేయుట, వీధిభాగవతములు వేయుట నేనెరుగుదును. బ్రాహ్మణులలో కూడ ధనవంతులకంటె బీదవారే యెక్కువ. పరిపాలన క్షత్రియులకు, వర్తకము వైశ్యులకు కృషి ఇతరవృత్తులు శూద్రాదులకు, బ్రాహ్మణులు పౌరోహిత్యము, యాచన తమకు ఉంచుకొన్నారు. ధనధాన్యములను విలువచేసుకొను బ్రాహ్మణుని శాస్త్రము గర్హించింది.

11. ఇంగ్లీషు చదువువచ్చిన తరువాతనే వారిబోధవలన మన ధర్మము చచ్చినది. స్వార్థము పెరిగినది. అగ్రజాతులు తక్కువవారిని హింసించుట ప్రారంభమైంది. బ్రాహ్మణుని దింపుటకు నిత్యములు తార్కికములు అయిన మనశాస్త్రములు మూఢవిశ్వాసపూర్ణములని వారిచదువులలో చెప్పి ద్వేషాలు పెంచారు. దానిని బడుగుజాతుల వోట్లకోసం, మనశాస్త్రాల గొప్పతనంతెలియని మననాయకులు నెహ్రూ గాంధీ మొదలైన వారు ఆద్వేషాలను శాశ్వతంచేశారు. మనరాజుల పాలనలో ఈ ఘోరాలు లేవు.

12. అందరు సమానమని బోధించే పాశ్చాత్యులు నీగ్రోలను జంతువులను అమ్మినట్లమ్మారు. సమానత్వము, సోదరత్వము, స్వేచ్ఛ అందరికి ఉన్నదంటూ తమ

తెల్ల సోదరులనే భిన్నాభిప్రాయాలు కలవారిని హిట్లరు, స్టాలినులవలె ఊచకోత కోసిన వారున్నారు. హింసించిన వారున్నారు.

13. శ్రీ N. A. ఫల్కీవాలా (*I.E.29.8.90*) మండల రిపోర్టు తెలివిలేని వారిని తెలివిగలవారిని గుర్తించకపోవటం అపరాధమంటూ, తాను మళ్ళీ అంతా సమానమని, సమానత్వం లేకపోతే డెమోక్రసీయే లేదని వాదించడం ఏమనాలి ? అంతా సమానమనడం సిద్ధాంతమైతే అందరూ ఇంజనీర్లు, డాక్టర్లు, ప్రధానులు కావచ్చు. అసలు ప్రణాళికలే పనిలేదు. ప్రత్యేకంగా ఎన్నికలు, ఉద్యోగాలకు అర్హతలు చూడవనే లేదు. కాని అందరు పాశ్చాత్యులుకూడ ఆవిధంగా చేయడంలేదు. ప్రత్యక్షమైన భేదాలను గుర్తించి అందరి జీవులను బ్రహ్మము అయ్యేటట్లుగా వేసిన మనమహర్షుల సనాతన నిత్యధర్మ ప్రణాళికను మించిన ప్రణాళిక మరొకటిలేదు. ఎవరెవరు ఏమి కోరుతున్నారో ఎట్లా జీవిస్తున్నారో కొంచెం చూస్తే ఎంత వైవిధ్యముందో తెలుస్తుంది. కాబట్టి వైవిధ్యాన్ని గుర్తించి వేసినప్రణాళిక అందరికి మేలు చేస్తుంది. కాని అందరు సమానమని వేసే ప్రణాళిక (అసలప్పుడు ప్రణాళిక అనేదే ఉండదు. ప్రతివాడు తాను పైకిపోవాలని కోరుతూ సామాన్యుడు *MLA*, తరువాత మంత్రి) అది తన కొడుకులకు రావలెనని పథకం వేస్తూ అంతా సమానమని, వంశపారంపర్యంగా రాకూడదని వాగే ఈ మూర్ఖులను ఏమనాలి ?

—o—

## ధర్మశాస్త్ర గ్రంథాలు

ఇప్పుడు పుస్తకాల ధరలు విపరీతంగా పెరిగి సామాన్యులకు అందుబాటులో లేకుండ పోతున్నవి. చౌకబారు నవలలు, కథలు వస్తున్నవి కాని, మంచివి ముఖ్యంగా ధర్మశాస్త్రగ్రంథాలు దొరకడంలేదు. ధర్మం చెప్పేవారుకూడ కరువౌతున్నారు. వాని ముద్రణ గిట్టుబాటు కానందున ఎవరును వాటి ముద్రణకు పూనుకోవడం లేదు. ప్రాతపుస్తకాలు శిథిలాలై, అవి లైబ్రరీలలో కూడ దొరకడం లేదు. **T.D.P.** మొదలుగు దేవస్థానాలు వానిని ముద్రించి చౌకగా అమ్మవచ్చు. అయితే అవి మన దౌర్భాగ్యవశాన మన ధర్మమునందు ప్రమాణంలేనివారి అధికారంలో ఉన్నవి. పీఠాలు కూడ ఇందులో ఏమీ చేయలేకుండ ఉన్నవి. సనాతన ధర్మాభిమానులైన ధనవంతులిందుకు పూనుకోవాలి. లేకపోతే ధర్మజ్ఞానమే నశిస్తుంది. దీనికొక సంఘమేర్పడి ఇదిసాగించాలి.

## అంతా కలిసి ఉండడం నేర్చుకోవాలి

మీరు మనమంతా ఒక కుటుంబమని, అంతా కలిసి ఉండవలెనని అంటారు. ఇందులో భిన్న భిన్నజాతులవారు, ఆచారాలు, సంస్కృతులు వేరువేరు ఆశయాలు కలవారు ఉన్నారు. పైగా ఒక కుటుంబములోని అన్నదమ్ములలోనే తల్లిదండ్రులు అంతా కలిసి ఉండవలెనని కోరుతారేమోగాని పుల్లలు పెట్టేవాండ్లు, విడిపొమ్మని చెప్పేవారు చాలామంది ఉంటారు. కొడుకులకు వారిభార్యలు, భార్యవైపువారు బోధిస్తారు. అసూయాపరులైన ఆడబిడ్డలు కూడ కొందరు ప్రోత్సహిస్తారు. 'నీ వెక్కువ సంపాదిస్తున్నావు. అదంతా నీతమ్ములకు, ముసలివాండ్లకు ఖర్చుపెట్టున్నావు. నీవు, నీపిల్లలు (ఇది ప్రబలాయుధం) ఏమి సుఖిస్తున్నారు ? ఇట్లా ఉంటే వాండ్లెట్లా పైకివస్తారు ? వాండ్లు బిచ్చమెత్తుకోవలసివస్తుంది. బైట ఉంటే మనం సహాయం మానవలసిన పని లేదు. ఎంతైనా సహాయం చేయవచ్చు (ఇది మొదటిమాటేకాని తరువాత గిల్లి మన్నైనా పెట్టరు) ఉభయతారకంగా ఉంటుంది' అని బోధిస్తారు. తక్కినవారిని ప్రేమ, ఆదరము, గౌరవము లేకుండ చూస్తారు. తమ్ముల భార్యలుకూడ, తక్కువ సంపాదన కలవారు కూడ, 'మన కిక్కడ కొంచెం కూడ గౌరవం లేదు. ప్రేమలేదు. ఆదరణ లేదు. ఈసడించుకుంటూ ఉంటారు. ఏడుస్తూ పెడ్తారు. వేరుగాఉంటే మనకున్న కలో గంజో తిని సుఖంగా, తృప్తిగా ఉండవచ్చు. ఖర్చులు తగ్గించుకొని, డబ్బు నిల్వచేసుకోవచ్చు. ఇతరులకు గూడ మనచేతనైన సహాయం చేయవచ్చు. మీ నాన్న, అమ్మ మన దగ్గరనే ఉండవచ్చు'. అని చెప్తారు. అన్నీ సబబుగానే ఉంవని భర్తలను కోవచ్చు. వేరుగా ఉండాలని కోరవచ్చు. బలవంతంగా అట్టిపెట్తే, కలతలు మనస్పర్ధలు ఎక్కువై సమిష్టికుటుంబం నరకమౌతుంది కాని సుఖమిచ్చేది కాదు. తల్లిదండ్రులైనా, వారున్నంతవరకు ఆపగలరే కాని వారి తర్వాత ఆపలేరు. కొంతకాలానికైనా విడిపోక తప్పదు. బొత్తిగా సంపాదన లేనివారు, సంపాదింపలేనివారు, అంగహీనులు, వ్యాధిగ్రస్తులు, ముసలివారు సమిష్టిజీవనం కోరవచ్చుగాని ఇతరులు కోరరు.

అందరికీ ధర్మబుద్ధి (త్యాగబుద్ధి, పరోపకారబుద్ధి) ఉంటే అది చక్కగా నడుస్తుందికాని లేకపోతే ఇది నడవదు. కోడండ్లందరు అటువంటి సంప్రదాయ కుటుంబంలోని వారైతేనే ధర్మబుద్ధి ఉంటేనే ఇది సాగుతుంది. తల్లిదండ్రు లంటే గౌరవ ముంటేనే, అత్తమామలంటే గౌరవము, ఆదరము, ప్రేమ ఉంటేనే అది చక్కగా సాగేది. అందుకనే మంచి సంప్రదాయంగల కుటుంబాలలోనుంచి వధూవరులను ఎన్నుకోమన్నారు. గుణానికి ప్రాధాన్యమివ్వ మన్నారు. ఇప్పుడు కట్నాలు,

రూపం, ధనం, చదువు, ఉద్యోగం ఇవి చూస్తున్నారు.

నిజమే. ఇవి నేను కాదనలేదు. పెద్దలు మాటిమాటికి ధర్మం చెప్పాలి. చెప్తుండాలి. మన రామాయణభారతాలు అవే చెప్తున్నవి. వాటిని పఠనపాఠనంలో పెడ్తే అటువంటి సంస్కారం పెంపొందుతుంది. విద్య మారింది. సిలబసులు మారినై. ధర్మధ్వంసకులైన నాయకులు తమ చరిత్రలను పాఠ్యగ్రంథాలలో చేరుస్తున్నారు. ప్రస్తుతం వీరు చెప్పేవి 'అందఱు సమానమని- భేదాలులేవని, భేదాలు పోవాలని, పరస్పర విరుద్ధమైన వాక్యాలు' మన పూర్వులుకూడ చెప్పారని పిల్లలపాఠాలలో చేరుస్తున్నారు. ముఖ్యంగా వివేకానందస్వామి వగైరా లిట్లా చెప్పారంటున్నారు. బుద్ధుడు, అంబేద్కరు వగైరాలు మహాత్ములని వాండ్లకు బ్రహ్మరథం పడ్తున్నారు కాని, అసలు ధర్మం చెప్పిన వ్యాసవాల్మీకులు శంకరాచార్యులు వగైరాలను స్మరించడమే లేదు. రామాయణ భారతాలను కూడ వారి బోధలకు వీలుగా మార్చి ప్రదర్శిస్తున్నారు. శంకరాచార్యుల చరిత్రను కూడ మార్చి వ్రాస్తున్నారు. టి. వి. లో, సినిమాలలో చూపుతున్నారు. శైశవం నుంచి ఇవి వినే, చూచే బాలబాలికలమనస్సులు వాటి ప్రభావానికి లోనై, అవే రైటని అనుకోవడంలో ఆశ్చర్యం లేదు. అయితే ధర్మపరులు, అందఱి మేలు కోరేవారేమి చేయా లంటావు ? ఈ బోధ మానవలెనా ? ఇవి ఆచరణలో తాను పెట్టడం మానవలెనా ?

తల్లి దండ్రు లున్నంతవఱకైనా కలిసి ఉండి, అందఱు సమిష్టిగా త్యాగబుద్ధిలో జీవించడం నేర్చుకుంటే, అది పల్లెలో తక్కిన కులాలవారితో, దేశంలో మొత్తం ప్రపంచంలో కలిసి సుఖంగా ఉండడం నేర్పుతుంది. సర్దుకోవడం నేర్పుతుంది. త్యాగనిలయమైన సమిష్టికుటుంబం ఎప్పుడుపోయి స్వార్థపూరితమైన వేఱుకుటుంబ జీవనాలు వచ్చినవో దానితో దేశంలో ప్రపంచంలో శాంతి చచ్చింది ప్రపంచంలో శాంతి రావలెనంటే తిరిగి మన ధర్మము, సమిష్టికుటుంబము రావాలి. అప్పుడే ప్రపంచమంతా ఒకే కుటుంబమని వస్తుంది.

—o—

చందావివరములు :— శాశ్వతచందాదారులు (ఒకేసారి) రు. 250/- రాజపోషకులు సం॥ 100 రు.; పోషకులు 50 రు.; దాతలు 25 రు.; అభిమానులు 16 రు. సాధారణచందా 12 రు.; విడిప్రతి 1 రు. (శాంపిల్ ప్రతికి) తపాలాబిళ్లలు పంపవలెను. అడ్రసుమార్పు దయచేసి తెలియజేయండి-చందాధనం నా పేరునకే (రామానందభారతీస్వామి) MO. MT డ్రాఫ్టులు పంపగలరు. ఊరక సంపాదకు లనికాదు. ఆ విధంగా అక్కౌంటులేదు. • • దయచేసి పిన్‌కోడ్ ఉపయోగించవలెను.

## నకిలీ హిందువుల కసరత్తులు

అసలు హిందువులంటే యెవరు? బైబిలు, కొరానులను నమ్మేవారిని క్రైస్తవులు, ముస్లిములు అన్నట్లు వీరికేమైనా ప్రమాణ గ్రంథా లున్నవా? వారికి సనాతనములైన శ్రుతిస్మృతు లున్నవి. వాటిని నమ్మేవారిని అసలు హిందువులని, నమ్మకుండా మేము హిందువులమనే వారిని నకిలీ హిందువులని అనాలి. అయితే శ్రుతిస్మృతులను ఒప్పుకొనేవారిలో ద్వైతాద్వైతవిశిష్టాద్వైతాది శాఖాభేదా లున్నవి. వాటికి వేరే వేరే అర్థాలు చెప్తారు. ఇందులో ఏది రైటు అంటే తర్కాన్నే ఉపయోగించారు. అంటే మతధర్మాన్ని కూడ చర్చావేదిక మీదికి తీసుకవచ్చిన ఘనత ఈ అసలు, సనాతన హిందువులకే దక్కింది.

నకిలీ హిందువులలో రెండువర్గాలున్నవి. ఒకటి గాంధీ నెహ్రూ వగైరా అనుయాయులు మన ప్రస్తుత V.P. సింగ్ వగైరా ప్రచ్ఛన్న క్రైస్తవులు నాయకులు. వీరందఱు తాము సెక్యులరిస్టుల మంటారు జనాభా లెక్కలలో మేము హిందువుల మంటారేమో బయట మాకన్నిమతాలు సమానము. అని ఒకటే చెప్త వంటారు. ఈశ్వర్ అల్లా తేరేనామ్ అని పాట పాడ్తారు. హిందువులము అని చెప్పుకోవటానికి సిగ్గు పడ్తారు. కాని కొందఱు గుళ్ళకువెళ్తారు. తిరుపతి వగైరాలకు వెళ్ళి గుండుకొట్టిస్తారు.

రెండవవర్గం V,H.P., B,J.P., R.S.S, వగైరాలు వీరు మేము హిందువుల మంటారు. హిందూమతం అపాయంలో పడ్డదని, మేము దానిని ఉద్ధరిస్తామంటారు.

రెండువర్గాలు శ్రుతిస్మృతులను ఒప్పుకోరు. అస లవి ఏమి చెప్పినవో వీరు చూడరు. చూచిన వారు చెప్పిన మాటలు వినరు.

మొదటివర్గం అన్నిభేదాలు కులమతజాతివర్గ భేదాలు పోయి ఒక్కజాతి ఏర్పడా లంటారు. ఒక్కభాష, ఒక్కమతము, ఒక్కజాతి ఉంటే గాని శాంతిసౌఖ్యా లుండవంటారు.

రెండవవర్గం కూడ కులభేదాలు పోవాలంటారు. మతభేదా లుండా లంటారు. ఉభయులకు ధ్యేయం పాలనాధికారం. ప్రజలవోట్లు అవి సంపాదించడానికి ఎత్తులు, మాయలు. వీరెవ్వరికి అసలు హిందువుల ప్రధాన ధర్మము వర్ణాశ్రమవ్యవస్థ అని తెలియదు. ధర్మము—అంటే తన మేలేకాక ఇతరులమేలుకూడ చూడడం—ఈ ధర్మం ఒక్క హిందూమతమే చెప్పింది అని తెలియదు. అంటే సర్వమత సహనం (అన్ని మతాలు రైటని,ఒకటే చెప్త వనికాదు)—నిజమైన సెక్యులరిజం—ఇతరులను హింసించకుండ ఎవరిమానాన వారిని ఉండనీయడం; నిజమైన 'వైవిధ్యంలో ఏకత్వం'-

*Unity in diver-sity*, ఇదిన్నీ 'పనులు పంచుకొని అందఱు కలిసిమెలిసి అందఱి మేలు కోసం పనిచేయడం'—తాను ఈ శరీరం కాదని, నిత్యుడైన జీవుడనని శాశ్వతమైన మేలు చూచుకోవడం ముఖ్యమని ఈమూడు ప్రధాన హిందూమత ధర్మాలని ఈ వకిలీ హిందువులకు తెలియదు.

అందులో మొదటివర్గం చెప్పేది తీసుకొందాం. కులమతభేదాలు సర్వానర్థ కారణాలని వాటిని నిర్మూలనం చేస్తే స్వర్గం భూమిమీదనే సిద్ధిస్తుందంటారు. పోరాటాలకు అసలుకారణం రాగద్వేషాలని, స్వార్థమని వీరికి తెలియదు. అభిప్రాయభేదాలు సహజమనిన్నీ, ఇద్దరెప్పుడూ—భార్యాభర్తలు, అన్నదమ్ములు, తండ్రీకొడుకులు, అక్కచెల్లెండ్లు, తల్లికూతుళ్లు కూడ పూర్తిగా ఏకీభవించరని, కుమ్ములాడుకుంటారని వీరు చూడరు. కౌరవపాండవులు పోట్లాడుకొన్నారు. విభీషణుడు అన్నలతో పోట్లాడాడు. వాలిసుగ్రీవులు యుద్ధాలు చేశారు. ఔరంగజేబు తండ్రిని జైలులో పెట్టి అన్నలను చంపాడు. హిట్లరు, స్టాలిన్, మావో వగైరాలు తమజాతి మతాలవారినే అనేక లక్షలను తమతో భేదించినవారిని ఊచకోత కోశారు. ముస్లిములు కూడ తమలో తాము యుద్ధాలు చేశారు. చేస్తున్నారు. సిక్కులు అంతే. కాబట్టి ఒకజాతి, ఒకమతము, ఒక భాష ఐకమత్యాన్ని తీసుకరావు.

ఈ సెక్యులరిస్టులకు మతం ప్రాముఖ్యం తెలియదు, మతాలలో ఉండే సమానధర్మాలను తీసుకొని అన్నిమతాలు ఒకటే చెప్తున్నవి కాబట్టి సమానము. ఒకటేనని అంటారు. అవి చెప్పే భేదాలు వీరికి కనబడవు. 513, 413, 1013, 315 లలో 1, 3 అంకెలు సమానం కాబట్టి అన్నీ ఒకటే, సమానం అంటారు వీరు. వీండ్లకసలు మతమే లేదు గనుక దాని ప్రాముఖ్యం తెలియదు. అన్ని మతాలు సమానంగా కనబడ్తవి.

మతం చెప్పేది తన నిత్యసౌఖ్యం. తాత్కాలికమైన ఈ ఒక్కజన్మలోని సౌఖ్యం స్వల్పకాల సౌఖ్యంకాదు. నిత్యసౌఖ్యం వదలుకొని స్వల్పకాల సౌఖ్యం కోరేవాడు మూఢుడు చచ్చినతరువాతకూడ నిత్యంగా సుఖంగా ఉండే మార్గం చెప్పేది మతం. అందువలన అది ఇక్కడ సదవులకంటె ముఖ్యము. నాస్తికులు, కమ్యూనిస్టులు ఇది మూఢ నమ్మకమంటారు. జీవుడు, ఆత్మ (*soul*) లేదంటారు. మనశాస్త్రాలు దీనిని విమర్శించినట్లు మరెవ్వరు విచారించలేదు. చావు తప్పించుకోవాలని ప్రతివాడు యత్నిస్తున్నాడు. ఇది విచారించేది, చచ్చినతరువాత నీవున్నావు, అని చెప్పేది మతం. దీని కారణంగానే కమ్యూనిస్టు రాజ్యాలు వందసంవత్సరాలైనా పూర్తికాకుండానే పేకమేడలలాగా కూలిపోయినవి. ఇది మన నాస్తిక కమ్యూనిస్టులకు తెలియదు. వీరు నా

స్త్రిక కమ్యూనిజంను ఉద్ధరిస్తా మంటున్నారు.

కాబట్టి మతభేదాలు నిర్మూలిస్తామనే భ్రమను మన నాయకులు వదలి, దాని నంగీకరించి దానికి మనదేశం చూపించినట్లు స్థానంచూపడం తెలివి. ఇక్కడ మొదటి నుంచి అన్నిమతాల వారుకలసిమెలసి సోదరులవలె జీవించారు. జీవిస్తున్నారు. మత సహనం హిందువుల ప్రధానసూత్రం.

ఇంక కులభేదాలు పోవాలనేవర్గం మొదటివర్గం. ఇప్పుడు వాటికి ప్రాణం పోసినదివే. కులమతాలకు అతీతంగా మనవారు వోట్లువేస్తున్నారని వీరికి తెలియదు. వీరివాదం మనుష్యులంతా సమానం భేదాలు లేవని. ప్రత్యక్షంగా అందచందాలలో శక్తి సామర్థ్యాలలో, తెలివితేటలలో భేదాలు కనబడుతున్నా అంతా సమానమనడం కంటే వేరే గ్రుడ్డితన మున్నదా ?

అన్నీ జంతువులే అయినా అందులో సింహాలు, పులులు, జింకలు, ఆవులు, మేకలు, కుక్కలు, పందులు మొదలైన వేఱు అంతర్జాతులున్నవి. జంతు ధర్మాలు సమానమైనా ప్రత్యేక అంతర్జాతి లక్షణాలను కూడ కలిగి ఉన్నవి. కొన్ని మాంసాహారులు. కొన్ని శాకాహారులు. కొన్ని సాధువులు కొన్ని హింసించేవి. ఉన్న భేదాలను అంగీకరించి తగినట్లుగా వానిని ఉపయోగించుకోవడం తెలివికాని వానిని క్రాస్‌చేసి ఒక సంకరజాతిని సృష్టించడం తెలివికాదు. అట్లే వృక్షజాతులలో అనేక భిన్నజాతు లున్నవి. చింత, వేప, మామిడి మొదలైనవి. వాని నట్లే ఉంచి వాడుకోవడం తెలివికాని, వానిని క్రాస్‌చేసి ఒక సంకరజాతిని సృజించడం తెలివికాదు. ఉపయోగకరము కాదు. మన సైంటిస్టులు పశుపక్షిజాతులను నాశనం కాకుండ వృద్ధిచేయాలంటున్నారు. దానికి ప్రభుత్వము దోహదం చేస్తున్నది. మనుష్యుల విషయంలో భేదాలు రూపుమాపాలనుకోవడం, భేదాలు లేవనడం అజ్ఞానమే ఔతుంది, జంతువులలో ఉన్నట్లే మనుష్యులలో కూడ అంతర్జాతు లున్నవి. ఒక్క బ్రాహ్మణులలోనే అనేక శాఖ లున్నవి. అంతశ్శాఖలలోకూడ భిన్నభిన్న వంశాలు గోత్రాలు ఉన్నవి. వంశాలలో కుటుంబాలు కుటుంబాలలో వ్యక్తులు. ప్రతిదానిలోను ప్రత్యేకతలున్నవి. ప్రతివ్యక్తి తన జాతి, వంశ, కుటుంబ, తన ప్రత్యేకతలు నిల్పుకొంటూ అభివృద్ధికి పోవాలి. కాబట్టి ఇప్పటి ప్రభుత్వాలు పెద్దలు, వర్ణాంతర వివాహాలద్వారా భేదాలు రూపుమాపవలెననే తెలివితక్కువ బోధ, ప్రయత్నము మానాలి. యువకులు, విద్యార్థులు ఈ సత్యాన్ని గ్రహించాలి. తాను గొప్పవాడై తనవంశ, జాతి ప్రతిష్ఠను హెచ్చించడానికి చూడాలిగాని, దానిని రూపుమాపడానికి పూనుకోగూడదు. ఇది అల్పబుద్ధులు తొలగించాలనుకోవడం పొరపాటు. బుద్ధుడు, అక్బరు, నానక్, గాంధీ వగై

రాలు దీనికై ప్రయత్నించి విఫలులైనారు. సాంకర్యం వలన క్రొత్త మిశ్రమ కులలు పుట్టినవి కాని ఉన్నవి పోలేదు. సంకరజాతి కంటె అసలు జాతి పవిత్రమనే భావం కూడ పోలేదు. సంకర ఆవులు మంచివా! శుద్ధమైన ఆవులా?

ఇంతవఱకు ఐహికంగా ఈ లోకాన్ని గుఱించే విచారించాము. శరీరము కన్న వేఱుగా జీవుడున్నాడా లేడా అని విచారించ లేదు. ఇప్పుడు సైన్సు వచ్చి మన శరీరము ఆత్మ కాదని ఋజువు చేసింది. శరీరంలో భాగాలు గుండె, చర్మము, కాలు, చేయి వగైరా చెడిపోతే బాగు చేసో, క్రొత్తవి తెచ్చి అతికో దానిని నిల్పుతున్నారు. అందువలన శరీరం కారు వంటి ఒక సాధనమని తేలింది. మన తర్క శాస్త్రము చెప్పిన ప్రాణము, తెలిసికొనుట, చేతనత్వము, జ్ఞాపకము ఆత్మ ధర్మాలని, ఆత్మ ఈ శరీరాన్ని తన కొఱకు చేసుకొంటున్నాడని, ఇది చెడిపోతే కారు డ్రైవరు కారును బాగు చేసుకొని భాగాలు చెడిపోతే తీసివేసి క్రొత్తవి వేసి నడిపినట్లు, నడుపుతున్నాడని, శరీరము కంటె వేరని ఋజువౌతున్నది. డ్రైవరెట్లా కారు కాదో ఆత్మ కూడ శరీరము కాదు. శరీరాన్ని వాహనంగా ఉపయోగించుకొనేవాడు. ఇది చెడిపోతే మఱొక శరీరం తీసుకొంటాడు. డ్రైవరు కారుకన్న వేరుగా కనబడుతున్నాడు. జీవుడు కనబడడంటే, కనబడనంత మాత్రాన వస్తువు లేదనడానికి వీలులేదు. వేడిమి, కాంతి, శక్తి, విద్యుత్తు మొదలైనవి కూడ కనబడవు. వాహనాల ద్వారా వాని ఉనికి తెలుస్తుంది. అట్లే శరీరం కన్న వేఱుగా జీవుడున్నాడు. శరీరం చచ్చిన తరువాత మిగిలి ఉన్నవాడు. అతని యోగక్షేమాలు మతాలు చెప్తవి. దానిని గుఱించి మన శ్రుతులు, స్మృతులు విచారించినట్లుగా తక్కినవి విచారించ లేదు. అది ఆయా మతాల వాని శాస్త్రాలు చదివితే తెలుస్తుంది.

ఆత్మకు అత్యున్నతమైన మోక్షం చెప్పింది ఒక్క వేదమే అందులో అద్వైతం. పాతకాలలలో వేఱు వేఱు తరగతుల వలె తక్కిన మతాలు, అభిప్రాయాలున్నవి. క్రమంగా ప్రతి జీవుడు స్వధర్మం చేసుకొంటూ పైకి పోయి మోక్షం పొందుతాడని వేదం చెప్పింది. అది కావలెననుకొనే వాడు దాని ప్రకారము ఉండాలి.

ఇది ఈ నకిలీ హిందువులకు తెలియదు. ఈ రెండు వర్గాలు హిందూమతం గొప్పతనం తెలుసుకోలేక తాము భ్రష్టులై నిజమైన హిందువులకు, అసలు ప్రజల మధ్య అంతఃకలహాలు సృష్టిస్తు వారి వోట్లు సంపాదిస్తామనే ఆశ పడ్తున్నారు. ఇది తమ మేలు కోరేవారు నమ్మ చేయాలి. హిందు ఎప్పుడు ఇతరులను ఒప్పించటానికి చూస్తారు. రెండోవవాడు హింసకు దిగితే తప్ప హింసకు దిగడు.

—o—

# ఆంధ్రభాషా ప్రాశస్త్యము

ఆంధ్రరాష్ట్రావతరణ దినోత్సవ సందర్భముగా.(1-11-1990) ఇది వ్రాస్తున్నాము.

సర్వభాషలకు తల్లి సంస్కృతము-అది అమరభాష అనికూడ చెప్పబడింది. ఒక కవి—

దేవతలభాష కావునఁ దెనుఁగుకన్న
సంస్కృతమె మిన్నయని యంద్రు: సరియె, తెలిసె
రసికుఁ డగువాఁడు తనదు జాజు సిగలోన
తులసినే యిడుకొనునో? జాజులనె యిడునో?

అన్నాడు. రసవంతమైన రసికులు మెచ్చిన, అనేక రసవత్కావ్యములు గల భాష తెనుగు.

తత్త్వము చాల విచిత్రమయింది. మనలో చాలా విచిత్రములైన కోరికలు ఆలోచనలు ఉన్నవి. పరస్పర విరుద్ధమైనవి. ప్రతివ్యక్తి ఏది వదులుకోవడానికి ఇష్టపడడు. అన్నీ కావాలంటాడు. ఒక ప్రక్కన భేదాలన్ని పోయి అంతా ఒకటికావాలంటాడు. 'ఏకమేనా ద్వితీయం బ్రహ్మ' అన్నాంకదా! మళ్లీ ఎవరి ప్రత్యేకత వారిదే. తన దేశము, రాష్ట్రము, మతము, జాతి, అంతర్జాతి, శాఖ, కులము, గోత్రము, వంశము, కుటుంబము, వ్యక్తి తన ప్రత్యేకతలో గొప్ప ఉందంటాడు. అది పోగూడదు ఉండాలంటాడు. వైవిధ్యం పోవాలనడం కూడ తెలివితక్కువే. అది లేకపోతే సొగసేమున్నది? అదే ఐశ్వర్యం. అన్నీ సుఖంగా అనుభవించడం. కాబట్టి తెనుగు గొప్పతనం ఇప్పుడు చెప్పడం అప్రస్తుతం కాదు.

మన తెనుగుభాష అత్యద్భుతమైన భాష. దేవభాష అయిన సంస్కృతమును గూడ ఇది మించిందనవచ్చు. తక్కిన ఏ యితర భాషలలో లేని సొగసులు సంస్కృతములో సైతము లేనివి ఇందులో ఉన్న

వి. తక్కిన భాషలలో శ్లేష, రెండర్థాలు వచ్చేటట్లుగా రచనలు అతి పరిమితము—అది ఒక వాక్యాని కుండవచ్చు,. ఇక్కడ అటువంటివి బహు కావ్యాలున్నవి. ఇది ప్రారంభించిన కవి పింగళిసూరన. ఆయన రాఘవ పాండవీయ కావ్యములో ప్రతి పద్యానికి రామాయణార్థము, భారతార్థము ఉన్నవి. దానిని భట్టుమూర్తి హరిశ్చంద్ర నలోపాఖ్యానంలో అనుకరించాడు. ఇంకా ఇట్లాటి రచనలున్నవి. రెండర్థాలు గల ద్వ్యర్థి కావ్యమే కష్టమనుకుంటే ఒక్కొక్క పద్యానికి మూడర్థాలు కల యాదవరాఘవ పాండవీయమని భాగవత రామాయణభారతి అర్థాలతో త్ర్యర్థి కావ్యం వ్రాసిన వారున్నారు. సూరన ఒక కందపద్యం ఒకవిధంగా చదివితే తెనుగు, త్రిప్పి తల్లక్రిందులుగా చదివితే సంస్కృతం అయ్యేటట్లు వ్రాశాడు. ఆయన ప్రతిరచన క్రొత్త సొగసులు చూపింది. కళాపూర్ణోదయములో ఆయన కవి బ్రహ్మ (తిక్కన) ను గూడ కల్పనలో మించినాడా అని శ్రీ కట్టమంచి రామలింగారెడ్డి గారు ప్రశంసించారు. అది పద్యకావ్యంగా వ్రాసిన ఒకనవల. అందులో చతుర్ముఖ పాత్రభావన ఏ సాహిత్యంలో కూడ లేని అపూర్వ చిత్రణ. వేదాంతాలు అభ్యుదయమని నిశ్శ్రేయసమని రెండుగమ్యాలు చెప్పినవి. ఒకటి ఆనందములో వేలు వేలు దశలు తారతమ్యాలు కలది—సార్వభౌమ జన్మ, మనుష్య గంధర్వులు, దేవగంధర్వులు వగైరా ఒక్కొక్కటి పందరెట్లెక్కువైనది. వీని అన్నిటిలోకి పెద్దది సృష్టికర్త బ్రహ్మజన్మ. హనుమంతుడికి సైతము నోరూరజేసిన జన్మ. ఈ ఆనందాలన్నిటికి పరాకాష్ఠ—(highest). అంతకు మించింది లేదు. దాన్నిమించింది నిశ్శ్రేయసంలో నిర్గుణ బ్రహ్మము. పరమేశ్వరత్వమే—

అభ్యుదయములలో పరమోత్కృష్టమైన సృష్టికర్త బ్రహ్మ ఆనందము ఒక్క సూరనమాత్రమే సరిగా ఊహించాడు. అల్లసాని పెద్దన లాంటివారు కూడ 50 సంవత్సరాల వయస్సు కల బ్రహ్మను ముదిమది తప్పిన తాతను చేశారు. దేవతలుకూడ త్రిదశులు (30 ఏండ్ల వారు) అని మఱచిపోయి. కామం పురుషార్థంగా చెప్పినది మన శాస్త్రమే.

కామమంటె భార్యాభోగమే, శృంగారమే. మన పరమేశ్వరులుకూడ భార్యలు కలవారే. వాణీహిరణ్యగర్భుల శృంగారము సూరనభావించింది. ఇంకే కవి కూడ ఊహించ లేదు. బ్రహ్మభావన వాణిని సంతోషపెట్టేదే కాక సృష్టికి గూడ కారణం కావాలి, భార్యను రంజింపజేయడానికి ఆయన చెప్పిన కథకు సత్యమైన సృష్టి వచ్చింది. ఆగ్రంథం విన్న ఫలం కూడ అసదృశంగా ఆకథలోనే సూరన చెప్పాడు. ఆయన ప్రభావతీ ప్రద్యుమ్నం కూడ అట్లే ఉంటుంది.

బంధకవిత్వాలు సంస్కృతం తెనుగు రెంటిలోను ఉన్నవి. ఇవే గొప్ప అనుకుంటే మామిత్రుడు, సహాధ్యాయి, రావిపాటి లక్ష్మీనారాయణ గర్భ కవిత్వంలో క్రొత్త త్రోవ చూపాడు,

ఒక పద్యంలోపల మఱొకపద్యం, వృత్తం ఇమిడ్చివ్రాయడం గర్భకవిత్వం. సీసపద్యంలో, వృత్తాలలో ఇతర వృత్తాలు, గీతులు వగైరా, అసలు కావ్యం ఒకటైతే గర్భంలోని పద్యాలు వేరైతే అది మఱొక కావ్యం. రామాయణభారతాలు రెండు వేఱు వేఱు కావ్యాలు. ఒక కావ్యంలో రెండోది ఇమిడేటట్లుగా భారతగర్భరామాయణం వ్రాయడం మఱొక నూతనసృష్టి అతను చేశాడు. అది విద్వాన్‌ను కాబోలు పాఠ్యగ్రంథంగా కూడ వచ్చిందని విన్నాను. ఇవి తక్కినభాషలలో లేని విశేషాలు. ఆదికవి నన్నయభట్టు సంస్కృతంలో లేని ప్రాసాన్ని చేర్చి తెనుగు కవిత్వానికి క్రొత్త అందం కల్పించాడు. అలంకారాలలో; పదాలు కూర్చడంలో వైచిత్ర్యాలు భట్టుమూర్తి వగైరాలు చాలామంది చూపారు. సూరన నంది తిమ్మనలు రెండు అక్షరాలలోనే పద్యమంతా వ్రాశారు.

సంస్కృతభాష ఒక పెన్నిధి. అందులో ఉన్న ఆత్మవిద్య మరే భాషలోను లేదు. ఆత్మవిద్యయే విద్య. తక్కినదంతా అవిద్య. ఆత్మవిద్య కావలెననుకొన్నవాడు సంస్కృతం చదివితీరాలి. భారతం పంచమ వేదం. భాగవతం పురాణరాజం. అవి తెనుగులో మూలంలోని సొగసులు పోనీకుండ క్రొత్త సొగసులు సంతరించుకొన్నవి. కవిత్రయం

పంచమవేదాన్ని అందిస్తే పోతన భాగవతాన్ని అందించాడు. ఇవి సంస్కృతానికే మెఱుగుపెట్టిన గ్రంథాలు. మరేభాషలోను ఇట్టివి లేవు. వీరు వ్యాసుని కూడ మించారనవచ్చును. ఎంతమంది రామాయణాలు వ్రాసిన వాల్మీకానికున్న పేరును తెనుగులో ఎవరున్ను మించలేదనే అనాలి. కల్పవృక్షం కూడ అంతే. ఇంతవఱకు భాస్కర రామాయణమే ప్రశస్తంగా ఉన్నది. రామాయణంలోని సొగసులు శ్రీ పోలూరి హనుమజ్జానకీరామశర్మ వ్రాసిన సప్త భాగములు కల రామాయణ తరంగిణి చెప్పినట్లుగా మరేదీన్నీ చెప్పలేదు. వారు కూడ వాల్మీకాన్ని అంగ్రీకరించారు. అయితే అది వెలుగును చూడాలి.

ఈ విధంగా సంస్కృతములోని ప్రముఖ రచనలు, చాలా పురాణాలు గద్యపద్యాత్మకంగా తెలుగులోకి వచ్చినవి. ఈ విధంగా ఇంకో భారతీయభాషలోకి ఇన్ని రాలేదు. హిందీలోకిగూడ.

తెనుగుభాషలో మరొక సొగసు తక్కినభాషలలో లేనిది, ఉత్తమపురుష బహువచనంలో రెండు అర్థాలకు ప్రత్యేకరూపాలు. మేము, మనము ఉండడం. అందులో మనం రెండవదే ఎక్కువగా వాడుతాం, మేము అని వేఱుచేయం. మనమంతా ఒకటి అని స్పష్టంగా చెప్పడం ఒక్క తెనుగుకే తెలుసు. ఏకమే వాద్వితీయం బ్రహ్మ అనేది సరిగా చిత్రించేది మన ఉత్తమపురుష. ప్రథమపురుష (III person) లో కూడ అంతస్థులకు తగిన వేఱుపదాలు వాడు, అతడు, ఆయన. ఇవి ఏ భాషలో ఉన్నవి? ఆంధ్రంలో స్త్రీలకు గూడ తక్కిన భాషలలో లేని విశేషము ఉన్నది. తక్కినభాషలలో (హిందీతప్ప) క్రియలకు పుం, స్త్రీ నపుంసక లింగాలలో ఒకేరూపాలున్నవి. సంస్కృతంలో కూడ అంతే. సః భవతి, సా భవతి, తద్భవతి. తెనుగులో ఏకవచనములో స్త్రీ నపుంసక తుల్యము, బహువచనములో పుంలింగతుల్యము–

ఆమె వచ్చినది, అది వచ్చినది. వాడు వచ్చినాడు. వారు (పురుషులు స్త్రీలు) వచ్చినారు, అవివచ్చినవి.

తద్ధర్మ వర్తమానకాలాలలో సర్వనామాల చివర అక్షరాలే క్రియల చివర అక్షరాలుగా వస్తవి.

నేను వత్తును, నేను వచ్చెదను. మేము (మనము) వత్తుము. వచ్చెదము. నీవు వత్తువు, వచ్చెదవు. మీరు వత్తురు, వచ్చెదరు.— ప్రథమ పురుషలో మార్పు. అతడు, ఆమె, అది వచ్చును. వారు వత్తురు, వచ్చెదరు. అవి వచ్చును. కాని వాడుకభాషలో వాడు వస్తాడు. (ఆమె) అది వస్తుంది. వారు (పురుషులు, స్త్రీలు) వస్తారు. అవి వస్తవి. ఈ వైచిత్ర్యము మరే భాషలో ఉన్నది? వాడుకభాషలో ఇది అన్నికాలాలలోను ఉన్నది. వర్తమాన కాలము—నేను వచ్చుచున్నాను, మేము వచ్చుచున్నాము. నీవు వచ్చుచున్నావు, మీరు వచ్చుచున్నారు. వాడు వచ్చుచున్నాడు, (ఆమె) అది వచ్చుచున్నది. వారు (పురుషులు, స్త్రీలు) వచ్చుచున్నారు. అవి వచ్చుచున్నవి. భూతకాలము—నేను వచ్చాను, మేము వచ్చాము. సీవు వచ్చావు, మీరు వచ్చారు. అతడు వచ్చాడు, (ఆమె) అది వచ్చింది, వారు వచ్చారు, అవి వచ్చినవి.

భవిష్యత్కాలము వాడుక—నేను వస్తాను, మేము వస్తాము. నీవు వస్తావు, మీరు వస్తారు. అతడు వస్తాడు, (ఆమె) అది వస్తుంది, వారు వస్తారు, అవి వస్తవి,

వ్యాకరణ పరిభాషలో తెనుగులో భవిష్యత్కాలములో 'గల' సహాయక్రియ వస్తుంది. నేను రాగలను, మేము రాగలము. నీవు రాగలవు, మీరు రాగలరు. అతడు రాగలడు, (ఆమె) అది రాగలదు, వారు రాగలరు, అవి రాగలవు.

ఈ వైచిత్ర్యము మరే భాషలోనైనా ఉన్నదా? నాకు తెలిసినంతవరకు లేదు. ఇట్టి వైచిత్ర్యాలింకా ఆలోచిస్తే తేలవచ్చు.

సంస్కృతానికి తెనుగుకు ఉన్న సన్నిహిత తత్వము ఇతర భారతీయ భాషలకు లేదేమో! నామములలో విభక్తి ప్రత్యయాలు చేరి

స్త్రే సరి తెనుగు లౌతవి. ధాతువులలో కూడ ఇంచు ప్రత్యయముతో చాలా సంస్కృతధాతువులు తెనుగులోకి దిగుమతిఐనవి. వస్–వసించు వచ్–వచించు, వద్–వదించు అనము కాని ఉపసర్గలతో అనువదించు వగైరా రూపాలు వస్తవి. ఆత్మనేపది–తనకొఱకే చేసుకొను క్రియల లో వండును, వండుకొనును. చూచును, చూచుకొనును. కొను ప్రత్యయముతో ఏర్పడుతవి. అవే ఉపసర్గలు, అర్థాలు. వాగనుశాసనుల భాష ముప్పాతిక సంస్కృతమే. తిక్కన సగానికి పైగా తెనుగు వాడారు.

తెనుగులిపి– అక్షరాలు, వర్ణాలు కూడ పుష్టిని కల్గి గుండ్రంగా ఉంటవి. అక్షరాల సంఖ్యకూడ తక్కిన భాషల కన్న సంస్కృతముకన్న ఎక్కువ. సంస్కృతంలోని అన్ని అక్షరాలు స్వీకరించాం. అందులో లేనివి కొన్ని కలిపాము, ఎ, ఒ, అరసున్న, ఱ లు ళ ఒక ప్రత్యేకత సంతరించుకొన్నది. మంగలం, మంగళం రెండు వేఱు.

ఆ మధ్య సినిమా బహుమానాలు పంచే సందర్భంలో ఒక నటుడు కొన్ని ప్రత్యేకతలు చెప్పాడు. మన అక్షరాలకు తలకట్లు రైటు గుర్తులన్నాడు, కొన్నిటి కిపి లేవు. భ కున్నది. బ కు లేదు. దానికి కూడ అది అలంకరించడం మంచిది. చ, డ, ద, ప, బ లకు ఛ, ఢ, ధ, ఫ, భ లు ఒత్తక్షరాలౌతవి. జ, ట ల కత్లే తేలికగా చేయవచ్చు. క, గ, త, లకా సౌకర్యము లేదు. థ, ధ లు కొంచెం తికమకపెడ్తవి.

ఒక ధ్వనికి ఒకే వర్ణము అనేది సంస్కృతంలో మాత్రమే సరిపోతుంది. తక్కిన భాషలలో కుదరదు. దీనికి కారణము సంస్కృతము పండితులు వాడే భాష. పామరులు వాడరు. వాడుకభాష వేఱుగా కలవాటన్నిటిలో ప్రతిధ్వనికి వర్ణాలు (అక్షరాలు) లేవు. ఇంగ్లీషుభాషలో అనేకధ్వనులకు ఒక వర్ణము ఒకే ధ్వనికి అనేక వర్ణములు ఉన్నవి. ఇది ఇంగ్లీషుబాషలో ప్రస్ఫుటంగా కనబడుతుంది. C క్, శ్, స్ లకు వాడుతారు. G జ్, గ్ లకు. Q కు ప్రత్యేకధ్వని లేదు. Uలో

కలిస్తే క్వ పలుకుతుంది. **Unique** లో అది క్ మాత్రమే ఔతుంది. ఇంక అచ్చులు **A, E, I, O, U** లు అనేకములైన ఉచ్చారణలను (ధ్వనులను) కలిగి ఉన్నవి. **I** అనేది **PIN, GIRL, SIR, PINE,** వేలు వేలు ఉచ్చారణలను కలిగి ఉన్నది. **U** ఇంకా ఎక్కువ–**CUP, PUT, BUSY, BURY, USE** లలో ఒకేవిధంగా పలకవు. **Silent letters–walk** లో **l, one** లో **e** ఇట్టివి చాలా ఉన్నవి. అందుకనే ఇంగ్లీషు భాషలో వ్రాయడం **spelling,** చదవడం–అతి క్లిష్టమయింది.

తెనుగులో ఒకధ్వనికి ఒకే వర్ణము అంటాము. అయితే చ, జ లకు రెండువిధములైన ఉచ్చారణ–సంస్కృత, తత్సమములలో చ తాలవ్యము–చరణము, చారు, కాని అచ్చ తెనుగు, తద్భవములలో దాని మీద అ, ఆ, ఉ, ఊ, ఒ, ఓ, ఔ లు చేరినప్పుడు అది దంత్యమౌతుంది, చప్పుడు, చాప, చుక్క, చూరు, చోటు, చౌక. దీనికి కొంత కాలము పైన తావత్తు చేర్చారు. ౘ, ౙ. వెనుక ముద్రింపబడిన పుస్తకాలలో ఇది కనబడుతుంది. ముద్రణ కష్టమని ఇటీవల దానిని మానినట్లున్నారు. అందువలన పండితులనే వారుకూడ వీనిని తప్పుగా ఉచ్చరిస్తున్నారు.

ఇంగ్లీషులో తఱచుగా సంస్కృతము తెనుగులలో లేని మరొక అచ్చు ఉన్నది. **CAP, MAN, BANK** మొదలైన వానిలో **A** ఉచ్చారణ. అందువలన వీనిని తెలుగులో వ్రాయడానికి చాలా బాధ కల్గుతున్నది. **Bank** ను బేంక్ అని బ్యాంక్ అని వ్రాస్తున్నారు. సంస్కృతము తెనుగులలో ఇది బొత్తిగా లేదన వీలులేదు, య, శ, చ, జ లలో ఇది ఉన్నది. సంస్కృతములో ఇది వేఱుగా లేదనవచ్చు. కాని తెనుగులో చాలాచోట్ల ఇదివాడుతునే ఉన్నాము. గ్రాంథికంగా కూడ సంధిలో ఇది వస్తుంది. తాడి+ఆకు=తాటి+ఆకు=తాటాకు. ఇక్కడ టా ఉచ్చారణ ఇంగ్లీషులో **tank** టా **ta** ఉచ్చారణ. తెనుగులో వాడుకభాషలో ఇది తఱచుగా మనము వాడుతున్నాము. వెళ్లాడు,

దాటాడు, చెప్పారు. వగైరా. ఇది తెలియక రేడియోలో ఒక మహానుభావుడు కర్ణకఠోరంగా చెప్పారు అనే దానిని చెప్పారు—పాగు మామూలు ఆతో చేర్చి వార్తలు చెప్తాడు. (రేడియో నిర్వాహకులు చిత్రవిచిత్రములైన ఉచ్చారణలను ప్రదర్శిస్తుంటారు. మంచివారు దొరకరో, అదివారినీతో—ఇవ్వాడు ప్రభుత్వంనీతి అదే కదా. అనర్హులకు ఉద్యోగాలివ్వడం—పీండ్లుకోరడం—వాండ్లివ్వడం—అర్హత చూడము అనడం మన సమర్థమైన ప్రభుత్వం యొక్క ముఖ్యమైన పాలిసీ. వీండ్లు ఆత్మగౌరవం (**self respect**) కలవారు!)

ఇటువంటి వైచిత్ర్యాలు ప్రస్తుతం **B.A.** మొదటిసంవత్సరం తెనుగుకు పాఠ్యగ్రంథంగా **Open University** నిర్ణయించిన వాడుక భాష వ్యాకరణప్రకరణంలో చాలా ఉన్నవి.

కృష్ణదేవరాయుల ఆస్థానంలోకి ఒక కవి నేను ఉచ్చారణకు సరిగా తప్పులు లేకుండా (**correct**గా) వ్రాయగలను. నన్నోడించే వాడే లేడని సవాల్ చేశాడు. అందరు తెల్లమొగాలు వేసే తెనాలిరామలింగకవి మాతి చాలా వంకరగా త్రిప్పి ఉచ్చరిస్తూ—

త్రువ్వట బాబా, తలపై పువ్వట జాబిల్లి....

అని చదివాడట—అది త్రు, త్పు వగైరాలలో ఏదో తేల్చలేక ఆ కవి తికమకపడి ఓటమి అంగీకరించాడట. అష్టదిగ్గజాలకు దిక్కుతోచలేదు. తాటాకు, వెల్లాకు, **Bank** వ్రాయమంటే సరిపొయ్యేది. ఈ విధంగా మనభాషలో లేని అక్షరాలు వెదకితే చాలా దొరుకుతవి. ఇంగ్లీషులో **f** ఒకటి. దీనికి సమానంగా మన ఫ వాడ్తారు. కాని అది తప్పు. సంస్కృతంలోని ఉపధ్మానీయంలో అది ఉన్నదని శ్రీ ప. ప ద్వితీయ విమలానంద భారతీస్వాములవారు చెప్పారు, వ్రాశారు.

ఈవిధంగా వెళ్తే వర్ణమాలలోని అక్షరాలసంఖ్య ఇంకా పెరుగుతుంది. అయినా ఈ **MAN** లోని అచ్చుకు ఒకమార్గంపైన చుక్క గీతో అ, ఆ లకు తగిలించడం అవసరమనిపిస్తోంది. క్రొత్త వర్ణం సృష్టించక పోయినా. అయితే అది ముద్రణ ఇబ్బంది ఔతుంది.

గుణింతము–హల్లులకు అచ్చులు చేర్చినప్పుడు వచ్చే గుర్తులు అ, ఆ, ఇ, ఈ, ఉ, ఊ, ఋ ౠ, ఌ, ఎ, ఏ, ఐ, ఒ, ఓ, ఔ, అం, అః లు చేరినప్పుడు తలకట్టు ✓, దీర్ఘము ా, గుడి ి, గుడిదీర్ఘము ీ, (గుడి 1 పొల్లు), కొమ్ము ు, కొమ్ముదీర్ఘము ూ, వట్రుసుడి ృ, దాని దీర్ఘము ౄ, ౡత్వము ౢ, ఎత్వ, ఏత్వ, ఐత్వములు ె ే ై లు, ఒత్వ ఓత్వ ఔత్వములు ొ ో ౌ లు చివరకు సున్న, విసర్గ ం, ః చేర్చుట–క, కా, కి, కీ, కు, కూ, కృ, కౄ, కౢ, కె, కే, కై, కొ, కో, కౌ, కం, కః–చివరి రెండు అచ్చులతరువాతనే వచ్చును. ఇవిచాలవఱకు హల్లుపై న, ప్రక్కన, క్రింద చేరును. ఒత్వ ఓత్వాలు సహజముగా వర్ణములో కొమ్ము ఉన్నవాటికి మ, య, ఘ, ఝ మొదలైనవాటికి మరొకవిధముగా వ్రాయుట కలదు మొ, మో ఇందులో చిత్రము మొకు దీర్ఘమిచ్చిన మో రాదు. నొ, నొ ఒత్వమునకు ఎత్వము కొమ్ము కొన్నిచోట్ల వచ్చును. సహజముగా కొమ్మున్న వర్ణములలో ఓత్వము ఎత్వదీర్ఘములతో మాత్రమే ఉండును. ఇది తికమకలుగా నున్నందున పిల్లలకు వీనిని నేర్పుటలో ప్రత్యేకశ్రద్ధ చూపాలి. ఇది సాధారణంగా అక్షరాలు నేర్పే వాచకాలలో గమనించడం లేదు. మాభారతీవాచకంలో వీనికి ప్రత్యేక శిక్షణ ఇచ్చాము. పెద్దవారు, పండితులు కూడ ఇందులో పొరపాట్లు చేస్తున్నారు. హ లో ఉన్న దీర్ఘం గుర్తును దీర్ఘంగా కొందఱు భ్రమిస్తున్నారు. దీర్ఘానికి కొన్నిచోట్ల పొల్లు వాడుకలో ఉన్నది. హా–ముఖ్యంగా గుడిదీర్ఘములో పొల్లు వాడుదురు. మీా, పీ, మొదలైన వానికి రెండురూపములును కలవు. దేవనాగరలిపిలో తలకట్టు స్థానములో పై నగీత, హల్లును తెల్పుటకు సంస్కృతములో క్రింద గుర్తు గుడి, ि వర్ణమునకు ముందు, గుడిదీర్ఘము, ఓత్వ ఔత్వములు, విసర్గ ే, ై, ో, ః లు ప్రక్కన; కొమ్ము, కొమ్ముదీర్ఘము, ఋత్వము, దాని దీర్ఘము, క్రింద; రహ లకు మధ్య, ఏత్వ. ఐత్వము… సున్న హల్లుపైన (`, ^, ˙) వచ్చును. బెంగాలీ లిపి కూడ

దాదాపీ విధముగానే ఉన్నది. ఇంగ్లీషులో మాత్ర మివన్నియు హల్లు ప్రక్కన వచ్చును. ఆ కారణంగా టైపుచేయుట, ముద్రణ ఇంగ్లీషులో భారతీయభాషలకన్న సులభముగా ఉన్నది. అందువలన మన లిపులను వదలి వానికి బదులుగా ఇంగ్లీషు లిపి వాడుట మంచిదను వారున్నారు. కన్నడలిపి చాలవఱకు తెనుగు లిపినే పోలియున్నందున ఈ రెంటికిని సమానమైన లిపి కొఱకు యత్నములు జరిగినవి.

సంయుక్తాక్షరాలు–అంటే ఒకటికన్న ఎక్కువ హల్లులు కలిసి వచ్చిన అక్షరాలు, క్త, మ్న, త్ర్య, జ్యో, త్స్న మొదలైనవి వ్రాయడంలో కూడ తెనుగుకొక ప్రత్యేకత ఉన్నది.

ఇంగ్లీషు మొదలైన భాషలలో అచ్చు చివరహల్లు తరువాత వచ్చును. **kta, mne, trya, jyo, tsna** పై వానిలో ఉత్తరోత్తరం బలీయం. తెనుగులో నీ యచ్చుగుర్తులు ఆదివర్ణమునకే ఉండును. ఆదివర్ణమే పూర్ణరూపములో నుండి తక్కిన హల్లులు వత్తులుగా క్రింద చేర్చబడును. దేవనాగరలిపిలో కొన్ని మొదటి హల్లునకు కొన్ని చివర హల్లునకు చేరును. क्त, म्न, त्र्य, म्ने, ज्यो, त्स्ना. బెంగాలు లిపి మొదలైనవి దేవనాగరలిపినే అనుసరించినవి. ఇది తెనుగులిపిలోని ప్రత్యేకత–ఆద్యక్షరప్రాధాన్యము.

ఒక భాషయొక్క గొప్పదనం ఎందులో ఉంటుంది ?

ఒక ఆంగ్లకవి "నేను ఇంగ్లీషు మాతృభాషగాగల ఇంగ్లండులో పుట్టినందుకు గర్విస్తున్నాను. ఎందుకంటే నేను కవిచక్రవర్తియైన షేక్స్పియరును నామాతృభాషలో చదివి ఆనందించగల్గుతున్నాను" అన్నాడు. ఏమి ! మాతృభాషలో చదివినవాడు మాతృభాషకాకుండ నేర్చుకొని చదివినవాని కంటె యెక్కువ ఆనందిస్తాడా !

ప్రతిభాషకు ఒక ప్రత్యేక నుడికారము, **(Idiom)** జాతీయత ఉంటుంది. అది మాతృభాషగా కలవారికి సహజంగా తెలుస్తుంది. ఇతరుడికి సహజంగా తెలియదు. అది వ్యాఖ్యానం చేసి వివరిస్తే కాని తెలి

యదు. అందువలన అది మాతృభాషగా గలవాడికి ఆభాషలోని అందాలు సొగసులు తెలిసినట్లు తక్కినవాండ్లకు తెలియనిమాట, అందువలన ఆనందం ఎక్కువ ఉండదనేమాట నిజమే.

కాబట్టి భాషకు గొప్పదనము అందులోని సుప్రసిద్ధులైన రచయితల వల్ల వస్తుంది. మనకు సంస్కృతమైనట్లు పాశ్చాత్యులకు గ్రీకు, లాటిన్ భాషలున్నవి. అందులోని కవులను వారెక్కువగా పొగడారు. గ్రీకుభాషలో పద్యకావ్యములు 'ఇలియడ్' (Iliad), ఒడిస్సీ (OdYssee) లు వ్రాసిన హోమర్ (Homer) ను అనేక ప్రసిద్ధ నాటకములను వ్రాసిన ఎస్కైలసు, యూరిపైడీస్, సాఫొక్లీస్, గేయకావ్యకర్త శాఫోను వారు చాల గొప్పవారన్నారు. అందులో నాటకములు సుఖాంతములు, దుఃఖాంతములు (Comedies, tragedies) అని వర్ణించి దుఃఖాంత నాటకములను సృష్టించిన ఘనత ఆగ్రీకు కవులదేనని, నాటకరచనలో షేక్స్పియరు వారినందరినీ మించినాడని వారన్నారు. ఇంతే కాకుండ ప్రపంచములో ప్రసిద్ధ రచనలనన్నింటినీ, అన్నిభాషలలోనివి వారు ఇంగ్లీషులోనికి శ్రమపడి అనువదించారు. ప్రపంచ సాహిత్యమును గురించి, ప్రసిద్ధ శాస్త్రములను గురించి తెలిసికొనవలెనంటే ఆంగ్లభాషాజ్ఞానము అత్యవసరమౌతుంది. సంస్కృతములోని వేదములు, వేదాంతగ్రంథములు, శాస్త్రములు కూడ చాలవరకు వారు పండితుల సహాయముతో ఎక్కువ శ్రమపడి చక్కగా అనువదించారు. ప్రస్థానత్రయానికి శ్రీ శంకరభాష్యములకు ఆంగ్లభాషానువాదము లున్నంత బాగా తెన్గును అనువాదాలు లేవు. పైగా ప్రపంచంలో ఇప్పుడత్యున్నతస్థానమాక్రమించిన అమెరికనుల భాషకూడ ఇంగ్లీషే. అందువలన అది ప్రపంచభాష అయినది. మన దేశంలో హిందీ యేవిధంగా దేశమునకంతకు వ్యావహారిక భాష అయిందో ఆవిధంగా ప్రపంచమునకు ఇంగ్లీషు వ్యావహారిక భాష అయింది. బ్రిటిషుపరిపాలన వలన అది భారతీయులకు చాలా చేరువ అయింది. ఇంగ్లీషు

కాబట్టి **B.A., M.A.** లలోనైనా గ్రాంథిక భాషకు ప్రాధాన్యమివ్వాలి. పండితులైనా దాని నభిమానించి నేర్చుకోవాలి.

సంస్కృతభాష వెనుక వాడుకభాషగా ఉన్నదని కొందరు అంటారు. ఆ మధ్య హిమాలయప్రాంతంలో ఒకచోట అది యిప్పటికిని వాడుకభాషగా ఉన్నదని ఒకరు పత్రికలో వ్రాశారు. సంస్కృతము అనేపేరే అది వ్యవహారంలో ఉన్న ప్రాకృతము మొదలైన భాషలను సంస్కరించి గ్రాంథికభాషగా, పండితులు వాడుకొనేభాషగా దానిని తీర్చిదిద్దారా అని అనిపిస్తుంది. ఏదెట్లయినా సంస్కృతము మన దేశములో అనాదిగా పండితులమధ్య వ్యవహారంలో ఉన్నది. దానికి దేవభాష అనికూడ పేరుఉన్నది.

ఏ కావ్యములు గొప్పవి అనేవిషయములో వేలువేలు పండితులు వేలు వేలు అభిప్రాయాలను వెలిబుచ్చారు. పాశ్చాత్యులు సన్నివేశాలకు, నిర్మాణము (plot) నకు, సంభాషణలకు పాత్రచిత్రణకు ప్రాధాన్యమిస్తూ ఉన్నదున్నట్లుగా వర్ణించుటను, వైవిధ్యాన్ని ప్రశంసిస్తారు. నన్నయభట్టు విశ్వశ్రేయస్సును కూర్చునదే కావ్యమన్నాడు. మానవుల వివిధ భావనలను, గల్లంతులను చిత్రించడంలో గ్రీకు కవులు, షేక్స్పియర్ మొదలైనవారు సిద్ధహస్తులు కావచ్చు. కాని మనవారి నిర్వచనాన్ని బట్టిచూస్తే అవి అసలు కావ్యములే కావనాలి. తాత్కాలికానందానికి మనవారాధిక్యత ఇవ్వలేదు, మనవారు పురుషార్థములు నాలుగన్నారు, ధర్మార్థ కామమోక్షములు. ధర్మాని కగ్రస్థానమిచ్చి, దానివలన అర్థము దానివలన కామము, వీని అనుభవం అనిత్యమని రోసి పరమార్థమైన మోక్షముపొందుటే జీవితానికి, రచనలకు పరమ ప్రయోజనమని మన గ్రంథాలు శ్రుతిస్మృతులు పురాణాలు కావ్యాలు ఉద్ఘోషిస్తున్నవి. పాశ్చాత్యులు మనదేశానికి వచ్చి మన శాస్త్రాలు, సాహిత్యము చూచి ఆశ్చర్యపడి మిక్కిలి ప్రశంసించినవారున్నారు.

అందులో కలకత్తా హైకోర్టుజడ్జిగా పనిచేసి మన దర్శనాలను, జైన బౌద్ధాది మతాలను, పాశ్చాత్య నాగరికతను, సైన్సును క్షుణ్ణంగా చదివిన వుడ్ రాఫ్ హిందువులొక్కరే మానవులని, తక్కినవారు మానవులే కారని, మానవత్వానికి అభ్యర్థులని (candidates, applicants-not selected) అన్నారు. కాబట్టి పరమార్థమువరకు రాచ బాటవేసిన సంస్కృతమునకున్న స్థానము మరొక భాషకు లేదు. అందులో జనించిన భారతీయులు, ముఖ్యంగా బ్రాహ్మణులు సంస్కృతం నేర్చుకోకపోతే వారి దౌర్భాగ్యమింతా అంతకాదు.

ధర్మము ప్రవృత్తి ధర్మమని నివృత్తి ధర్మమని రెండు విధాలు. అందు మొదటిది అభ్యుదయమును అంటే ఈ లోకములో ఉన్నత స్థితులను, పరలోకములో ఉన్నతస్థితులను ఇచ్చేది. రెండవది నిత్యమైన మేలును, శ్రేయస్సును, మోక్షాన్నిచ్చేది. అంటే వేదాంతగ్రంథాలు మహాకావ్యాలా? మనమహర్షులు, కవి, పండిత శబ్దాలు వారికేవాడారు. ఆ నిత్యానందము చెప్పడంలో మూడుపద్ధతులున్నవి. ఒకటి రాజు ఆజ్ఞాపించినట్లు, ప్రభుసమ్మితంగా చెప్పే నిత్యములైన వేదాలు, శ్రుతులు. రెండవది మిత్రసమ్మితంగా చెప్పే అంటే స్నేహితునివలె వాదించి హితము చెప్పే స్మృతులు. మూడవది ఆజ్ఞాపించినట్లు కాకుండ తనప్రియమైన భార్య సూచించే, ధ్వనించే కాంతా సమ్మితములైన పురాణాలు, కావ్యాలు కాళిదాసాది ఉత్తమ కవులు రచించిన ఉత్తమ కావ్యాలు. సంస్కృత కావ్యాలు రామాయణము, మహాభారతము; భాగవతము, రఘువంశము, ఉత్తరరామ చరిత్ర మొదలైన కావ్యాలు తీసుకుంటే ధర్మమేమిటో చెప్పి ప్రశాంత వాతావరణాన్ని ఇవి సృష్టించి, మోక్షానికి, నిత్యానందానికి త్రోవచూపిస్తవి. సంస్కృతనాటకాలలో అతి సామాన్యమైన నాటకము తీసుకొన్నా, తపస్సులు, తపోవనాలు, మనస్సుకు శాంతి, ఆహ్లాదం కల్గించే దృశ్యాలున్నవి. ఇది పాశ్చాత్యకవులలో కనబడవు.

సంస్కృతము దేవభాష. వేదాంతమును ఆభాష చెప్పినట్లుగా అంటే నిత్యానందాన్ని ఆ గ్రంథాలు వివరించినట్లుగా మరే గ్రంథాలు చెప్పలేదు. వానికి భారతీయ కవులు చక్కని అనువాదాలు చేశారు. ముఖ్యంగా మన భారత భాగవతాలు అనువాదాలే అనడానికి వీలులేదు. అవి స్వతంత్ర గ్రంథాలు కూడ. తత్త్వాన్ని చెప్పడంలో భారతీయ భాషలలో స్వతంత్ర రచనలు ఏవో అవి ఆయాభాషలలో గ్రంథాలు చదివినవారు చెప్పాలి. హిందీలో నిశ్చలదాస పండితుని 'విచారసాగరము' మొదలైన గ్రంథాలు అట్టి స్వతంత్ర గ్రంథాలు. అటువంటివి తెనుగులో సీతారామాంజనేయ సంవాదము సాటిలేనిది. అధ్యాత్మ రామాయణ కీర్తనలు అటువంటివే. సీతారామాంజనేయ సంవాదాన్ని ఆడవాండ్లు పాడుకొనదగిన పాట 'సీతపాట' అనేదికూడ తెనుగులో ఉన్నది. పూజ్యగురువుగారు శ్రీ కానుకొల్లు త్రివిక్రమ రామారావు పంతులుగారు, కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరీ ప్రథమ పీఠాధిపతులు శ్రీ ప. ప. శ్రీ విమలానందభారతీస్వాములవారు వ్రాసిన అముద్రితములైన శ్లోకాలు పద్యాలు వగైరా అనేక సంపుటాలున్నవి. అవి చదివి టీకా తాత్పర్యాలతో వేస్తే వాటిని మించిన వుండవన వచ్చును. వారి బోధలే మా విమలానందభారతీ గ్రంథమాలద్వారా ప్రచురణలలో వచ్చినవి. గుణగ్రహణ పారీణులు వీని ఆధిక్యతను గుర్తింపగలరు. అధిభాషా కోవిదులు, తత్త్వజ్ఞులు కవులు, పండితులు బేరీజు వేయగలరు.

నేను సర్వోత్కృష్టుడను కావలెను అనే కోరికలేనివాడు లేడు. అదే బ్రహ్మకళ. బ్రహ్మమంటే అన్నిటికన్న గొప్పది. అది నిర్గుణము, ఏకము, రెండవది లేనిది. రెండోది లేకపోతే ఇంక గొప్ప అనేదేమున్నది? కాబట్టి అనేకం లేకుండ గొప్పలేదు. ఒకటి వాస్తవము, రెండోది మిథ్య. దీని సమన్వయమే తత్త్వశాస్త్రము. శ్రుతులు చెప్పింది. తాను వాస్తవంగా ఏకమైన బ్రహ్మము. కాని అసత్తు కాని మిథ్య అయిన ప్రపంచము, సర్వేశ్వరుడు: వ్యావహారిక సత్యము

ఐశ్వర్యము ఈశ్వర వైభవము. సర్వజీవులు ఆ బ్రహ్మమే, ఆ ఈశ్వరుడే. అదే నేనని తెలుసుకోవడమే మోక్షము. జీవునికి ఇది, ఈ అత్యున్నత స్థానము. (నేను దేవుడి కొడుకును, దేవుడి భార్యను, దేవుడి కింకరుడను అని కాదు) నేనే పరమేశ్వరుడిని అని తెలియజేసేవి శ్రుతులు—వాటి వ్యాఖ్యానాలు స్మృతులు పురాణాలు. ఈ తత్త్వము ఆంధ్రభాషలో వివరింపబడినట్లు తక్కినభాషలలో వివరింపబడలేదేమో. ఇందులో పోతన మహాకవి అగ్రగణ్యుడు. ఈశ్వరవైభవాన్ని ఆయన వర్ణించినట్లు వ్యాసుని భాగవతము, పురాణాలు కూడ వర్ణించలేదనడం అసత్యం కాదు. దేవవాణి శిరోధార్యమే. దాని అనుంగు తనయ తెనుగు.

బ్రహ్మము నిర్గుణము, నిష్కలము, ఏకము, అద్వితీయము కాని వ్యావహారికంగా నిత్యమైన జీవేశ్వరులతోటి ప్రపంచముతోటి ఉన్నట్లుగా కనబడేది. సగుణంగా భాసించే నిర్గుణము. నిర్గుణము సగుణంగా కనబడ్డది, అంటే పురుషుడో, స్త్రీయో కావాలి? ఒకటి రెండవదానిని పూరించేది. ఒకటి పురుషుడు స్వతంత్రము. రెండవది ప్రకృతి పరతంత్రము. సర్వేశ్వరుడు, శక్తి ప్రకృతి. భార్యాభర్తలు. సర్వానందములకు స్థానము ఉపస్థేంద్రియము అని శ్రుతులు. సంస్కృతంలో లాక్షణికులు రసచర్చచేసి శృంగారమొక్కటే రసమన్నారు. అందులో సంభోగ శృంగారము, విప్రలంభ శృంగారము. (వియోగము—విరహము వర్ణించేది) అని రెండు విధాలు. అందులో మొదటిదే ఆనందాన్నిచ్చేది. అందువలననే మన పరమేశ్వరుడు భార్యకలవాడు. కాళిదాసు చెప్పినట్లుగా వాగర్థములు కలిసినట్లు, పదము దాని అర్థము విడదీయరాకుండ కలిసినట్లున్న ఆదిదంపతులు. పరమేశ్వరీ తత్త్వంలో వారినే లలితాదేవీకామేశ్వరులుగా చెప్పవచ్చు. శివాశివులన్నా రాధాకృష్ణులన్నా వారే. గణపతి హనుమంతులకు గూడ భార్యలను చెప్పారు.

శృంగారమే రసము. ధర్మానికి విరుద్ధంకాని శృంగారము. సంస్కృతంలో తెనుగులో మన కావ్యాలు అదే వర్ణించినవి. దాంపత్య

శృంగారము. అది దేవదేవులకు చెప్పినవి, ఉత్తమ కావ్యాలు. ఉత్తర రామచరిత, భాగవతము, రామాయణము మొదలైనవి. విశృంఖలత్వము ఒక్క- పరమేశ్వరత్వంలోనే. అది పోతన వర్ణించినట్లుగా వ్యాసమహర్షి కూడ వర్ణించలేదు. పరమేశ్వరుడు శృంగారప్రియుడు. అతి కరుణాసముద్రుడు భక్తావనదీక్షాకంకణుడు. గజేంద్రమోక్షములో పోతన కవి దానినెంత రమణీయంగా వర్ణించాడు!

గీ॥ విశ్వమయతలేమి వినియునూరకయుండి రంబుజాసనాదులడ్డపడక
విశ్వమయుఁడు విభుఁడు విష్ణుండు జిష్ణుండు భక్తియుతున కడ్డపడఁ
దలంచె.

అప్పుడాయన ఏమి చేస్తున్నాడు?

మ॥ అల వైకుంఠపురంబులో నగరిలో నామూలసౌధంబు దా
పల మందారవనాంతరామృత సరఃప్రాంతేందు కాంతోపలో
త్పల పర్యంకరమా వినోదియగు నాపన్నప్రసన్నుండు వి
హ్వల నాగేంద్రము పాహిపాహియన కుయ్యాలించి సంరంభియై

లక్ష్మీదేవితో పందెం వేసి జూదం ఆడుతున్నాడేమో, గెలిచాడో, ఓడాడో? ఏదైనా ఫలమొక్కటే. 'వివాదప్రోత్థిత (శ్రీ) కుచోపరి చేలాంచలం' లంకించుకొన్నాడు. ఆ సమయంలో భక్తుని దీనాలాపం వినబడ్డది. ఎవరైనా ఆసమయంలో లేచి భక్తుడికోసం పరుగెత్తుతాడా? మరి ఆయన-

మ॥ సిరికిం జెప్పఁడు శంఖచక్రయుగముం జేదోయి సంధింపఁడే
పరివారంబును జీరఁడభ్రగపతిం బన్నింపఁడాకర్ణికాం
తరధమ్మిల్లము చక్కనొత్తఁడు వివాదప్రోత్థిత(శ్రీ)కుచో
పరిచేలాంచలమైన వీడఁడు గజప్రాణావనోత్సాహియై॥

ఏకవి యీవిధంగా వ్రాయఁగలడు? ఇదేమిన్నీ మూలంలో లేదు.

ఇంకొక ఘట్టము-పొట్టివాడైన విష్ణువు బలిచక్రవర్తి మూడడుగుల నేల అర్థించాడు. యాచన పరువు తీస్తుంది. చేయి క్రిం దౌతుంది. మానం కలవాడు దీని కంగీకరించడు. అది తనకోసమైతే

ఈయన దేవతల మేలుకోసం యాచిస్తున్నాడు. బలి ఇస్తానన్నాడు. శుక్రాచార్యులు బలిచక్రవర్తి గురువు. ఆయన వైభవానికి కారకుడు. "నీ వైభవమంతా పోతుంది ఈదానంచేస్తే. ఈయన నిన్ను వంచించడానికి వచ్చిన మహావిష్ణువు" అన్నాడు. బలిచక్రవర్తి మహాభక్తుడు. భక్తుడు కోరేదేమిటి? ఏ జీవుడైనా కోరేదేమిటి? మోక్షము, జన్మరాహిత్యము, బ్రహ్మము నని పరమేశ్వరుడనని తెలుసుకోవడం. అంటే పరమేశ్వరుని వైభవం తెలియవద్దా? అదే వర్ణించాడు బలి—

శా॥ ఆదిన్ శ్రీసతికొప్పుపై దనువుపై నంసోత్తరీయంబుపై
బాదాబ్జంబులపైఁ గపోలతటిపైఁ బాలిండ్లపై నూత్నమ
ర్యాదం జెందుకరంబు క్రిందగుటమీఁదై నాకరంబుంట మే
ల్గాదే? రాజ్యము గీజ్యమున్ సతతమే కాయంబు నాపాయమే॥

నేను చదువుకొనే రోజులలో భాగవతంలో దోషాలని నేలమయ్యగారు కాబోలు భారతిలో ఒకవ్యాసం 60 సంవత్సరాల క్రింద వ్రాశాడు. అందులో భక్తి ఈవిధంగా వర్ణించవచ్చునా అన్నారు? భక్తుడైన జీవుడు కోరేది పరమేశ్వరత్వమే అని యెందరికి తెలుసు? శుంభనిశుంభులు మొదలైన రాక్షసులకు ఈమార్గం తెలియదు. ఇటువంటి మాటలు సన్నివేశాలు మూలంలో లేనివి భాగవతంలో మనకెన్నో కనబడతవి. యశోదమ్మతో గోపెమ్మలు చేసిన ఫిర్యాదు లిట్టివే. ఇవి పరమేశ్వర విలాసాలని ఆయన భావన. ఈశ్వరత్వ వైభవం, విశృంఖలత్వం వర్ణించేవి. జీవత్వంలో కాని, జీవన్ముక్తత్వంలో కాని చేయదగినవి, అనుకరించదగినవి, భావింపదగినవి కావు.

తస్యతావ దేవచిరం యావన్న విమోక్ష్యే–అథ సంపత్స్యే ॥ —ఛాం.

జీవన్ముక్తునికి గూడ శరీరపాతం కావాలి, ఆ వైభవం రావడానికి. ఈవిధంగా తెనుగుకవులు వర్ణించారు. తెనుగు భాగవతానికి దీటైన గ్రంథం లేదు.

నిత్యమోక్షమిచ్చేది బ్రహ్మజ్ఞానం. ఆనందమే తన స్వరూప

మని గుర్తించడం. దానికి కొంచెం క్రిందుగా వ్యక్తమయ్యేది ధర్మానికి విరుద్ధంకాని శృంగారం—దంపతులమధ్య. రెండురకాలవి గూడ పాఠకుల లకు ఆనందా న్నిచ్చేవే.

వెనుక మన విద్య, మన గ్రంథాలు వీనికి అగ్రస్థానమిచ్చినవి. అసలు విద్య, సాహిత్యవిద్య. తెనుగులో పంచకావ్యాలు కూడ శ్రేష్ఠాలే. మనుచరిత్ర. పారిజాతాపహరణం, వసుచరిత్ర, కళాపూర్ణోదయం: శృంగారనైషధం, ఆముక్తమాల్యద, పాండురంగమహాత్మ్యం—5 కాక ఏడైనవి. ప్రభావతీప్రద్యుమ్నం కూడ చేర్చవచ్చు. ఇంకా ఇట్లాటివి కొన్ని చెప్పవచ్చు. కావ్యానందం అనుభవింపగలవాడికే అసలానందం తెలిసేది. సంస్కృతకావ్యాలకు నాటకాలకుగూడ తెనుగులో సంస్కృతవ్యాఖ్యానాలను మించిన వ్యాఖ్యానాలున్నవి. తేవప్పెరుమాళ్ళయ్య, సోమకవి, వేదం వేంకటరాయశాస్త్రి, దీపాల పిచ్చయ్యశాస్త్రి వగైరాలు మంచి వ్యాఖ్యాతలు. గీత గోవిందానికి ఒక ఆచార్యులు మంచి వ్యాఖ్యానం వ్రాశారు. గీతగోవిందం గేయాలను తెనుగులో అదే మోస్తరు ఫణితిలో ఒక యువ జమిందారు వ్రాసింది దాదాపు 50 ఏండ్ల క్రింద SRR కాలేజి వార్షికోత్సవాలలో ప్రదర్శింపబడ్డది. ప్రొఫెసర్ సాంబమూర్తి గారు దానిని ఆవిష్కరిస్తూ, ప్రపంచంలో మొదటి ఓపెరా (OPERA) ఇటలీలో కాదు ఇండియాలో ఉద్భవించినది. అది గీతగోవిందమన్నారు. ఈస్వారస్యాలన్నీ వివరిస్తే, పెద్ద గ్రంథమౌతుంది.

సంస్కృతములో దశవిధ రూపకములున్నవి. అవన్నియుఁ దెనుఁగులో నున్నవి. అవేకాక సంగీతనృత్యనాట్యాభినయనములు కల అనేక ప్రక్రియలు తెనుఁగులో వెలసినవి. హరికథ, హరకథ, జంగముకథ, బుర్రకథ, తంబురకథ, (వీనిని గురించి 8.3.91 న కాబోలు రేడియో వ్యాసము వచ్చినది) యక్షగానము, వీధినాటకము, తోలుబొమ్మలాట, పురాణములు చెప్పుట ఉపన్యసించుట. వ్యాసరచన మన సంస్కృతిని అట్టడుగు వర్గములకు గూడ అందించినారు,

ఇందులో అన్ని కులాలవారు జంగములు, హరిజనులుకూడ ఉన్నారు. ఒక్కొక్క ప్రక్రియను, విద్యను తీసికొని దానిని ఉన్నతస్థితికి తెచ్చిన వారు. స్త్రీ శూద్రాదుల కొఱకే శ్రీ వ్యాసమహర్షి పురాణాలు పంచమవేదమనబడే భారతం వ్రాశారు. మన సంస్కృతి అందఱికి అందించారు. అగ్రజాతులు తక్కినవారిని అణగద్రొక్కారనడం బుద్ధిలేని మాట. శిష్టులు దుష్టులు అందఱిలోను ఉన్నారు. ఉంటారు. తెనుగు కవులు చూపినన్ని ఛందోరీతులు మఱెవ్వరును చూపలేదు. జానపద వాఙ్మయమే కాక స్త్రీలపాటలు కూడ నవరసాలు ప్రవహింపజేసినవి. పతివ్రతలు, భక్తరాండ్రు, వేదాంతులు, వేదాంతినులు అన్నికులాలలోను ఉన్నారు. కుమ్మరి మొల్ల వ్రాసిన రామాయణము మొల్ల రామాయణమని ఇంకా ప్రసిద్ధిగా నిల్చే ఉన్నది. ఆమెకెవరు చెప్పారు? నిలవకుండా పోయినవింకా ఎన్నో ఉంటవి.

ఇవి కాక శతకాలు. కందపద్యాలతో, కందార్థాలలో, వృత్తాలలో, తోహరాలలో రచనలు. నిర్వచనకావ్యాలు, నిరోష్ఠ్య కావ్యాలు (ప, ఫ, బ, భ, మ లు లేనివి) కలవు. త్యాగయ్యకృతులు, రామదాసు అన్నమయ్యకీర్తనలు, భక్తిరసపూర్ణాలు—మువ్వగోపాల పదాలు, జావళీలు శృంగారరసప్రధానమైనవి. సంగీతము, నాట్యము, అభినయము పోషించేవి. సంస్కృతములో లేని ఛందోరీతులు తేటగీతి, ఆటవెలది, సీసపద్యం, పూర్తిగా ద్విపదకావ్యాలున్నవి. రాజులుకూడ వ్రాసినవి. పోషించినవి. ముస్లిములు కూడ కావ్యాలు వ్రాశారు. కవులను పోషించారు. బ్రౌను మొదలైన దొరలు కూడ ఆంధ్రభాషను తీర్చిదిద్దారు. వీరందఱు ప్రజాదరణ, గౌరవం పొందారు.

ఇవిగాక ఆంధ్రభాషలో ఇతరభాషలలో అపరూపమైన కసరత్తులున్నవి. ఆశుకవిత్వము—అడిగిన వెంటనే కవిత్వంచెప్పడం—ఇచ్చిన నియమాలతో, విచిత్రమైన సమస్యలను పూరించడం "కప్పను జూచియును పాము గడగడ వణకెన్", "కుంజరయూథంబు దోమ కుత్తుక

జౌచ్ఛే” మొదలైనవి. దత్తపదులు—కొన్ని పదాలిచ్చి వాటిని ఒక్కొక్క పద్యపాదంలో పెట్టి భారతార్థమో, రామాయణార్థమో, మరొక వర్ణనగానో పద్యాలల్లడం, గంటకొక కావ్యం చెప్పడం—భట్టుమూర్తి గడియకు వందపద్యాలు చెప్తానన్నాడు. ఇంక శతావధానాలు అష్టావధానాలు: వందమందికి వరుసగా పద్యాలు చెప్పడం—ఒక్కొక్కరికి ఒక్కొక్క పాదం అడిగినదానిమీద చెప్తూ పోవడం, తబ్బిబ్బు పడకుండా, పొరపాట్లు చేయకుండా, చివరకన్నిపద్యాలు చదువడం ఇది శతావధానం. ఇక అష్టావధానం—8 రకములైన పరీక్షలకు ఎనిమిదిమంది పండితులు చేసేవాటికి తట్టుకొని నిల్వడం, సమస్యాపూరణం, ఇచ్చిన వర్ణన, దత్తపది ఇవేకాక వ్యస్తాక్షరి—ఒక వాక్యంలోని అక్షరాలను వేఱు వేఱుగా వ్రాసి ఆకాగితం ముక్కలను క్రమరహితంగా ఇస్తే జ్ఞాపకముంచుకొని అన్ని సరిగా కలిపి చదువడం వ్యస్తాక్షర—ఇక నిషిద్ధాక్షరి—పద్యం మొదలు ఒక్కొక్క అక్షరం తరువాత ఈఅక్షరం చెప్పగూడదని నిషేధించడం. ఇవిగాక గంటలు మధ్యమధ్య మ్రోగిస్తే ఎన్ని మాఱులు మ్రోగించింది జ్ఞాపకముంచుకొని సరిగా చెప్పడం అడిగిన పిచ్చిప్రశ్నలకు సమాధానం చెప్పడం, జ్ఞాపకాన్ని చెడగొట్టడానికి చేసే ప్రయత్నాలు పేకాట ఈవిధంగా ఎనిమిది రకాల కల్యపరీక్షలకు తట్టుకొని చివరకన్ని చదువడం—అష్టావధానం—ఇందులో ఉద్దండులై నిల్చిన ఆంధ్రకవి పండితులున్నారు. గొప్పపండువు చేసేవి. అవధానంలో తిరుపతి వెంకటకవులు, ఆశుకవిత్వంలో కొప్పరపు సోదరకవులు ఇంకా అనేకులు ప్రసిద్ధులున్నారు. ఇవన్నీ ఏ భాషలలో ఉన్నవి? సంస్కృతంలో కంటె యతిప్రాస అని ఎక్కువ నియమాలు తెనుగులో ఉన్నవి. అవధాన ప్రక్రియ, ఆశుకవిత్వం సంస్కృతం మొదలైన మరి కొన్ని భాషలలో ఉండవచ్చు. తెనుగులోని ప్రక్రియలు వాటిఅన్నిటిని మించినవి. ఇందులో చప్పిడి పద్యాలు కాక రసవంతంగా చెప్పడం నేను చూచాను. ఇవి చేసినవారు కూడ అన్ని కులాలలో ఉన్నారు. •

గ్రుడ్డికవి అవధానాన్నికూడ చూచాను.

ఆంగ్లభాషతో పరిచయము వచ్చిన తరువాత శ్రీ కందుకూరి వీరేశలింగపంతులు ప్రభృతులు ప్రవేశపెట్టిన క్రొత్త రచనలు–హాస్య రచనలు, ప్రహసనాలు, నాటకాలు, అందులో ఏకాంకికలు, కుతూహలం చివరిదాక రేకెత్తిస్తూ సాగే నవలా రచన, కథానికలు, జీవిత చరిత్రలు, స్వీయచరిత్రలు, ఖండకావ్యాలు, భావకవిత్వం, ఖండన మండనాలు, విరసాలు, సరసాలు కొల్లలుగా వెలసినవి.

పోతనగారిని గురించి మరొకమాట–మా గురువుగారు శ్రీ ప. ప. విమలానందభారతీస్వామి–1 వారు కవిత్రయాన్ని అభిమానించినను, పోతనగారిని ఎక్కువగా అభిమానించారు. అనేక ప్రదేశములలో పోతనగారు మూలాన్ని మించి వ్రాశారు. అనర్ఘరత్నాలిచ్చారు. శమీకమహర్షిపైన చచ్చిన పామును వైచి పరీక్షిన్మహారాజు చనిన వెనుక ఆయన కుమారుడు శృంగి వచ్చి–

ఉ॥ ఆడఁడు తన్నుదూషణము లాశ్రమవాసులఁగాని వైరులం
గూడఁడు కందమూలములు గూడుగఁదించు సమాధినిష్ఠుఁడై
వీడఁడు లోనిచూడ్కులను విష్ణునిఁదక్కఁ బరప్రపంచముం
జూడఁడు మద్గురుండు ఫణిఁ జుట్టఁగ నేటికి రాచవానికిన్ ॥

భా 4_430

ఉ॥ హోము హిరణ్యదానములు బుచ్చుకొనంగ, ధనంబు లేమిఁజుం
దేము సమంచనంబులుగ దీవనలిచ్చుచు, వేసరింపఁగా
రాము, వనంబులన్ గృహవిరాములమై నివసింపఁ జెల్లరే
పాము నువైవఁగాదగునె, బ్రహ్మమునీంద్రు భుజాగ్రశంబునన్ ॥

భా 1_431

బ్రాహ్మణుల నిత్యసంతృప్తి, ధనాదులకు దేబిరించకుండ స్వతంత్రంగా, హుందాగా యాచించకుండ జీవించడం, అక్షర్మము అంటె ఆగ్రహము ఇందులో ప్రతిబింబిస్తవి.

ఆయన కవిత్వము సాధారణులకు అర్థము కాదు. ఒక పెద్దసభలో ఒక కవి సాత్రమూ పోతనపద్యం—

ఉ: అచ్చపుఁ జీఁకటింబడి గృహవ్రతులై విషయప్రవిష్టులై
చచ్చుచుఁ బుట్టుచున్ మరలఁ జర్విత చర్వణులైన వారికిం
జెచ్చెరఁ బుట్టునే పరులు సెప్పిననైన, నిజేచ్ఛనైన, నే
మిచ్చిననైన, గాననకు నేగిననైన హరిప్రబోధముల్ ?

భా. 7-181

చదివి, ఇందులో ఏమి కవిత్వమున్నది? ఉంటే చీఁకటిలో కొంచెమున్న దేమో" అని అన్నారు.

పాపము చీఁకటిలోనైనా కొంచెం కవిత్వం కనబడ్డది.

ఇందులో కవిత్వమే లేదట. నిజంగా లేదా? అది ఉత్త చీకటి వెలుగు వస్తూ పోతూ ఉండే చీకటి కాదు. పూర్తిగా చీకటే—అచ్చపు చీకటి అజ్ఞానము. ఇది మహామేధావులని అనుకొనబడేవారి పరిస్థితి కూడ. వారికి కావలసిందొక్కటే గృహమే. గృహానికి కావలసినవి సంపాదించడం—తక్కిన కాలాలలో ఇతర వ్యాసంగాలేమైనా ఉన్నవా? ఉన్నవన్నీ గృహం కోసమే. గృహాన్ని నిల్పడమే, పోషించడమే వ్రతంగా దీక్షగా కలవారు సర్వము గృహస్థ జీవనం కొఱకే—గృహమంటే భార్య అని కూడ ఉన్నది. భార్య ఉంటేనే గృహము. కామదాసులు, కామసేవ. అక్కడ అచ్చపు, ఇక్కడ వ్రతము వ్యర్థపదాలా? దీని కోసం విషయప్రవేశం—విషయాలు_అనందాన్నిచ్చే పని సంపాదించడం—వీనికి అంతులేదు. ఐదు జ్ఞానేంద్రియాలు, ఐదు కర్మేంద్రియాలు, వీటికి మూలమయింది, లెక్కలేనన్ని ఊహాపథాలలో సంచరించే నేర్పుగల మనస్సు. వీని సంతృప్తి కోసం మనుష్యుడు కోరనివి లేవు. వేయని వేషాలు లేవు. ఇవి అనంతం— ఒక జన్మలో ఈ కోర్కెలు తీరుతవా? చిత్రవిచిత్రాలైన కోర్కెలు—మనుష్యులు జంతువులు కావాలని కూడ కోరుతారు. ఒక ముని మిథునము జంతువులుగా క్రీడిస్తుంటే పాండురాజు బాణానికి ఒక జంతువు చస్తే ఘోరమైన శాపం వచ్చింది.

పిపీలిక-చీమలాంటి దాని దగ్గఱనుండి బ్రహ్మవఱకు జన్మలు-ఎత్తినవే మరల ఎత్తడం అంటే చావాలని, పుట్టాలని మరల మరల కోరుతున్నా మన్న మాట. అంతేకాదు తిన్నదే తినడం, అనుభవించిందే అనుభవించడం, విసుగుపుట్టదు. అంతా చర్విత చర్వణం. అయినా విరాగం పుట్టదు. ఇది మన ప్రతాపము, పాండిత్యము:. ఈ ప్రయత్న మెప్పు డాగుతుంది? మోక్ష మెప్పుడో? ఆత్మ విచారణ-నేనంటే యెవరినని విచారణ రావలె. ఈ కోరికలకు ముగింపెప్పుడు? తాను ఏకోరికలు లేని నిష్కాముడైన, నిరంజనుడైన బ్రహ్మము నని లేక ఆప్తకాముడనైన పరమేశ్వరుడ నని హరినని తెలిసికోవడం-బోధము. ఉత్త బోధ కాదు. ప్రబోధము రావలె. ఇదెట్లా వస్తుంది? పరులు చెప్తే తెలుస్తుందా? ఎన్ని గ్రంథాలు, ఎందఱు మహానుభావులు చెప్పడం లేదు-తెలుస్తున్నదా? పిల్లలను ప్రోత్సహించడానికి ఏవో తీపిపదార్థా లిస్తాము. చదువుకుంటే మిఠాయి పెడ్తా మంటాము. మిఠాయి తింటాడు కాని చదువడు. ఇవి అజ్ఞానిని హరివైపు త్రిప్పవు. బాధలు పడి పడి నెత్తి బొప్పికట్టి తానీ సంసారమునుండి బైటపడ వలెనని కోరవలె-నిజేచ్ఛ అంతమాత్రాన చాలదు. కుక్క-బుద్ధి క్షణ క్షణం మారుతుంటుంది. గట్టిగా నిలవదు. అందులో మోహం కల్గించేవి యెదురుగా ఉంటె-పోనీ అడవులకు పోతేనో-అక్కడ ఇట్లాటి వుండవు కదా! కానలకు నేగిన నైనను హరిప్రబోధములు కల్గవు. మఱెట్లా? తన ఇచ్ఛ తీవ్రం కావలె. తెలిసి చెప్పగల గురువు దొరకవలె. అప్పుడు కాని హరి ప్రబోధము, ముక్తి కల్గదు. ఇదే పరమ శ్రేయస్సు-ఈ పద్య మా శ్రేయస్సును చూపిస్తున్నది. ఇది కవిత్వము కాదంటాడు ఆ కవిరాజు. మఱి ఆయన ప్రాగడే నన్నయభట్టే విశ్వశ్రేయస్సును చెప్పేదే కావ్యమన్నాడు. ఆయనే కవి అన్నాడు. తక్కినవారు కవులు కారని.

శ్రీ శంకరులు వ్రాసిన 'జీవన్ముక్తానంద లహరి'లో ఆత్మజ్ఞుడే కవి అని అన్నారు. పండా అంటే ఆత్మజ్ఞానమే అని అదికలవాడే పండి

తుడని శ్రుతి చెప్పింది.

శ్లో॥ ఇమాం ముక్తావస్థాం పరమశివసంస్థాం గురుకృపా
సుధా పాంగావాప్యాం సహజసుఖవాప్యా మనుదినం
ముహుః ర్మజ్జన్ మజ్జన్ భజతి సుకృతై శ్చే న్నరవరః
సదా త్యాగీ యోగీ కవిరితి వదంతీహ కవయః ॥

పరమశివుడుగా ఉండుట అనే ఈ ముక్తిస్థితి గురుని దయామృతం చేత పొంది అందులోనే మాటిమాటికి మునుగుతూ ఉండేవాడే ఆనర శ్రేష్ఠుడినే త్యాగి, యోగి, కవి అని కవు లంటారట. కవులంటే ఎవరో, కవి అంటే యెవడో చెప్పాను. కాబట్టి ఈ అమృతము అందరికి తేలికగా లభ్య మయ్యేది కాదు.

బ్రహ్మవిద్వరిష్ఠుడైన ఆ కవిపోతన బోధ-

క॥ లేదని యెవ్వరి నడుగను,
రాదని చింతింపఁ, బరులు రప్పించినచోఁ
గాదని యెద్దియు మానను
ఖేదము మోదమును లేక క్రీడింతుమదిన్ ॥
-భాగ. 7-439

క॥ నిందింపఁ బరుల నెన్నఁడు
వందింప ననేక పీడ వచ్చిన మదినా
క్రందింప విభవముల కా
నందింపఁ బ్రకామ వర్తనంబున నధిపా ॥ భాగ. 7-440

భారతభాగవతములు కవిత్రయము, పోతన మనకిచ్చిన మహా సంపద. కావ్యములు కూడ అనర్ఘ రత్నములు. ఇట్టి మాతృభాషను వదలుకొని విదేశాలలో, ఇతర రాష్ట్రాలలో ఉద్యోగాలకోసం పోతే పోవచ్చు. దీటులేని తీయని తెలుగును వదులుకోకూడదు. దీని మహిమ గ్రహించక, విదేశాలలోనే స్థిరనివాసం కల్పించుకోవలెననుకొనేవాడు పరమ అవివేకి అనాలి. అతడు అజ్ఞానంవల్ల తన సంపద పోగొట్టుకొనే.

డమే కాక తన పిల్లలను వారి పిల్లలను ఈ అమూల్యసంపదకు దూరం చేస్తున్నారు. అట్టి తల్లిదండ్రులకు బుట్టిన ఆపిల్లలు మహా దురదృష్టవంతులు. విశ్వంలో ధర్మభూమి భరతఖండం. అందులో ధర్మభూమి తెనుగుగడ్డ. ఆంధ్రదేశం, తెనుగుదనానికి ప్రాణం దాని భాష, సంస్కృతి. దీనిని వదలుకొనేవాడి నేమనాలి?

ఇది నేను కాదు అన్నది. తమిళులకు దేశాభిమానం చాల యెక్కువ. ఆతమిళ దేశంలో బుట్టిన స్మార్త బ్రాహ్మణుడు, బ్రహ్మవేత్త, సంస్కృతములో శతాధిక గ్రంథకర్త, మహానైష్ఠికుడు, పండితుడు, కవిశిరోమణి అప్పయ్యదీక్షితు లన్నమాట.

ఆంధ్రత్వం ఆంధ్రభాషాచ ఆంధ్రదేశ వ్యవస్థితిః ।
తత్రాపి యాజుషీ శాఖా నాల్పస్యతపసః ఫలమ్ ॥

ఆంధ్రదేశంలో తెనుగు మాతృభాషగా పుట్టడం అనేక జన్మల తపఃఫలమన్నారు. ఆయన మనకు తెలిసినట్లుగా తెనుగు తీయదనము ఎఱుగనివాడు, తెనుగు గ్రంథాలు రహస్యాలు చూడనివాడు, సంస్కృతభాషా ప్రాశస్త్యమును మాత్రమే గుర్తించినవాడు. అందులో యాజుషి శాఖ అన్నాడు. యజుర్వేదం–శుక్ల, కృష్ణ కూడ. 'ఆనందో బ్రహ్మ' 'అహం బ్రహ్మాస్మి' 'యతో వా ఇమాని భూతాని జాయన్తే । యేన జాతాని జీవన్తి ! యత్ప్రయన్త్యభిసంవిశన్తి । తద్విజిజ్ఞాసస్వ తద్బ్రహ్మేతి । నేతి నేతి–

ఇలువంటి మహావాక్యములు కలది యాజుషి శాఖ. శ్రీశంకరుల పూర్వికులు నంబూద్రి బ్రాహ్మణులు గోదావరిజిల్లా నుండి కేరళకు వలసవెళ్ళిన స్మార్త బ్రాహ్మణులే–యాజుషీ శాఖీయులే కావచ్చు. శ్రీశంకరులు ప్రథమ పీఠాన్ని, ప్రధానపీఠాన్ని శృంగేరిలో కర్ణాటకంలో స్థాపించారు. ఆంధ్ర కర్ణాటకభాషలకు లిపిలో సామ్యత ఉన్నది. నిజం చెప్తే నాభాష కర్ణాటభాష అన్నాడు ఆంధ్రసార్వభౌముడు, శ్రీనాథుడు. శ్రీకృష్ణదేవరాయలు కూడా కవిసార్వభౌముడైనా నేను కర్ణాట

విభుడవని చెప్పుకొన్నాడు. దాక్షిణాత్య సంగీతాన్ని కర్ణాటక సంగీతమంటారు. అందులో ప్రముఖులు ఆంధ్రులే. ఆంధ్రుల నుంచే తమిళులు సంగీతము నేర్చుకొని మనలను మించారు. మొదట శృంగేరీపీఠాన్నధిష్ఠించిన మండనుడు ఆంధ్రుడంటారు. ఆపీఠాధిపతులలో ప్రసిద్ధులైన భారతీతీర్థులు, విద్యారణ్యులు, శ్రీశివాభినవనృసింహభారతీస్వామి, పూర్వప్రస్తుత పీఠాధిపతులు ఆంధ్రులే.

ఇట్టిది ఆంధ్రభాష. **(The Italian of the East)** ప్రాచ్య ఇటలీభాష అని పాశ్చాత్యులు పొగడినది. ఆంధ్రుల ఆచారములు, స్వభావము, వారి ఉచ్చారణలోని వైశిష్ట్యము, వేదపఠనములో వారి ఆధిక్యత, పాండిత్యము వీనిని తడవలేదు. భాషను గురించి కూడ సంగ్రహముగనే చెప్పబడినది.

ఇట్టి మాతృభాషను వదలుకొనువాడు పరమ మూఢుడనుటలో సందేహమున్నదా?

# ఆంధ్రభాషాభివృద్ధి

ఆంధ్రభాషా ప్రాశస్త్యాన్ని గురించి కొంత చెప్పాము. ఇంక మనము దాని అభివృద్ధికి చేయవలసింది ఏమీనీ లేదా? అది పరిపూర్ణ మయిందా? పరిపూర్ణాభివృద్ధిని పొందిందా?

అసలు ఒకరు మరొక భాష నేర్చుకోవలసిన అవసర మెప్పు డు వస్తుంది? ప్రతివానికి పుట్టిన భాష లేక మాతృభాష అని ఒకటి ఉంటుంది. అది అతని అవసరాల నన్నిటిని తీర్చగల్గితే మరొక భాష నేర్చుకోవలసిన అవసర ముండదు. తెనుగుభాష తెనుగువారికి అన్ని అవసరములను తీర్చగలదా? అతడు నేర్చుకొన గోరినవన్ని మనభాష సమకూర్చగలదా?

ఇప్పుడు విజ్ఞానము విపరీతముగా పెరిగిపోతున్నది. అనేకము లైన క్రొత్త విషయములు మేధావులు కనిపెట్టు న్నారు. ముఖ్యముగా శాస్త్రవిజ్ఞానము పెరిగిపోతున్నది. ఈ శతాబ్దములో మన పూర్వులు కని వినని వెన్నో మనము చూచాము. ఇందులో పాశ్చాత్యులు ముం దంజ వేశారనడంలో సందేహము లేదు.

సాహిత్యము వేదాంతము వదలిపెట్టే తక్కిన శాస్త్రముల లో పాశ్చాత్యులు పొందిన అభివృద్ధిని, వారు కనుగొన్నవి ఇతరులు కనుగొనలేరు. గణితము, వైద్యము, ప్రకృతి శాస్త్రాలు, రాసాయని కము, ఇంజనీరింగు అన్నిటిలోను విపరీతమైన అభివృద్ధి వారు సాధిం చారు. మన మవి నేర్చుకోవలెనంటే అవి నేర్పే గ్రంథములు తెనుగు లో లేవు. అవన్నీ తెనుగులో వ్రాయాలి. అనువాదాలైనా చేయాలి. అవి ప్రకటించాలి. తక్కువధరలకు అమ్మగల్గాలి. అప్పుడందరుకొని చదువగల్గుతారు. అజ్ఞానముతో క్రొత్తవి కనుగొనగల్గుతారు. ఎవరు? మేధావులు. ఈపని మేధావులు చేయాలి. అనువాదాలే కాక సొంత గ్రంథాలు వ్రాయాలి.

అందఱు సమానము అనే పిచ్చి సిద్ధాంతాన్ని నమ్ముకుంటే అభివృద్ధే ఉండదు. మేధావులను గుర్తించి వారి కెక్కువ సౌకర్యాలు కల్గిస్తే కాని వారి పని చేయలేరు. మనము రిజర్వేషన్లని, అట్టడుగు వర్గాలను పోషించాలని, వారి నందఱిని అక్షరాస్యులను చేయాలని వచ్చిన ద్రవ్యమంతా దుర్వ్యయం చేస్తే అభివృద్ధే ఉండదు. ఇప్పటికు మనము వయోజనవిద్య క్రింద కొన్ని కోట్లు ఖర్చుపెట్టుచున్నాము. ఖర్చయిన కోట్లు లెక్క చెప్తున్నాము కాని ఎంతమందికి చదువువచ్చిందో చెప్పడం లేదు. దానికి సులభమైన పద్ధతులు వ్రాస్తే నాయకులు అధికారులు గుర్తించడం లేరు. మన నాయకులు, అసమర్థమైన అధికారాంగము మేధావులను అణగద్రొక్కి ఇతర దేశాలకు వలసపోయేటట్లు చేస్తున్నారు. సమర్థమైన నాయకత్వము, పాలనవస్తే కాని ఇదిమారదు.

ప్రస్తుతం హిందీలోకూడ చాలా అనువాద గ్రంథాలు వస్తున్నవి. స్వతంత్ర గ్రంథాలు విలువగలవి అన్ని రంగాలలో ఎన్ని వస్తున్నవో ఆ భాష బాగా వచ్చినవారు చెప్పాలి. ఇప్పుడు అగ్రరాజ్యాలైన అమెరికా రష్యాలు శాస్త్రవిజ్ఞానములో చాలా ముందుకు పోయినవి. అందులో సొంత గ్రంథాలు వచ్చినవి. ఆభాషలను నేర్చుకొని అవి చదివి వానిని అనువదించాలి. ఈ విషయములో మనకన్న చాల చిన్న దేశాలైన ఇంగ్లండు, ఫ్రాన్సు, జర్మనీలు కూడ మనకన్న ముందున్నవి. ఆభాషలు కూడ నేర్చుకొని అందలి విజ్ఞానముకూడ తెనుగువారి కియ్యాలి. వారు సొంతగ్రంథాలు తెనుగులో వ్రాయాలి.

అందఱు అన్నిపనులు చేయలేరు. అందువలన మేధావులు కూడ పనులు పంచుకొని అందులో అభివృద్ధిని సాధించాలి. ఆ సాధించిన విజ్ఞానము తండ్రి తన కుమారుల కందించినట్లుగా ఇతరు లందించలేరు. కాబట్టి అవి కులక్రమముగా వచ్చి కులవృత్తులైతే అధికాభివృద్ధి వస్తుంది. కులవృత్తులు వృద్ధిపొందాలి. క్రొత్త విజ్ఞానాన్ని సరిగా అందింపగల క్రొత్త కులములు రావాలి. కులవృత్తులను ప్రోత్సహిం

చాలి, పోషించాలి గాని నాశనం చేయకూడదు. మన కులవృత్తులు శిల్పము, నాట్యము, నృత్యము, నేత వగైరాలు ప్రపంచఖ్యాతిని సంపాదించి మన దేశాన్ని రత్నగర్భ అనిపించినవి. మనతో వ్యాపారం చేయడానికి మన విశ్వవిద్యాలయాలలో చేరి వానిని నేర్చుకోవడానికి (ఇప్పుడు మనవారు విదేశాలకు పోతున్నట్లుగా) ఇతర దేశాలు వెనుక మన దేశానికి వచ్చినవి. ఇది తెలియక వోట్లు సంపాదించి తాము శాశ్వతంగా అధికారంలో ఉండడానికి, మన అసమర్థులైన నాయకులు జాతి మత కులాభిమానాలు ఈభేదాలు పోవలెనంటున్నారు ప్రతి నాయకుని నోట ఈ పిచ్చిమాటలే వస్తున్నవి. పోవలసింది అభిమానము కాదు దురభిమానము. అదే ఈ నాయకులను పట్టిపీడిస్తున్నది. వారే దురభిమానం పెంచి పార్టీలై ఒకరినొకరు చంపుకొంటున్నారు. ఇది పోవాలి. అట్టి నాయకత్వం పోవాలి. అభిమానం లేకపోతే–సదభిమానం–ఏ జాతినీ, ఎవరునూ పైకి రారు.

ఇప్పుడు ప్రపంచంలో ఇంగ్లీషుకున్న స్థానము తక్కిన భాషలకు లేదు. కాబట్టి ఆంధ్రులు ఇంగ్లీషును వదలరాదు. అంటే అందరు ఇంగ్లీషు తప్పకుండ నేర్చుకోవలెనని అర్థము కాదు. వెనుక చెప్పినట్లు పనులు పంచుకొని వంశపారంపర్యంగా ఆవిజ్ఞానాన్ని పెంచుకోవాలి. హిందీకన్న ఇంగ్లీషు ముఖ్యమయినది. గ్రహించాలి. విజ్ఞానాభివృద్ధికే కాక ఇతర దేశాలకు వెళ్ళవలసి వచ్చినప్పుడు ఆభాషల అవసరం కూడ ఉన్నది. అందులో వారు వ్యవహరించవలె కదా !

పిడికెడు దేశమైన ఇంగ్లండు ఎక్కువ ప్రపంచాన్ని కొంతకాలం పరిపాలించింది. (విజేతలు మామూలుగా చేసినట్లు) వారు గెలిచిన చోట్ల ఓడినవారికి తమ భాష నేర్పారు. వారి జనసంఖ్య వృద్ధిపొంది ఇతర దేశాలను వారాక్రమించారు. జనసంఖ్య వృద్ధిపొందడం నేరమనుకొనే వారు మూర్ఖులు. తెలివిలేనివారు. జనసంఖ్య పెరిగిన పాశ్చాత్యదేశాలు ఆసియా, ఆఫ్రికా, ఆస్ట్రేలియా, అమెరికాల నాక్రమించి పరిపాలిం

చినవి. దానికి వారి ఆయుధసంపత్తి కారణము. అమెరికాలో USA, కెనడా, ఆస్ట్రేలియాలలో ఆంగ్లేయులు, ఇంగ్లీషు రాజ్యాలను స్థాపించారు. అక్కడివారు కూడ ఇతరభాషలు మాట్లాడువారు మాతృభాషతో పాటు ఇంగ్లీషుకూడ నేర్చుకొని అందులో సొంతగ్రంథాలు విలువగల వానిని రచించారు. రవీంద్రుడు బెంగాలీలో వ్రాసినవి కొన్ని తానే ఇంగ్లీషులోనికి అనువదించాడు. ఇంగ్లీషుభాష ప్రపంచభాష అయినందున అందులో వెలువడిన మంచిగ్రంథా లమ్ముడుపోయి ధనలాభము ఎక్కువగా కలుగుట వలన ఆంగ్లేయులు, ఇతర దేశీయులు వేఱు మాతృభాష కలవారు కూడ ఇంగ్లీషులో గ్రంథరచనలు చేశారు.

పడమటి బుద్ధిలో చెడుమాత్రమే బాగా తలకెక్కిన మన నాయకులకు, (శ్రీ) గాంధీ నెహ్రూల అనుయాయులకు, వారి అడుగు జాడలలో నడిచే యువకులకు మతముయొక్క ఆవశ్యకత, గొప్పతనము తెలియదు. క్రైస్తవులు ముస్లిములు కూడ తమ మత సంప్రదాయాన్ని వదలడం లేదు. ప్రపంచంలో అత్యుత్తమమైన సంప్రదాయము, తర్కానికి నిలిచిన ఏకైక భారతీయ సంప్రదాయమును వీరు నిందిస్తూ ధర్మద్రోహులైనారు. ఏజాతి తన సంప్రదాయాన్ని (tradition) కించపరుస్తుందో, గౌరవించదో ఆజాతి అధోగతికి పోతుంది, ఉన్నత స్థితికి రాను మతాన్ని కూడ చర్చావేదికమీదికి లాగిన ఘనత ఒక్క మన సంస్కృతిదే. ప్రపంచాన్నంత ఆక్రమించిన బౌద్ధ, క్రైస్తవ, ముస్లిము మతాలు మన దేశానికి వచ్చిన తరువాత లోక ముడుచుకొన్నవంటె అది (శ్రీ) శంకరాచార్యులు మొదలైనవారు మన ధర్మాని కిచ్చిన తార్కికమైన పునాదియే కారణం. శ్రుతి, యుక్తి (reason) అనుభవము మూటికి నిల్చిన సంస్కృతిని ఏ మతము ఎదిరించలేదు. పడమటి బుద్ధే తలకెక్కి అధికారానికి మతంవల్ల పైకి రావలెనని చూచే B. J. P., శివసేన, R. S. S. వర్గాలకు మన ధర్మము గొప్పతనము తెలియదు.

వారితో చేరి విశ్వహిందూపరిషత్తు, ఇంకా కొందఱు స్వాములు కూడ యువకులను తప్పుత్రోవ పట్టిస్తున్నారు. ప్రత్యక్షంగా కండ్లకు కనబడే సత్యాన్ని త్రోసిపారేస్తున్నారు. అంతా సమానమని చాటే పాశ్చాత్యులు ప్రతిచోట భేదాన్ని ప్రదర్శించడం మన గ్రుడ్డి నాయకులకు కనబడడం లేదు. "భేదాలు సహజం. అంతా సమానం కాదు." ఇది గుర్తించి ప్రణాళిక వేయాలి. అందఱు అన్ని పనులు చేయలేరు. చేయగల్గినా అట్లుచేయడం సుఖమివ్వదు. పనులు పంచుకొనిచేసే కుటుంబము, సంఘము అందఱికి సుఖమిస్తుంది. అవే కులాలు, వర్ణాలు ఏవిద్య అయినా, వృత్తి అయినా తండ్రినుంచి కొడుకులకు రావడం వల్ల వంశపారంపర్యంగా రావడం వల్ల ఆవృత్తి ఉన్నతశిఖరాలందుకుంటుంది. మన ఔన్నత్యానికి కారణము మన వర్ణాశ్రమ ధర్మము. అది భగవన్నిర్మితము (భగవద్గీతలో శ్రీకృష్ణుడు అది నేను చేశానన్నాడు) మానవనిర్మితమనే బోధ తప్పుడు బోధ. ఆ ధర్మాన్ని నిర్మూలించడానికి బుద్ధుడు, అగ్బరు, నానకు, గాంధీలు ప్రయత్నించి విఫలురైనారు. జయప్రకాశనారాయణ దీనిబలానికి ఆశ్చర్యము ప్రకటించాడు.

లౌకిక విద్య, పదవులు అధికారాలు తాత్కాలికంగా కొద్ది కాలము సుఖమిచ్చేవి. మతవిద్య-ప్రతిమతముకూడ-నిత్యసుఖాన్ని చెప్పేది. నిత్యసుఖమిచ్చే, చెప్పే మతము గొప్పతనాన్ని గుర్తించలేని మన ప్రస్తుత హిందూనాయకులు హిందూసంస్కృతిని నాశనం చేస్తున్నారు. అందఱి మేలు కోరేది మన ధర్మం. మన హిందువుల నిత్య ప్రార్థన సర్వజనులు సుఖించవలె, సర్వలోకములు సుఖించవలెనని. ఇంకే మతము ఈ కోరిక కోరుతున్నదో బుద్ధిమంతులైన యువకులు చూచుకోవలె. అట్టి యీ ధర్మాన్ని, సర్వమతసమానం ప్రధాన సూత్రమైన ఈ ధర్మాన్ని సరిగా గ్రహించలేక అధికార దాహంతో, పాపులిస్టు పద్ధతులతో ప్రజలను మోసగించి పైకి రావలెనని అన్నిపార్టీలు,

BJP, శివసేనతో సహా ప్రయత్నిస్తున్నవి. జనులమధ్య పోట్లాటలు, ద్వేషాలు, హత్యలు పురికొల్పుతున్నవి. వీరు యువకులను చీల్చి ఒకరిని మరొకరిపై ఉసి కొల్పుతున్నారు. ఈ ద్వేషబోధ తన స్వలాభం కొఱకు బ్రిటిషువాడు చేశాడు. వాడిచదువు చదివిన మన పిచ్చి నాయకులు ప్రజలవోట్ల కోసం కులమతాలమధ్య ద్వేషాలు పెంచుతున్నారు. ఈ పార్టీ విధానము, ఈ వోట్ల పద్ధతి పోతేకాని దేశంబాగుపడదు. వెనుక ఇక్కడ అన్ని కులాలవారు కలిసిమెలిసి పనిచేశారు. భేదాలు గుర్తించి సరిగా ప్రవర్తిస్తేనే ఐకమత్యము, అందఱు సుఖించడమున్నూ. ఒక కుటుంబములోని వ్యక్తు లందఱు సమానంకాదు. అందులో పెద్ద, పిన్న సమానులు ఉన్నారు. తల్లిదండ్రులు నిష్పక్షపాతంగా ఎవరికి కావలసిన సౌకర్యాలు వారికిస్తారు. అందఱి కొకే సౌకర్యా లుండవు. పసిపిల్ల వానికి చనుబాలిస్తుంది తల్లి. పెద్దకొడుకుకు అన్నం వండి పెట్తుంది. ఈ శిశువు కూడ పెద్దవాడై అన్నమే తింటాడు. అన్నను తమ్ముడు గౌరవిస్తాడు. అన్న తమ్ముని దయతో చూస్తాడు. ఉభయులు తల్లిదండ్రులను పెద్దలను గౌరవిస్తారు ఇది సరియైన నాగరికత. భేదాలు సత్యమని గుర్తించి వేసిన ప్రణాళిక. రామాయణకాలంలో ఆయా ప్రాంతాలను గుహుడు, సుగ్రీవుడు పరిపాలించారు. మౌర్యచంద్రగుప్తుని కాలంలో ఆటవిక ప్రభువు లున్నారు. ఆంధ్ర దేశాన్ని వెలమలు, రెడ్లు కూడ పరిపాలించారు. వారందఱు ఈ ధర్మాన్ని గౌరవించారు. ఆదరించారు. ఇది మన నాయకులు గ్రహించడం మంచిది. యువకులున్నూ.

మన విద్యాబోధన మాన్పించి తన విద్య మన యువకులకు బోధించి మన ధర్మాన్ని బ్రిటిషువాడు నాశనం చేశాడు. వాడిపాలన పోయినను, నాయకులు వారిశిష్యులై, ఆచదువులవలన పైకి వచ్చారు గనుక, ఆచదువే చెప్తున్నారు. మన పత్రికలు, రేడియోలు, టి.వి.లు చేసే బోధకూడ ఇదే. ప్రభుత్వం మన ధర్మాన్ని నాశనం చేయుడానికి

 

పూనుకొన్నది. ఈయువకుల బుద్ధులను మార్చడంకష్టం. **The first impressions are the strongst** అని విద్యాసూత్రము. అధర్మాన్ని తర్కంతో ఖండిస్తూ, ధర్మాన్ని బోధించే విద్యాలయాలు మనధర్మాభిమానులు పెట్టుకోవాలి. తమ పిల్లలకు చెప్పుకోవాలి.

ఆంధ్రు లిందులో తక్కినవారికి త్రోవ చూపాలి. మన ధర్మాన్ని ప్రచారం చేయాలి. గ్రంథాలువ్రాసి ప్రకటించాలి. దీనికి తిరుపతి దేవాలయానికి వచ్చే ఆదాయాన్ని ఆంధ్రులు ఉపయోగించుకోవచ్చు. పుట్టపర్తి సాయిబాబాగారు, మతసంస్థ అయినా ఈ చదువుకు పెద్ద ప్రోత్సాహమిస్తున్నారు. అల్లే తిరుపతి దేవాలయద్రవ్యము కూడ లౌకిక విద్యతో కలిసిన ధర్మము బోధించే విద్యాలయం, విశ్వవిద్యాలయం పెంపొందించవచ్చు. తెనుగులో మంచి గ్రంథాలు వ్రాయించి ప్రచురించాలి, వాటిని తక్కినభాషలలోకి, ముఖ్యంగా ఇంగ్లీషులోకి అనువాదము చేయించి ప్రకటించవచ్చు. ఇతర శాస్త్రాలు నవీన శాస్త్రబోధ, పుస్తక ప్రచురణ తప్పు కాదు. విద్యాలయాలకు స్వేచ్ఛ ఉండాలి. ప్రభుత్వము తన ఉద్యోగాల కేమికావలెనో చెప్తే ఆవిద్యాలయాలు సొంతసిలబసులతో విద్యాబోధచేయవచ్చు. విశ్వవిద్యాలయాలుకూడ పనులు, శాఖలుపంచుకొని వానిని వృద్ధిలోనికి తీసుక రావడం మంచిది. సాహిత్యం మాత్రం అందఱు సమానంగా ఆదరించాలి. సాహిత్యము, మతవిద్య ప్రధానంగా, ఇతరసైన్సులు నేర్పాలి. నిత్యానందమిచ్చేది మతవిద్య. ఈ జన్మకు ఆనందమిచ్చేది సాహిత్యవిద్య–అది మాతృభాషలో జరగాలి. వీనికి కావలసిన ద్రవ్యం సంపాదించేవి సైన్సు మొదలైనవి. ధర్మార్థ కామ మోక్షములకు ఈ విద్యాలయాలు తగిన చోటు చూపించాలి. ఇది ఆంధ్రులు చేయవలసిన, చేయగలపని. దీనికి సాధన సంపత్తి అధికంగా ఉన్నది వీరికే. సమర్థులను ఆయాపనులలో నిర్వాహకులుగా చేయాలి. వారికి స్వేచ్ఛయివ్వాలి. బ్రిటిషు

వాడు మన ధర్మాన్నే కాక చరిత్రను కూడ తారుమారు చేశాడు. అవన్నీ దిద్ది క్రొత్త చరిత్ర వ్రాయాలి. మతాలు ఇట్టి విద్యాలయాలు స్థాపించాలి.

ఈవిధంగా క్రొత్త గ్రంథాలు వ్రాయాలి. ప్రకటించాలి. దానికి సమర్థులైనవారు తెలుగువారిలో ఉన్నారు. అవి ప్రకటించడానికి కూడా ప్రపంచములోకల్ల అత్యధిక ధనమార్జించిపెట్టే తిరుపతి దేవస్థానము ఆంధ్రుల క్రింద ఉన్నది. అదే ఇటువంటివిద్యాసంస్థను స్థాపించి భారతదేశానికి–భారతదేశానికేగాదు ప్రపంచానికే విజ్ఞానము పంచిపెట్టగలదు.

అసమర్థులైన నాయకులక్రింద పాలకుల క్రింద మన దేశము నలిగిపోతున్నది. పాశ్చాత్యులనుంచి అరువు తెచ్చుకొన్న ఈపిచ్చి డెమాక్రసీవల్ల దేశం అధోగతి పాలయింది. అనేకానర్థాలకు, హత్యలు, ధననష్టం, ద్వేషాలు మొదలైనవాటికి మూలమైన బహుపార్టీ విధానము, లక్షాధికారులుమాత్రమే పాల్గొనగల–అంటే జనసంఖ్యలో 99% లోని మేధావులు ఎప్పుడును పాలకులు కాలేని–ఈ దౌర్భాగ్యపు పెద్దమొత్తాలలో జరిగే ఎన్నికలు పోయి సులభంగా సమర్థులైన కొద్ది సంఖ్యలో పాలకులను–న:మైన పాలన కడ్డుపడే అర్థంలేని వేలకొలది లెజిస్లేటర్లను కాదు–ఎన్నుకొనే జాతీయవిధానం రావాలి. ప్రజలు మేల్కొని–ఈపద్ధతి అంచెల మీద మంచివారి నెన్నుకొనే పద్ధతి తీసుకరావాలి.